# ఆంధ్రప్రదేశ్ శాసనసభ కార్యకలాపాలు

# ANDHRA PRADESH
# LEGISLATIVE ASSEMBLY DEBATES

అధికార నివేదిక

**OFFICIAL REPORT**

**సోమవారము, డిసెంబరు 1, 2008**

**12 వ శా. స. XV స. వాల్యూం -- IX నంబరు -- 1**

**శక సంవత్సరము - 1930, అగ్రహాయణం - 10**

## MONDAY, THE 1st DECEMBER, 2008

**12 L.A. XV S. VOL-- IX No. - 1**

**10 - agrahayan, 1930 - S.E.**

#


శాసనసభ సచివాలయము

పబ్లిక్ గార్డెన్స్

హైదరాబాదు - 500 004.

**LEGISLATURE SECRETARIAT**
**PUBLIC GARDENS**
**HYDERABAD**
**500 004.**

## ఆంధ్రప్రదేశ్ శాసనసభ

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | : | శ్రీ కె. ఆర్. సురేష్‌రెడ్డి |
| ఉప సభాపతి | : | డా. (శ్రీమతి) జి. కుతూహలమ్మ |
| అధ్యక్షుల పేర్ల పట్టిక | : | శ్రీ గురునాథ రెడ్డి |
| | | శ్రీ బి. వేదవ్యాస్ |
| | | శ్రీ నాదెండ్ల మనోహర్ |
| | | శ్రీమతి వి. సునీతా లక్ష్మారెడ్డి |
| | | శ్రీ డి.నరేంద్రకుమార్ |
| | | శ్రీ కె. నగేష్ |
| కార్యదర్శి | : | శ్రీ కె. తుల్జానంద్ సింగ్ |
| ప్రత్యేక కార్యదర్శి | : | శ్రీ కె. గోపాలకృష్ణయ్య |
| సంయుక్త కార్యదర్శి | : | శ్రీ డి.శివరావు |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ ఎం. పాండురంగాచార్య |
| | | శ్రీ పి. సీతారాములు |
| | | శ్రీ డి. నర్సింహులు |
| | | శ్రీ పి. సత్యనారాయణ |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ కె. సుభాష్ చంద్రబోసు |
| | | శ్రీ డి. సత్యనారాయణ |
| | | శ్రీ ఎ. రామిరెడ్డి |
| | | శ్రీ ఎస్. జయరాం |
| | | శ్రీ కె. జగన్నాధరావు |
| | | శ్రీ మహ్మద్ జహీరుద్దీన్ |
| | | శ్రీ కె. సత్యనారాయణరావు |
| | | శ్రీమతి ఎ.సాయిలక్ష్మి |
| | | శ్రీమతి ఎస్.ఎ.జ్యోతి |
| | | శ్రీ జి. వెంకట కృష్ణ |
| | | శ్రీ పి. బాలకృష్ణమాచారి |
| | | శ్రీ జి.ఎల్. నవర్సింహారావు |
| చీఫ్ రిపోర్టర్ | | : శ్రీమతి టి. సుశీల |

------------

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ చర్చలు
# అధికార నివేదిక

## ( పన్నెండవ శాసనసభ)
## ( పదిహేనవ సమావేశము : మొదటి రోజు)
## సోమవారము, డిసెంబరు 1, 2008
## సభ ఉ. గం. 10.00 లకు ప్రారంభమైనది
## ( గౌ. సభాపతి అధ్యక్ష స్థానములో వున్నారు )

----------

విషయ సూచిక


సంతాప ప్రతిపాదనలు

1. భారత దేశ మాజీ ప్రధానమంత్రి శ్రీ విశ్వనాధ ప్రతాప సింగ్ మృతిపట్ల
2. ముంబాయిలో ఉగ్రవాదుల దాడులలో మృతి చెందిన వ్యక్తుల పట్ల


-------------

(జాతీయ గీతాలాపనతో  సభ ఉదయం 10 గంటలకు ప్రారంభమయింది.
అధ్యక్ష స్థానంలో గౌరవ సభాపతి ఉన్నారు)

## సంతాప ప్రతిపాదనలు

### 1. భారత దేశ మాజీ ప్రధానమంత్రి శ్రీ విశ్వనాధ ప్రతాప సింగ్ మృతిపట్ల

MR.SPEAKER: We have two Condolence Motions listed for the day. The first condolence motion is on the demise of Sri Vishwanath Pratap Singh, former Prime Minister of India. I request the Hon'ble Chief Minister to move the motion.

DR.Y.S.Rajasekhara Reddy, Chief Minister, Speaker Sir, I beg to move:

> "That this House places on record its deep sense of sorrow at the demise of Sri Vishwanath Prataps Singh, former Prime Minister of India and conveys its deep sense of sympathy to the members of bereaved family".

## భారత దేశ మాజీ ప్రధానమంత్రి శ్రీ విశ్వనాథ ప్రతాప సింగ్ మృతిపట్ల

డా.వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి : అధ్యక్షా, ఈవేళ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో బాధాతప్త హృదయంతో శ్రీ వి.పి.సింగ్‌గారికి నివాళులు అర్పించుకుంటున్నాము. మన మాజీ ప్రధాని శ్రీ వి.పి.సింగ్‌గారు భారత రాజకీయాల్లో సమున్నతమైన విలువల స్థాపనకు, ప్రజాహిత లక్ష్యాలకు బాగా పెద్ద పీట వేసి, సామాజిక న్యాయం అనే పదానికి కొత్త బాటలు వేశారు. నవంబరు,27వ తేదీన ఆయన చనిపోవడం చాలా బాధాకరమైన విషయము. నిజంగానే ఆయన మరణం దేశానికి తీరని లోటు. వి.పి.సింగ్‌గారు 1957 సంవత్సరంలో భూదాన ఆందోళనతో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి, కాంగ్రెస్ పార్టీలో అంచలంచెలుగా ఎదిగి ఎంతో ఉన్నత స్థానాన్ని అధిరోహించారు. మంచి పార్లమెంటేరియన్‌గా కూడా ఆయనకు పేరు ఉండేది. ఇందిరాగాంధీగారు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఆయన దేశంలోనే అత్యంత పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా రెండేళ్లపాటు పనిచేసి ఆ రాష్ట్రానికి ఎనలేని సేవ చేశారు. బడుగు వర్గాల మన్ననలు పొందారు. ఆయన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆ ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణ గురించి ప్రత్యేకంగా కృషి చేశారు. అయితే కొంత కాలం తర్వాత ఆ శాంతిభద్రతలను తాను అనుకున్న మేరకు కాపాడులేకపోయాననే బాధతో, ఉన్నత విలువలకు ప్రాధాన్యత ఇచ్చి ఆయన రాజీనామా చేయడం జరిగింది. రాజీవ్‌గాంధీ మంత్రివర్గంలో ఆయన ఆర్థిక శాఖ మంత్రిగా, రక్షణ శాఖ మంత్రిగా కీలకమైన పదవులు నిర్వహించారు. మంచి పరిపాలనా దక్షుడిగా, నిజాయితీ గల రాజకీయ వాదిగా ఆయన ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు జాతీయ స్థాయిలో. ఏ పదవి చేపట్టినా తనదంటూ విలక్షణమైన ముద్ర వేశారు. ఆయన ఎప్పుడూ కూడా తన అంతరాత్మ ప్రబోధంతోనే నడుచుకోవాలని, అప్పటికప్పుడు కలిగే రాజకీయ ప్రయోజనాలు కోసం పనిచేయకూడదనే భావంతో రాజకీయాలు నడిపాడు. నిజాయితీనే ప్రజా జీవితంలో పెట్టుబడిగా నమ్మి, అలాగే జీవించిన ఆయన రాజకీయ జీవితం నిజంగానే మనందరికీ స్ఫూర్తిదాయకం. ఆయనకు మంచి అలవాట్లు కూడా ఉండేవి. ఫోటోగ్రఫీ, కవిత్వం వ్రాయడం ఆయన అభిరుచులు. గడిచిన కొన్ని మాసాలుగా ఆయనకు వచ్చిన జబ్బు వల్ల ఆయన భౌతికంగా చాలా ఇబ్బందులు పడ్డా, నైతికంగా ఆయన స్ఫూర్తి మన అందరికీ చిరస్మరణీయం. *ప్రధానిగా ఆయన ఎక్కువ కాలం పనిచేయకపోయినా, రాజకీయాల్లో తనదంటూ ప్రత్యేకమైన ముద్ర వేశారు. లోక్‌పాల్ వ్యవస్థను నెలకొల్పేందుకు పూనుకోవడం, ఎన్నికల సంస్కరణల కోసం కృషి చేయడం ఆ రోజుల్లో అందరి మన్ననలు పొందింది. ఆయన దేశ ప్రధానిగా ఉన్నప్పుడు బలహీన వర్గాల సముద్ధరణకు మండల్ కమీషన్ ఏర్పాటు చేసి చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకుని,సామాజిక న్యాయాన్ని రాజకీయ అనివార్యతగా మార్చిన పరిపాలనా దక్షుడిగా ఈవేళ వర్తమాన రాజకీయాలకు ఆయన దిశా నిర్దేశం చేశారు. జాతీయ స్థాయిలో బలహీన వర్గాలకు తొలిసారిగా ప్రాధాన్యత* ఇచ్చిన నేతగా ఆయన మంచి పేరు తెచ్చుకున్నారు. పలు రాష్ట్రాల రాజకీయాల్లో బి.సి.ల నాయకత్వం బాగా పెరగడానికి ఆయన కారకుడు అయ్యాడు. నిజంగా ఆయన ఈనాడు మన మధ్య లేకపోవడం చాలా బాధాకరమైన విషయం. అంత స్ఫూర్తిదాయకుడు, అంత నిగర్వి, నిక్కచ్చిగా తాను అనుకున్న విషయాన్ని అమలు చేయగల్గినటువంటి మంచి నాయకడు, మంచి నేత మరణించడం చాలా బాధాకరమైన విషయం. ఆయన మరణం పట్ల ఆయన కుటుంబానికి నా తరఫున, ఈ సభ తరఫున ప్రగాఢమైన సంతాపం తెలియచేస్తూ, భారతదేశ రాజకీయ చరిత్రలో ఆయన అధ్యాయం నిరంతరం స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. ఉన్నత ప్రజా జీవితానికి ఒక మంచి ప్రేరణగా ఉన్న వి.పి. సింగ్‌గారిని మనమందరం శాశ్వతంగా గుర్తుంచుకోవాలి. ఆయన మరణం పట్ల ఈ సభ తన తీవ్రమైన సంతాపాన్ని వ్యక్తపరుస్తోంది.

శ్రీ ఎన్. చంద్రబాబునాయుడు (కుప్పం): అధ్యక్షా, మాజీ ప్రధాని శ్రీ విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్ మరణంతో దేశం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయింది. తెలుగుదేశం పార్టీకి అయితే వారు చాలా శ్రేయోభిలాషి. అలాంటి నాయకుడిని కోల్పోవడం జరిగింది. అయితే 17 సంవత్సరాలుగా బ్లడ్ కాన్సర్‌తో, మూత్రపిండాల వ్యాధితో బాధపడుతూ, 27-11-2008వ తేదీన ఢిల్లీలో అపోలో హాస్పిటల్‌లో మరణించడం చాలా బాధాకరం. ఆయనకంటూ రాజకీయాల్లో ఒక విశిష్టమైన స్థానాన్ని సంపాదించుకున్నారు. వారు బి.ఏ. చదివిన తరువాత లా డిగ్రీ తీసుకున్న తర్వాత, తిరిగి తాను అణుశాస్త్రవేత్త కావాలనే ఉద్దేశ్యంతో 30 ఏళ్ల వయసులో పూనేలో బి.ఎస్‌సి, తర్వాత ఎం.ఎస్‌సి చేయాలనుకున్నారు. అయితే అది చేయకముందే రాజకీయాల్లోకి రావడం జరిగింది. మొట్టమొదటిసారిగా 1957వ సంవత్సరంలో భూదాన ఆందోళన ద్వారా ఆయన రాజకీయాల్లో అడుగుపెట్టారు. మొట్టమొదటిసారిగా విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్‌గారు 1969లో శాసనసభ్యుడిగా ఎన్నికై, తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. రెండు దశాబ్దాల కాలం వివిధ పదవులు చేపట్టారు. ఆ విధంగా ఆయన అంచలంచెలుగా ఎదుగుతూ వచ్చి,కేంద్రంలో అనేక పదవులు చేపట్టారు. కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు ఇన్‌కమ్ ట్యాక్స్ ఎగవేసే వారిందరిపైన పోరాడటం, అటువంటి వారిని గట్టిగా శిక్షించడం జరిగింది. బ్లాక్ మనీ పైన జాతీయ స్థాయిలో చర్చ జరగాలని పిలుపు ఇచ్చారు. ఆయన రక్షణ మంత్రిగా ఉన్నప్పుడు ఆ శాఖను ప్రక్షాళన చేసే సమయంలోనే బోఫోర్సు కుంభకోణం బయటకు రావడం, దానిపై, ఆయన కాంగ్రెస్ పార్టీనీ వదిలి, బయటకు వచ్చి, దేశం మొత్తం మీద అనేక ఉద్యమాలు చేపట్టారు. ఆ సందర్భంగా అన్ని రాజకీయ పార్టీలకు చెందిన 105 మంది పార్లమెంటు సభ్యుల చేత రాజీనామా చేయించగలిగారు. ఆ విధంగా నైతిక విలువలతో ఆయన ముందుకు వెళ్లారు. ఆ విధంగా తాను నమ్మిన సిద్ధాంతాల కోసం పోరాటం చేశారు

ఉ .10 .10

అందుకోసం జనమోర్చా అనే ప్లాట్‌ఫాం ఏర్పాటుచేశారు . తరువాత జనమోర్చా, జనతాపార్టీ, కాంగ్రెస్, లోక్‌దళ్ అన్నిపార్టీలను విలీనంచేసిన సందర్భంలో ఎన్‌టిఆర్‌గారితో కలిసి జాతీయస్థాయిలో నేషనల్‌ఫ్రంట్ ఏర్పాటుచేస్తే బాగుంటుందని చర్చకు రావడం, దానిపైన నేషనల్ ఫ్రంట్‌కు కూడా రూపకల్పన చేశారు . ఆయన మొట్టమొదటిసారిగా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా గెలవడం, గెలిచిన తరువాత పార్లమెంటులో మంత్రులందరూ కూడా కుటుంబ ఆస్థిపాస్తుల వివరాలను ప్రకటించాలని నిర్ణయించడం, లోకపాల్ వ్యవస్థ తెచ్చి రాజకీయ అవినీతి నిరోధించడానికి ప్రయత్నం చేయడం అదేవిధంగా ఎన్నికల సంస్కరణలు తెచ్చి, దానికోసం ఒక పార్లమెంటరీ కమిటీని ఏర్పాటుచేసి ఎన్నికల రిఫాంస్ తేవాలని ప్రయత్నం చేశారు . ఇంతే కాకుండా మొట్టమొదటిసారిగా నేషనల్ ఫ్రంట్ వచ్చిన తరువాత రీజనల్ పార్టీలనన్నింటిని ఒక వేదికపైకి తీసుకుని వచ్చి, ఎన్‌టి రామారావుగారు ఛైర్మన్‌గా, విపి సింగ్‌గారు కన్వీనర్‌గా రాజకీయపార్టీలను ఒక ప్లాట్‌ఫాం క్రిందకు తెచ్చి, గవర్నమెంట్‌లో భాగస్వాములను చేసి, రీజినల్‌పార్టీలను బలోపేతం చేయడానికి కారకులు అయ్యారు . పివి నరసింహా రావుగారి ప్రభుత్వం కంటే ముందు ఆర్థిక మంత్రిగా వుండి దేశంలో సరళీకృత విధానం ప్రవేశపెట్టాలని ఆయన ప్రయత్నం చేశారు . ఆయన కొన్ని విలువలతో కూడిన , రాజకీయాలలో ముందుకుపోతూ, బందిపోట్లను అరికట్టడానికి విశేషమైన కృషిచేసి, ఆ కర్తవ్య నిర్వహణలో ఫెయిల్ అయ్యాననే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు . అప్పటినుండి వారికి దేశం మొత్తంనుండి గుర్తింపు రావడం జరిగింది . వారు ప్రైంమినిస్టరుగా ఉన్నపుడు దేవీలాల్ డెప్యూటీ ప్రధానమంత్రిగా ఉన్నపుడు అప్పట్లో కష్టాలలో ఉన్న రైతులను ఆదుకోడానికి రు . 10 వేల రూపాయల రుణం మాఫీ చేసిన ఘనత

విపిసింగ్‌గారికి, దేవీలాల్‌గారికి దక్కుతుంది . స్వర్ణాలయాన్ని సందర్శించి, గాయపడిన సిక్కుల హృదయాలకు స్వాంతన కలిగించారు . శ్రీలంకలో జాతుల ఘర్షణలో ఇరుక్కుపోయిన భారత బలగాలను వెనక్కు పిలిపించి ఆ విధంగా అక్కడ ఉన్న తమిళులను కాపాడడం, మొట్టమొదటిసారిగా మండల్ కమీషన్ వేయడం, కేంద్రసర్వీసులలో వెనుకబడిన వర్ణాలకు రిజర్వేషన్ పెట్టిన ఘనత విపిసింగ్‌గారి నాయకత్వంలోనే జరిగింది . అనేక రిఫాంస్, సామాజిక మార్పుల కోసం కృషిచేసిన వ్యక్తి విపి సింగ్‌గారు . ఈ రోజు మారిన రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా మనమందరం సామాజిక న్యాయం గురించి మాట్లాడుతున్నామంటే ఆ సామాజిక న్యాయం కోసం మండల కమీషన్ వేయడం, దానిని ఆధారంగా చేసుకుని కేంద్ర సర్వీసులలో రిజర్వేషన్ పెట్టిన ఘనత విపి సింగ్‌గారికి దక్కుతుంది . ఎన్‌టిఆర్‌గారు నేషనల్ ఫ్రంట్ ఛైర్మన్‌గా ఉన్నపుడు మేము కూడా ఆయన దగ్గర కలిసి పనిచేసే అవకాశం వచ్చింది . చాలా సింపుల్‌గా ఉంటూ, ఎప్పటికప్పుడు ప్రజలకు దగ్గర కావాలి, అనేక సంస్థల ద్వారా మెరుగైన పాలన ఇవ్వాలని వారు ముందుకు పోయారు . వారు 25 సంవత్సరాలలో ఇవన్నీ చేశారు . 1990లో ఆయనకు క్యాన్సర్ రావడం వలన క్రియాశీలక రాజకీయాలకు దూరం కావడం, రాజకీయాలలో ఇంకా ఏదో చేయాలనే తపనతో యుపిలో భూములు కోల్పోయిన రైతులకు అక్కడకు వెళ్లి పూర్తిస్థాయిలో రాజకీయాలలో ఉంటూ, పెద్ద ఎత్తున ఉద్యమాలు కూడా చేపట్టారు . ఆయన ఆరోగ్యం సహకరించకపోయినా, లేని శక్తి తెచ్చుకుని ఎప్పటికప్పుడు ప్రజలకోసం పోరాడినందుకు ఉదాహరణగా ఆయన ఒక మాట అన్నారు . వ్యాధులు భౌతికంగా నామీద గెలుపు సాధించవచ్చుగాక, నాలోని పోరాటస్ఫూర్తిని అవి లొంగదీయలేవని చాలా స్పష్టంగా చెప్పారంటే, ఏవిధంగా నమ్ముకున్న సిద్ధాంతం కోసం ప్రజాసమస్యలపైన పోరాడారో ఇది ఒక చిన్న ఉదాహరణ . అలాంటి వ్యక్తి ఈ రోజు మనముందు లేకుండా పోవడం, దేశం ఒక గొప్ప రాజకీయ నాయకుడిని కోల్పోయింది . ఆయన మరణంపట్ల ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి కలగాలనీ, వారి కుటుంబసభ్యులకు తెలుగుదేశం పార్టీ తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను .

శ్రీ ఇ . రాజేందర్ (కమలాపురం): అధ్యక్షా, విపి సింగ్‌గారు 27, నవంబరు, 2008 నాడు పరమపదించారని తెలిసి మాపార్టీ చాలా బాధాతప్త హృదయంతో వారి కుటుంబానికి సానుభూతిని తెలియజేయడం జరిగింది . యుపిలోని అలహాబాద్, మాండా సంస్థాన వారసునిగా వారు జన్మించి, వారు జీవించి ఉన్నంతవరకు పేదప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిన గొప్పవ్యక్తిగా విశ్వనాథ్ ప్రతాప్ సింగ్‌గారిని చెప్పుకోవచ్చు . వారు రాజకీయాలలో ప్రవేశిస్తునే ఆనాడు భూ సమస్య చాలా ప్రధానమైన సమస్య కాబట్టి, అశేష ప్రజానీకం ఉన్న భారతదేశం వ్యవసాయక దేశం కాబట్టి భూ పంపకం జరగకుండా, రాజ భరణాలు రద్దు కాకుండా సామాన్య ప్రజానికానికి ఫలాలు అందవని గ్రహించిన గొప్పవ్యక్తి విశ్వనాధ ప్రతాప్‌సింగ్‌గారు . దానికనుగుణంగానే 50 ఏండ్లు భూదాన ఉద్యమంతోటే, సామాజిక దృక్పథంతో రాజకీయ జీవితం ప్రారంభించారు . 1969 లో మొట్టమొటదిసారిగా శాసనసభ్యునిగా ఎన్నికైన తరువాత, పార్లమెంటు సభ్యునిగా ఎన్నికైన తరువాత, వాణిజ్యపన్నుల శాఖ సహాయం మంత్రిగా పనిచేయడం జరిగింది . రాజీవ్‌గాంధీగారి హయాములో ఫైనాన్స్, రక్షణ మంత్రిగా ముక్కుసూటిగా , తాను ఏదైతే అనుకున్నారో ఏ ప్రజా జీవితానికి వెలుగు తీసుకుని రావాలని భావించారో దానిని నిర్మొహమాటంగా ఆచరించి చూపించిన గొప్పవ్యక్తి విపి సింగ్‌గారు . వారు ఏ పదవి నిర్వహించినా అయిదు సంవత్సరాలు పూర్తి చేయకపోవచ్చు . ఉన్నంతలో ఎవరినీ లెక్కచేయకుండా ప్రజల క్షేమము, ప్రజలకు న్యాయం జరగడమే ముఖ్యమని, పాలనలో ఉన్న గొప్పవ్యక్తులు ఆ దిశగా

పయనించాలని మార్గదర్శకత్వం చేసిన గొప్పవ్యక్తి విపిసింగ్‌గారు . అన్నింటికంటే చిరస్థాయిగా నిలిచే గొప్ప అంశం, అంబేద్కర్‌గారు ఏదైతే కలలు కన్నారో, కులాలు, మతాలు వైవిధ్యాలు, అంతరాలు లేని గొప్ప సామాజిక సామ్యవాద వ్యవస్థ ఏర్పడుతుందని వారు అనుకున్నారో అది నెరవేర్చడంలేదు . పాలకుల పట్ల , ప్రజాస్వామ్యం పట్ల పేదప్రజలలో అపోహ ఏర్పడే అవకాశం ఉంది . ఒకవైపు పేదరికం పెరిగిపోతుంది, అణగారిన వర్గాలు రోజురోజుకు పెరిగిపోతుంటే, బిలో పావర్టీలైన్ లోని ప్రజల సంఖ్య ఆపాలని తపనపడ్డ వ్యక్తే కాకుండా దానికోసం ఏదో చేయాలని తపించారు . దానిలో భాగంగా ఆరోజు సమన్వయం లేకపోయినప్పటికీ, ఒకేపార్టీ క్రింద లేకపోయినా అన్నిపార్టీలతో నడిపిన ప్రభుత్వ హయాములో బిసిలకు దేశవ్యాప్తంగా , ఒబిసిలను వారి జీవితాలు బాగుపడకుండా దేశం ముందుకు పోయినట్లు కాదు కాబట్టి నిర్మొహమాటంగా మండల కమీషన్ ఏదైతే సిఫారసు చేసిందో 27 శాతం రిజర్వేషన్ ప్రభుత్వ ఉద్యోగాలలో ఆచరించి చూపించిన ఘనత వారిది . ఆయన తను పదవిలో ఉండడం ముఖ్యం కాదు గానీ, అనుకున్నది ఆచరించి చూపుతామని చెప్పడం జరిగింది . ఆనాడు మండల్, కమండల్ అని భారతదేశ వ్యాప్తంగా ఎన్ని ఉద్యమాలు వచ్చినా అనుకున్నది ఆచరించి చూపిన గొప్పవ్యక్తి . వారు కుర్చీకోసం గానీ, పదవికోసం గానీ పాకులాడను అన్న దానికి ఉదాహరణే, యుపి ముఖ్యమంత్రిగా ఉన్నకాలంలో వారేస్వయంగా నేను దొంగల బారి నుండి రక్షించి శాంతిని నెలకొల్పే బాధ్యత స్వయంగా తీసుకుంటున్నాను, రెండు సంవత్సరాలలో ఆచరించి చూపుతానని చెప్పారు . అది సాధ్యం కాకపోవడం వలన వారంత వారే ఎవరూ కోరకపోయినా ముఖ్యమంత్రి పదవిని త్యాగంచేసిన గొప్పవ్యక్తి విపిసింగ్‌గారు . అన్నింటికంటే ముఖ్యంగా తెలంగాణా రాష్ట్ర సమితి 2008 లో ఎన్నికలలో గెలిచిన తరువాత ఢిల్లీలో మా రాష్ట్ర ఏర్పాటుకు చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా వారు అనేక సందర్భాలలో మా నాయకులను పిలిచి, వాకు మార్గదర్శకంగా నిలిచిన గొప్పవ్యక్తి . ఆనాడు ప్రధానమంత్రులలో ఐకె గుజ్రాల్‌గారు, దేవెగౌడగారు, విశ్వనాధ్ ప్రతాప్ సింగ్‌గారు గానీ వారు ముగ్గురూ కూడా తెలంగాణా రాష్ట్ర ఏర్పాటుకోసం తమ శాయశక్తులా ప్రయత్నం చేస్తామని చెప్పారు. 2004 నుండి చనిపోయే వరకు తెలంగాణా ఉద్యమాన్ని ఆశీర్వదించి, తెలంగాణా రాష్ట్ర ఏర్పాటును కాంక్షించిన గొప్పవ్యక్తి విపిసింగ్‌గారు . అందుకనే వారికి ఎన్నిమాటలు చెప్పినా కూడా తక్కువే కాబట్టే, ఈరోజు మనీ ఓరియెంటెడ్ సమాజంలో ఎథిక్స్‌గానీ, మోరల్‌వ్యాల్యూస్‌గానీ తరిగిపోతున్న ఈ సదర్భంలో వారిని స్మరించుకోవడం అంటే వారికి నివాళులు అర్పించడమంటే , వారు చూపించిన మార్గంలో ప్రయాణం చేయడం, వారు ఏదైతే ఆశయాలు నెలకొల్పారో, వారు ఏదైతే మార్గదర్శకంగా ఉన్నారో కులాలు, మతాలు అంతరాలు లేని సమాజం కావాలని కాంక్షించారో ఈ రోజు తప్పకుండా వారి ఆశయాన్ని గుర్తుపెట్టుకుని మనం ప్రయాణం చేయాలి .

ఉ. 10.20

ఈ సందర్భంగా వారి ఆత్మకు శాంతి చేకూరాలని మా తెలంగాణా రాష్ట్ర సమితి పక్షాన ఆ భగవంతుని ప్రార్ధిస్తూ, వారి కుటుంబ సభ్యులకు మా పార్టీ తరపున మా సానుభూతిని తెలియజేస్తున్నాను.

MR SPEAKER: We are on condolence motion. I request the Hon'ble Members to kindly keep this in mind.

శ్రీ నోముల నర్సింహయ్య (నక్రెకల్)ః అధ్యక్షా, విపి సింగ్ గారు ఒక సంస్థనాధిపతి అయిన రాజా రాజబహద్దూర్ రామ్ గోపాల్ సింగ్ గారి కుమారుడు. ఒక సుసంపన్నమైన కుటుంబంలో పుట్టినా, అట్టడుగు,

బడుగు, బలహీన వర్గాల వారి హక్కుల కోసం, తాను నమ్మిన నిజాల కోసం నిర్భయంగా నిలబడిన వ్యక్తిత్వానికి మారు పేరే వి.పి. సింగ్. ఒక రాజకీయవేత్తగా, కొద్ది కాలంలోనే మెరుపులాగ మెరిసి అనేక మార్పులను తీసుకువచ్చిన మహా రాజకీయ కోవిదుడు, సంస్కర్త అని చెప్పవచ్చును. వారు ఎంత ప్రసిద్ధి చెందిన రాజకీయ కోవిదుడు, సంస్కర్తో, అంతకు తక్కువ కాని కవి, చిత్రకారుడు ఆయన. వారు చెప్పిన మాటలు వింటే, '' కవిత్వం మూలాలు ఇంద్రధనుస్సు మూలాల లాంటివి. కంటికి కనిపిస్తాయి కాని, చేతికి అందవు.'' వారు చెప్పిన మాట అది. వారు సామాజిక స్పృహతో అన్ని అంశాలనూ జోడించి చూపారు. ఒక కవితకు సంబంధించి వారు చెప్పిన మాట.

'' ఏ తుక్‌డా గర్తీ, ఏ తుక్‌డా ధరణీ, ఆకాశ్ బోల్కే '' అది ఎంత మంచి కవిత్వమంటే, చెప్పడానికి వీలు లేనంత అర్థం వచ్చే విధంగా సామాజిక స్పృహ స్ఫురించే విధంగా వున్న మాట అది. ఒక మాటలో ఆయన చెప్పిన కవిత చదువుతాను. '' ఒక రోజు నా పేరు నా నుంచి విడివడి నాకు దూరంగా నిలిచింది. ప్రపంచం అడిగింది నన్ను, ఇప్పుడు ఈ రెండింటిలో నువ్వు ఎవరివి ? నా పేరు నిజం అన్నాను. నేను లేనని అన్నాను. నాటి నుంచి నేను ఒక అపరిచితుడిని. నేను ఒక అగంతకుడిని. '' నిజం అనే దానికి నిజంగా జీవిత ఖైదీగా వున్నది ఎవరయ్యా అంటే ఒక్క విపి సింగ్ గారే తప్ప మరొకరు కాదనే మాటను కూడా ఈ సభ దృష్టికి తీసుకురాదలచుకున్నాను.

సామాజిక స్పృహ లేక, వర్ణ దురహంకారంతో అల్లాడుతున్న వర్గాలకోసం, దళితుల కోసం, అణగారిన వర్గాల కోసం 18 సంవత్సరాల వయస్సులోనే అన్ని రకాలుగా సామాజిక విప్లవకారుడిగా ముందుకు వచ్చాడు జ్యోతిరావ్ ఫూలే. డా. బి.ఆర్ అంబేద్కర్ గారు ఆయన నాకు గురువని చెప్పారు. ఆయన ' ఫాదర్ ఆఫ్ ది సోషల్ రివొల్యూషనరీ '' అని చెప్పారు. ఆ స్ఫూర్తితో విపి సింగ్ గారు 11 నెలల పాటు ప్రధాన మంత్రిగా పనిచేయడం జరిగింది. అంతకు ముందు రాజీవ్ గాంధీ గారి మంత్రివర్గంలో రక్షణ శాఖా మంత్రిగా వున్నారు, ఫైనాన్స్ మినిస్టర్‌గా వున్నారు. ఉన్నది కొద్ది రోజులు మాత్రమే అయినా ఆయన నిజం కోసం పనిచేసారు.

ఆ నిజం ఏమిటంటే, అన్ని కంపెనీలూ పన్నును ఎగవేస్తుంటే, ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషన్‌కు అన్ని అధికారాలనూ ఇవ్వడం వల్ల అంబానీ వంటి పారిశ్రామికవేత్తలకు చాలా కోపం వచ్చింది. వెంటనే వారు రక్షణ శాఖకు వెళ్లపోవాల్సి వచ్చింది. అయినా ఆయన భయపడలేదు. అప్పుడు వున్న పరిస్థితులలో 11 మాసాల పాటు ప్రధానమంత్రిగా వుండడమే కాదు, సానుకూల తత్వానికి, మండల కమిషన్‌ను ప్రవేశపెట్టడంలో వెల్లుబికిన ఘర్షణ, దాని ద్వారా జనించిన సానుకూల తత్వం చారిత్రాత్మకమైనవి. ఎవరు ఎన్ని అన్నా, మైనారిటీగా వున్న కొంత మంది అగ్రకుల పెత్తందారులు మేము మాత్రమే పదవులలో వుండాలి, ఇంకెవరూ వుండకూడదు అన్నపుడు లేదు, లేదు, మెజారిటీ ప్రజలు, 50 శాతం మంది బిసిలలో వున్నారు, కాబట్టి వారికి 27 శాతం రిజర్వేషన్లు కేంద్ర ఉద్యోగాలలో ఇవ్వాలని చెప్పిన మహావ్యక్తి ఆయన.

దానితోపాటుగా స్థానిక సంస్థలలో, నాకు తెలిసిన 1987 స్థానిక సంస్థల ఎన్నికలను చూస్తే, అపుడు వున్న వారు ఎవరయ్యా అంటే, 1, 2 వర్గాలకు చెందిన అగ్రకులాలకు చెందిన వారు గ్రామాధిపతులుగా ఆ రోజులలో వుండేవారు. కాని మండల్ కమిషన్ వచ్చిన తరువాత అణగారిన, అల్లాడిన వర్గాల నుంచి వచ్చిన ప్రజాప్రతినిధులు ఈ రోజు వున్నారంటే, అందుకు కారణం విపి సింగ్ గారి ధైర్యమేనని అంటాను. సెంటు వాసనే కాదు, చెమటోడ్చే వారు కూడా వుండాలని పరోక్షంగా చెప్పిన మహా వ్యక్తి ఆయన.

వారు సైద్ధాంతిక రాజకీయాలకు ప్రతినిధిగా నిలబడ్డారు. అణగారిన వర్గాలకు ఊపిరిగా, అండగా వుండాలని ఆయన కోరుకున్నారు. మండల కమిషన్‌ను ఎంత బాగా అమలు చేసారో, సెక్యులరిజమ్‌ను కాపాడడం కోసం ప్రధాన మంత్రి పదవిని కూడా తృణప్రాయంగా త్యాగం చేసిన ఒక మహా వ్యక్తి ఆయన. అనేక రకాలైన కుటిలమైన రాజకీయాలతో నిండి వున్న ఈ రాజకీయ వ్యవస్థను, సామాజిక వ్యవస్థను మార్పు చేసి, సంస్కరణలను తీసుకొచ్చిన ఆద్యుడు అయిన శ్రీ విపి సింగ్ గారి వంటి ఒక మంచి రాజకీయవేత్త ఈ వ్యవస్థలో లేకపోవడం మనకందరికీ అత్యంత బాధాకరం . ఈ రోజున అందరూ సామాజిక వర్గం, సామాజిక కోణమని జపిస్తున్నారు. అన్ని రకాలుగా మేము మీ కోసమే వున్నాము, సామాజిక న్యాయం కోసం వున్నాము, మీ ముందర వున్నామని శుష్క ప్రియాలు చెప్పి, శూన్య హస్తాలను చూపించడం జరుగుతోంది. పని చేసిన వారు మాత్రం కేవలం విపి సింగ్ గారు మాత్రమే. కార్యరూపంలో చెప్పిన ఒక మహా వ్యక్తి ఆయన. అందుకని, అంత గొప్ప వ్యక్తిని ఎంత పొగిడినా ఈ వర్గాల వారికి తక్కువే అవుతుంది.

అంత గొప్ప వ్యక్తి శ్రీ విపి సింగ్ గారు మన మధ్య లేకుండా దూరమైనందుకు సిపిఎం పార్టీ తరపున సభా నాయకుడు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని మేము బలపరుస్తూ, వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

శ్రీ చాడా వెంకట రెడ్డి (ఇందుర్తి): అధ్యక్షా, మాజీ ప్రధాన మంత్రి విపి సింగ్ గారి మృతి చెందినందుకు ఈ రోజు మన సభా నాయకులు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. నా కంటే ముందు మాట్లాడిన నాయకులందరూ చెప్పినట్లుగానే విపి సింగ్ గారు ఒక పెద్ద ఉన్నతమైన రాజ కుటుంబంలో జన్మించి కూడా పేద ప్రజల పక్షపాతిగా పేరు గాంచారు. బహుముఖ ప్రజ్ఞాశాలి, చిత్రకారుడు, కవి, అవినీతికి వ్యతిరేకంగా పోరాడి, అంతరాత్మ ప్రబోధం వంటి విషయాలలో విలువల కోసం నిలబడిన వ్యక్తి. ఆయన రాజకీయ జీవితం ప్రారంభంలో ఆనాడు ఈ దేశంలో వస్తున్న మార్పులను దృష్టిలో పెట్టుకుని, భ ూదాన ఉద్యమం వంటి సంఘటనల తొలి దశలో కాంగ్రెస్ పార్టీలో చేరి, అంచెలంచెలుగా ఎదిగి, నాయకుడిగా పేరు గాంచిన విషయాన్ని మనం మరువలేము.

ఉత్తరప్రదేశ్ మన భారతదేశంలోనే అతి పెద్ద రాష్ట్రం . అటువంటి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్నికైన తరువాత, ఉత్తర ప్రదేశ్‌లో వున్న బందిపోట్లు అరాచకత్వాన్ని, రాక్షసత్వాన్ని ఆ రాష్ట్ర ప్రజలు సహించలేని పరిస్థితులలో, రెండు సంవత్సరాలలోనే ఆ బందిపోట్ల ముఠాను అంతమొందిస్తానని చెప్పడం జరిగింది. ఆ ప్రకారంగా ఆయన చేయలేకపోయిన నేపధ్యంలో, నేను ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోయానని పశ్చాత్తాపపడి, ముఖ్యమంత్రి పదవినే త్యజించిన ఒక గొప్ప త్యాగమూర్తి ఆయన. ఆ రోజులలో మంత్రులకు వున్న ప్రమాణాలు, విలువల గురించి నేను చెప్పనక్కరలేదు. అయితే వారు రాజీవ్ గాంధీ గారి క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేస్తున్నపుడు, ప్రభుత్వంలో వున్న అవినీతికి వ్యతిరేకంగా పోరాడి, మంత్రి పదవికి రాజీనామా చేసి, బోఫోర్స్ కుంభకోణాన్ని బయటకు తీసుకురావడానికి విశేషమైన కృషి చేసిన వ్యక్తి ఆయన. ఆయన మంత్రి పదవిని వదలుకోవడమే కాకుండా, ఎంపి పదవికి కూడా రాజీనామా చేసి అలహాబాదు నుంచి పోటీ చేసి తిరిగి ఎన్నికైన వ్యక్తి విపి సింగ్ గారు.

ఉ.10.30

ఆయన నైతిక విలువలకు నిలువుటద్దముగా నిలబడిన  కార్యదీక్షాపరుడు. కేంద్రంలో ప్రతిపక్షాల తరఫున అన్ని పార్టీలు ఆయనను బలపరిచాయి. ప్రధానమంత్రిగా పని చేసింది 11 మాసాలే కావచ్చు. ఆయన పదవిలో ఉన్న కాలంలో అనేకమయిన సంస్కరణలు మార్పులు తీసుకురావడానికి ఎటువంటి ఒత్తిడులు వచ్చినా, పత్రికలలో వచ్చినా, ఆయన తన ప్రధాన మంత్రి పదవి కాలంలో లౌకిక తత్త్వం నిలబడడానికి బి.జె.పి., అగ్రనాయకుడు ఎల్.కె. అద్వాని రథయాత్ర ద్వారా మత తత్త్వాన్ని రెచ్చగొట్టే తరుణంలో ప్రమాదాన్ని గమనించి నిర్మాణాత్మకంగా వ్యవహరించడం, అద్వాని గారిని అరెస్ట్ చేయడం జరిగింది. మతోన్మాదులతో బహుశా రాజీ పడలేని తరుణంలో ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేశారు. జనాభాలో సగం ఉన్న బి.సిలకు రిజర్వేషన్లకు సంబంధించిన అంశంలో ఇంక ఎప్పుడయినా న్యాయం జరుగుతుందనే ఆలోచన చేసి 27 శాతం రిజర్వేషన్ అమలుకై మండల్ కమీషన్ చేసిన సిఫారసులను ఎటువంటి ఒత్తిడులకు లొంగకుండా అమలు చేసిన మహానుభావుడు వారు. ఆ నిర్ణయం తరువాత రాజకీయాలలో ఆ మండల కమీషన్ సిఫారసులు బిసిలకు రిజర్వేషన్ సిఫారసు రాజకీయాలపై ప్రభావం పడుతుందని చెప్పడంలో ఎటువంటి సంశయం లేదు. ఎన్నికల సంస్కరణల విషయంలో అనేక పద్ధతులలో ప్రయత్నం చేసిన మహానుభావుడు. సామాజిక న్యాయం కోసం సెక్యులరిజం కోసం ఒక ఛాంపియన్‌గా భారత రాజకీయాలను ప్రభావితం చేశారు. చివరకు బడుగు బలహీనవర్గాల ప్రయోజనం కోసం అంకితభావంతో పని చేశారు. ప్రధానిగా భారత దేశ రాజకీయాలలో లెఫ్ట్‌కి మంచి మిత్రుడుగా ఉన్నారు. దాదాపు గత 17 సంవత్సరాలుగా అనారోగ్యంతో ఉండి కూడా ఆయన ఏ సమస్య వచ్చినప్పటికి కూడా తన ఆరోగ్యం సహకరించకున్నా వీలయినంతవరకూ సామాజిక స్పృహతో ఆలోచిస్తూ పని చేశారు. ఈమధ్యనే ఉత్తర్‌ప్రదేశ్‌లో సిపిఐ., జనరల్ శెక్రటరితోబాటు ఎస్.ఇ.జడ్.,ల వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నారు. ఆరోగ్యం సహకరించనప్పటికీ ఆయన ఆ విధంగా ఆలోచించిన మహానుభావుడని తమ దృష్టికి తీసుకువస్తున్నాను. ఈ రోజు ఒక ప్రజాస్వామ్యానికి విలువలనిచ్చే మహావ్యక్తిని మనం అందరం కోల్పోయినామని చెప్పడంలో సంశయం లేదు. దేశానికి తీరని లోటుగా సిపిఐ– శాసనసభా పక్షం భావిస్తోంది. వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియచేస్తూ, మరొకసారి వారి ఆత్మకు శాంతి చేకూరాలని తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

جناب سید احمد پاشاہ قادری: جناب اسپیکر صاحب! وزیر اعلیٰ، حکومتِ آندھرا پردیش، ڈاکٹر وائی ایس راج شیکھر ریڈی صاحب نے جو تعزیتی قرارداد پیش کی ہے، میں اس کی تائید کرتے ہوئے آپ سے یہ عرض کرنا چاہتا ہوں کہ جناب وی پی سنگھ صاحب جو ہمارے ملک کے سابقہ وزیر اعظم تھے، دس سال کی طویل علالت کے بعد ان کا انتقال ہوا۔ ان کے وزارتِ عظمیٰ کے دور میں ان کے بے شمار کارنامے رہے۔ وہ اتر پردیش کے وزیر اعلیٰ رہے اور مرکزی حکومت میں بھی کئی دفعہ اہم ministries کے عہدوں پر فائز رہے۔ ان کے کارناموں کی ایک طویل فہرست ہے۔ میں مختصراً ان میں سے دو باتوں کا ذکر کرتا ہوں۔ ایک تو یہ کہ وی پی سنگھ صاحب کے دور میں بابری مسجد کی شہادت کے لئے رتھ یاترا نکالی گئی تھی، اس موقع پر انہوں نے اس رتھ یاترا کو روکا تھا، اور اس کے لیڈر کو گرفتار کیا تھا۔ نہ صرف گرفتار کیا بلکہ مسلمانوں کو حکومتِ ہند کی طرف سے بابری مسجد کے تحفظ کا جو تیقن دیا تھا، مکمل تحفظ کو یقینی بنایا، اور انہوں نے بابری مسجد کی حفاظت کی۔ اس اعتبار سے ہندوستان کی تاریخ میں یہ ایک عظیم کارنامہ بھی قرار دیا جا سکتا ہے کہ انہوں نے اپنی وزارتِ عظمیٰ کے دور میں، بحیثیت وزیر اعظم، بابری مسجد کا تحفظ کیا، کہ جیسے وعدہ کیا تھا، اس کی حفاظت بھی کی۔ دوسری اہم بات یہ ہے کہ انہوں نے منڈل کمیشن کی سفارشات کا آغاز کیا۔ یہ بھی ہندوستان کی تاریخ میں ان کا ایک عظیم کارنامہ ہے۔ اسی وجہ سے ان کو اقتدار بھی چھوڑنا پڑا۔ انہوں نے اس کے لئے اقتدار کی بھی پرواہ نہیں کی بلکہ منڈل کمیشن کی سفارشات کو ترجیح دیتے رہے اور ان کی عمل آوری کا آغاز کیا۔ یہ دو اہم کارنامے ہیں جن کی وجہ سے دنیا ان کو یاد رکھے گی اور عرصہ دراز تک ان کے عظیم کارناموں کو لوگ بھول نہیں پائیں گے۔ میں ان کے افرادِ خاندان سے ہمدردی کا اظہار کرتے ہوئے چیف منسٹر صاحب کی تعزیتی قرارداد کی تائید کرتا ہوں۔

శ్రీ జి. కిషన్ రెడ్డి(హిమాయత్ నగర్)ః అధ్యక్షా, మాజీ ప్రధానమంత్రి విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్‌గారు భారతదేశ రాజకీయాలలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొని చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి . ప్రధానిగా ఈరోజు రాజకీయాలలో నీతి నిజాయితీ సచ్ఛీలుడుగా పేరు తెచ్చుకున్న కొద్ది మంది నాయకులలో విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్‌గారు ఒకరు. అవినీతికి వ్యతిరేకంగా సామాజిక మార్పుల కోసం తపించిన వ్యక్తి శ్రీ విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్‌గారు. షుమారు 17 సంవత్సరాలు బ్లడ్‌క్యాన్సర్‌తో పోరాటం చేస్తూ ఆఖరి శ్వాస కోసం తను నమ్మిన సిద్ధాంతాల కోసం తాను ఉన్న ఆసుపత్రిలోకూడా రాజకీయ పరమైన సిద్ధాంతాలను వదలకుండా దాని కోసం తపన పడిన వ్యక్తి వి.పి.సింగ్‌గారు. వారు రాజీవ్‌గాంధిగారితో అత్యంత సన్నిహితుడుగా ఉండగా, ఆ రోజున బోఫోర్స్‌కి సంబంధించిన కుంభకోణంలో విభేదించి బయటకు వచ్చిన వ్యక్తి వీరు. 1987లో కాంగ్రెస్‌పార్టీకి రాజనామా చేసిన వ్యక్తి. ఆయన రచయిత, మంచి పెయింటింగ్స్ కూడా వేసేవారు. వారు పెయింట్ చేసిన అనేక చిత్రపటాలను ఎగ్జిబిషన్స్‌లో పెట్టారు. వారు ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, ప్రధాన మంత్రిగా పనిచేశారు. తన కళలతో అంటే రచయితగా, ఆర్టిస్ట్‌గా వాటిని ఎప్పుడూ ఆపకుండా క్యాన్సర్‌తో బాధపడుతున్నా కూడా ఆసుపత్రిలో ఉన్నప్పుడు పెయింటింగ్ వేసారు. సామాజికమయిన న్యాయం కోసం కృషి చేసిన వ్యక్తి. ప్రధానంగా అట్టడుగు వర్గాల సముద్ధరణ కోసం పని చేసిన వ్యక్తి. రాజకీయాలలో మచ్చలేని కొద్దిమంది వ్యక్తులలో వి.పి.సింగ్‌గారు ఒకరు. వారి మృతి పట్ల బి.జె.పి. పార్టీ తరఫున ప్రగాఢ సంతాపాన్ని తెలియచేస్తూ వారి కుంటుంబ సభ్యులకు, నా ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరుస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కొమిరెడ్డి రాములు(మెట్‌పల్లి)ః అధ్యక్షా, వి.పి.సింగ్‌గారి మరణం ఈ దేశానికి ముఖ్యంగా బలహీన వర్గాలకు పెద్ద లోటు. ఎన్ని ఉద్యమాలు వచ్చినప్పటికీ, తెలంగాణా సాయుధ పోరాటం, మావోయిస్ట్ ఉద్యమం ఇలా ఎన్నో వచ్చాయి. వి.పి.సింగ్‌లాంటి వారు సంఘ సంస్కర్తలు, మేధావులు, రాజకీయ నాయకులు ఎన్నో విధాలుగా మార్పులు తీసుకువచ్చినా, ఈ దొరతనం మారలేదని చెబుతున్నాను. శ్రీ

చంద్రబాబునాయుడుగారు ముఖ్యమంత్రిగా ఒకసారి మా జగిత్యాల డివిజన్‌కి వచ్చినప్పుడు ఈ దొరతనాన్ని మార్చడానికి ప్రయత్నం జరగడం లేదని చెప్పారు. పంచాయితీ ఎన్నికల సమయంలో చెప్పారు. అక్కడ పెద్ద దొరతనం ఉంది. దాని ప్రక్కనున్నది నా మెట్‌పల్లి నియోజకవర్గమే. ఈ డివిజన్‌లో మార్పు కోసం ప్రజలు పోరాటం చేస్తూ ఉంటే, డిస్‌టర్బ్ ఏరియా ఆక్ట్ తెచ్చి మాలాంటి అణగారిన ప్రజలందరి తరఫున మాట్లాడారు. మళ్లీ ముఖ్యమంత్రిగా అప్పుడు వచ్చినప్పుడు అణగారిన ప్రజలను బాగుచేస్తామన్నారు. ఏ నాయకులు వచ్చినా, డివిజన్‌లో అదే మాట మాట్లాడుతున్నారు. ఎంతో మంది మహానుభావులు వచ్చినా, అటువంటి స్ఫూర్తివంతులు వచ్చినా ఈ మార్పు ఇంకా రాలేదని తమ ద్వారా సభకు తెలియచేస్తున్నాను.

**ఉ.10.40**

అధ్యక్షా, వి.పిసింగ్ గారు ఎటువంటి లీడర్స్‌ను పికప్‌చేశారో చూడండి. ఆయన లాగా ఎవరైనా పికప్ చేయగలిగారా? లల్లూ ప్రసాద్ యాదవ్‌ని, ములాయం సింగ్ యాదవ్‌ని ముఖ్యమంత్రులుగా చేశారు. ఎల్.కె. ఆద్వానీ గారు రథయాత్ర పేరుతో కమ్యూనల్ వయొలెన్స్‌ను ప్రేరేపిస్తే అక్కడే ఆయనను అరెస్ట్ చేయించిన వ్యక్తి ములాయమ్ సింగ్ యాదవ్ గారు. ఎన్‌డిఎ ఆధ్వర్యంలోని బీజేపీ లాంటి మత తత్వ శక్తులు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలిచి మతత్వశక్తులను ఎదిరించిన ఘనత గల ములాయం సింగ్ యాదవ్ లాంటి నాయకులను పికప్ చేశారు. అదేవిధంగా ఐ ఎఎస్ లాంటి కేంద్ర సర్వీసుల్లో కూడా రిజర్వేషన్స్ తీసుకురావడానికి ఆయన కృషి చేశారు. ఆయన ఒక ప్రధానిగా కాకుండా పేద వర్గాలకు చెందిన ప్రజల ఫ్రెండ్‌గా, వీకర్ సెక్షన్స్‌కు సంబంధించిన వారి ఫ్రెండ్‌గా ఎల్లకాలం జ్ఞప్తి పెట్టుకుంటాము. ఇప్పుడు మనందరం ఆయనకు నివాళులర్పిస్తున్నాము. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాము. ఇది కాదు. ఆయనకు నిజమైన నివాళి అర్పించడమంటే దేరార్ టు బేసిక్ ఇష్యూస్. వీకర్ సెక్షన్స్‌ని పైకి తీసుకురావడానికి కమిట్‌మెంట్‌తో పని చేయ డమనేది ఒకటి. లేదంటే కనీసం కరప్షన్ ఎట్ హయ్యర్ ప్లేసెస్‌కు వ్యతిరేకంగా పోరాడడమనేది ఒకటి. మా డివిజన్లో చూసినట్లయితే అందరికీతెలుస్తుంది. మీరు మాప్రాంతం వారు కనుక మీకు తెలుస్తుంది. నేను మాత్రం ఆ దిశలో కృషి చేయడానికి నిర్ణయం తీసుకున్నానని మీ ముందర మనవి చేస్తున్నాను. వి.పి. సింగ్ గారి మృతిపట్ల సంతాపాన్ని ప్రకటిస్తూ గౌరవ ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖర రెడ్డి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్నిపూర్తిగా బలపరుస్తూ వారి ఆత్మకు శాంతి కలగాలంటే అందరు కూడా వీకర్ సెక్షన్స్‌ను అప్‌లిఫ్ట్ చేయడానికి కృషి చెయ్యాలని కోరుతున్నాను. ఈ మధ్య న్యూస్ పేపర్లలో చూస్తున్నాము. పొలిటికల్ పార్టీలు ఒకరు నూరు సీట్లు బీసీలకిస్తామంటే మరొకరు 150 ఇస్తామని, ఇంకొకరు 120 ఇస్తామని, ఇంకొకరు 110 ఇస్తామని అంటున్నారు. కాబట్టి అందరు కూడా ఆ దిశలో పని చేస్తేనే వారి ఆత్మకు శాంతి కలుగుతుందని మనవి చేస్తు వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ సెలవు తీసకుంటున్నాను. నమస్కారం.

శ్రీ డి. మాణిక్య వర ప్రసాద రావు(తాడికొండ)ః అధ్యక్షా, దేశ మాజీప్రధాన మంత్రి , పేద వర్గాలకు న్యాయం చేయటంలో ముందుండి నిలబడిన మహానుభావుడు వి.పి.సింగ్ గారి మృతికి సంతాప తీర్మానం ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి గారికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. ఈ దేశ ప్రధాన మంత్రుల్లో నాకు వ్యక్తిగతంగా ముగ్గురంటే చాలా ఇష్టం. జవహర్‌లాల్ నెహ్రూ గారు, ఇందిరాగాంధి గారు మరియు వి.పి.సింగ్ గారు. జహహర్‌లాల్ నెహ్రూ గారు స్వతంత్రం వచ్చిన కొత్తలో ఈ దేశాన్ని ముందుకు నడిపించటంలో, ఈ దేశంలో రాజకీయ విలువలను ముందుకు తీసుకెళ్లటంలో ఎంతోకృషి చేశారు. ప్రపంచ రాజకీయాల్లో ఈ దేశాన్ని ఒక సమున్నత స్థానంలో నిలిపిన వ్యక్తి జవహర్‌లాల్ నెహ్రూ గారు. అటు తరువాత ఇందిరాగాంధి గారి

గురించి మనందరికీ తెలుసు. పేద వర్గాల కోసం, ముఖ్యంగా దళితుల ఆత్మస్థైర్యం పెరగటం కోసం, దళిత వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన వ్యక్తి. ఈ రోజున ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖర రెడ్డి గారు కూడా చాలా పథకాల్లో ఇందిరమ్మను స్ఫూర్తిగా తీసుకుంటున్నారు. ఇందిరమ్మ స్ఫూర్తి అంటే పేద వర్గాల స్ఫూర్తి. ఇందిరమ్మ స్ఫూర్తి అంటే పేద వర్గాలకు ధైర్యం చెప్పే ఒక స్ఫూర్తి. ఈరోజు రాజశేఖర రెడ్డి గారు చెబుతున్న సందేశం కూడా అదే. అలాంటి ప్రధానమంత్రులుగా పని చేసిన ముగ్గురు వ్యక్తుల్లో మూడవ వ్యక్తి అయిన వి.పి.సింగ్ గారు సోషల్ జస్టిస్ కోసం, వీకర్ సెక్షన్స్ అభ్యున్నతి కోసం మండల్‌కమీషన్ ఏర్పాటు చేసిన విషయం మనందరికీ తెలుసు. మండల్ కమీషన్ రాకముందు ప్రతి ఒక్కరు రాజకీయాల్లో బీసీ వర్గాల గురించి, దళితుల గురించి మాట్లాడేవారే. కాని ఎవరూ దానిని ధైర్యంగా ఇంప్లిమెంట్ చేయటానికి ముందుకొచ్చే సాహసం చేసేవారు కాదు. భారత రాజకీయాలకు ఒక కొత్త ఆలోచన తెచ్చి , భారత దేశ రాజకీయాలను మరో వైపుకు మలుపు తిప్పిన వ్యక్తి వి.పి.సింగ్ గారు. నేనంటాను. 1989వ సంవత్సరం అనేది భారత రాజకీయాల్ని ఒక చరిత్రాత్మకమైన రాజకీయాలకు మలుపు తిప్పిన సంవత్సరంగా నేను భావిస్తాను. వి.పి.సింగ్‌గారు మండల్ కమీషన్‌ను ఇంప్లిమెంట్ చేయటంలో ఎంతో రిస్క్ తీసుకున్నారు. ఆ రోజున కమండల్ పాలిటిక్స్ అని మండల్ కమీషన్‌ను వ్యతిరేకించే శక్తులు, హిందూత్వ వాదులు మండల్ కమీషన్‌కు వ్యతిరేకంగా రథయాత్ర చేపట్టి దేశాన్ని అల్లకల్లోలం చేస్తూవుంటే అది తప్పు అని, సెక్యులర్ దేశానికి నష్టం కలిగిస్తుందని, సెక్యులర్ ఫ్యాబ్రిక్‌కి అది కష్టం కలిగిస్తుందని భావించి, మత తత్వ శక్తులను వ్యతిరేకించి తన ప్రధాన మంత్రి పదవినే త్యాగం చేసిన ఒక గొప్ప త్యాగధనుడు వి.పి.సింగ్ గారు. ఆయన దళితులకు చేసిన రెండు ముఖ్యమైన గొప్ప సంఘటనల గురించి చెబుతాను. మనలో చాల మంది ఎస్‌సి, ఎస్‌టి ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీస్ యాక్ట్, 1989 గురించి చెబుతుంటాము. అలాంటి యాక్ట్‌ను ను తీసుకువచ్చింది వి.పి.సింగ్ గారే. ఈ రోజు దళిత వర్గాల ప్రజలు తమ మీద దాడులు జరుగుతున్నప్పుడు ధైర్యంగా మన వ్యవస్థల ముందుకెళ్లి చెప్పుకోవటానికి అవకాశాన్ని, ప్రభుత్వం స్పందించే చట్టాన్ని ఆ రోజున సోషల్ వెల్ఫేర్ మినిస్టర్‌గా వున్న రామ్ విలాస్‌పాశ్వాన్ గారు తేవటానికి కీలకపాత్రధారి వి.పి.సింగ్ గారే అనటంలో సందేహం లేదు. అదే విధంగా దళిత జాతిలో అత్యున్నతమైన వ్యక్తి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ గారికి భారత రత్న పురస్కారం ఇవ్వాలని సుదీర్ఘ పోరాటం జరుగుతున్న సందర్భంలో వి.పి.సింగ్ గారి నాయకత్వంలోని ఆనాటి ప్రభుత్వం అంబేద్కర్ గారికి భారతరత్న పురస్కారాన్ని ఆయన సతీమణి సవితా అంబేద్కర్ గారికి బహూకరించిన సంఘటనను నేను ప్రత్యక్షంగా చూడటం నా అదృష్టంగా భావిస్తున్నాను. అట్లాగే వి.పి.సింగ్ గారికి దళిత వర్గాల పట్ల, వారి అభ్యున్నతి పట్ల వున్న కమిట్‌మెంట్ నేను విద్యార్థి దశలో వున్నప్పుడు విద్యార్థి నాయకునిగా ప్రత్యక్షంగా చూశాను. ఆయనలోని సిన్సియారిటీ, గొప్పతనాన్ని ప్రత్యక్షంగా చూడటం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఆయన అలాంటి మహానుభావుడు. ఈ రోజున చాలా మంది రాజకీయాల గురించి, విలువల గురించి మాట్లాడుతున్నారు. రాజకీయ విలువలను, సెక్యులర్ విలువలను, సాంఘిక న్యాయాన్ని బలోపేతం చేస్తేనే ప్రజాస్వామ్యం నిలబడుతుందని ఆ రోజునే తెలిపిన మహానుభావుడు వి.పి.సింగ్ గారు. వి.పి.సింగ్ గారి థీరీ, నమ్మకమైన థీరీ ఏమిటంటే"The future of India is not just about the growth rates. It is about the principle of human equality. " He believed in that principle.

హిందూ పేపర్లో ఆయన మృతికి సంతాపంగా ఒక మంచి ఎడిటోరియల్ రాశారు. దానిలో నుండి ఒక సెంటెన్స్‌ను నేను చదివి ఆయన గొప్పదనాన్ని స్మరిస్తాను. " Mr. V.P. Singh worked tirelessly against the toxic communal politics of BJP. Mr. Singh was thus seen as champion of secularism and social justice to defend principles of politics. అధ్యక్షా, He cultivated himself the image of the conscious politicians, who was clean and ever-ready to renounce power for the worthy causes. " అంటే నేను చెప్పేది రాజకీయాల్లో విలువలను ప్రబోధించిన మహానుభావుడు వి.పి.సింగ్

గారు. అందుకనే  జవహర్‌లాల్  నెహ్రూ, ఇందిరాగాంధి, వి.పి.సింగ్‌లు ఈ దేశంలోనే అత్యున్నత వ్యక్తులుగాభావిస్తున్నాను. దేశ రాజకీయాలను మతోన్మాద శక్తుల నుంచి రక్షించాల్సిన బాధ్యత అందరి మీదా వుందని ఆయన సందేశంగా మనం తీసుకోవాలని చెప్పి నేను కోరుకుంటూ  సెలవు తీసుకుంటున్నాను.

MR.SPEAKER: " This House places on record its deep sense of sorrow at the demise of Sri Vishwanath Pratap Singh, former Prime Minister of India and conveys its deep sense of sympathy to the members of bereaved family."

Sri Vishwanath Pratap Singh was born on 25th June, 1931 at Allahabad. He was Tenth Prime Minister of India from 2nd December, 1989 to 10th November, 1990. Sri Vishwanath Pratap Singh attained an important place in the history of Indian politics. The work done by him for the poor and the backward classes is a major contribution to the Indian society. Sri V.P. Singh gave wide publicity for his desire to implement the recommendations for the Mandal Commission, which suggested fixed quota of all jobs in the public sector be reserved for other backward classes. He was member of U.P. Legislative Assembly from 1969 to 1971 and again from 1981 to 1983. He was elected four times to the Lok Sabha and one time to the Rajya Sabha and he was Chief Minister of Uttar Pradesh in the year 1980. As Chief Minister of Uttar Pradesh, he cracked on horror of decoity, a problem that was particularly severe in the rural districts of south west of Uttar Pradesh.

Sri Vishwanath Pratap Singh was Union Minister for Commerce, Finance, Defence and Environment in the cabinets of Smt. Indira Gandhi and Sri Rajiv Gandhi. He formed Jana Morcha in the year 1987 and President of Janatadal. He had passion for painting, photography and poetry. He expired on 27th November, 2008.  As a mark of respect, let us observe two minutes silence.

(Then the House observed two minutes silence Nem. Con.)

MR. SPEAKER: Now, I will take up the second condolence motion.

## 2. ముంబాయిలో ఉగ్రవాదుల దాడులలో మృతి చెందిన వ్యక్తుల పట్ల

DR. Y.S. RAJASEKHARA REDDY: Speaker sir, I beg to move:

" That this House places on record its deep sense of sorrow to the persons killed in terrorists attack in Mumbai and conveys its deep sense of sympathy to the members of bereaved families."

ఉ.10.50

## ముంబాయిలో ఉగ్రవాదుల దాడులలో మృతి చెందిన వ్యక్తుల పట్ల

డాక్టర్ వై.యస్. రాజశేఖర్‌రెడ్డి ః  అధ్యక్షా, మొన్న పోయిన వారం అంటే గురు, శుక్రవారాల నాడు ముంబాయిలో జరిగిన ఉగ్రవాదుల దాడిని  ఏదో ఒక ముంబాయిలో జరిగిన దాడిగా భావించలేం .  ఈ ఉగ్రవాదుల దాడిని  మొత్తం భారత జాతిపై జరిగిన దాడిగానే భావించాలి.  ఈ సభ మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఈ సంఘటనను ముక్తకంఠంతో ఖండించవలసిన అవసరం వుంది.  పన్నెండు చోట్ల ఈ ముష్కరులు విరుచుకపడి, ఆర్.డి.యక్స్ వంటి అత్యంత శక్తివంతమైన  పేలుడు సామగ్రిని ఉపయోగిస్తూ, గ్రె నేడ్లు విసురుతూ,  ఎ.కె.47 లాంటి తుపాకులతో  మన జాతీయులతోబాటు విదేశీ పౌరులను కూడా పిట్టల్ని

కాల్చినట్లు కాల్చివేస్తూ, నగరవాసులను భయభ్రాంతులను చేసి, వారిని మళ్లీ ఒక మృత్యు వలయంలో బంధించడమన్నది చాలా అసాధారణమైనది. నిజంగా ఇది ఒక మారణహోమంలా జరిగింది. ఈ ఉగ్రవాద చర్యను ప్రపంచం యావత్తు ఖండించింది. ప్రధానంగా ఈ ముంబాయి నగరం ఈ ఉగ్రవాదులకు చాలా ప్రధానమైన బిందువుగా తయారైంది. 1993 వ సంత్సరంలో సీరియల్ బాంబు పేలుళ్లతో మొదలుపెట్టి, ఉగ్రవాదులు చాలాసార్లు ముంబాయిని తమ ప్రధాన లక్ష్యంగా చేసుకున్నట్లు మొన్న గురు, శుక్రవారాల నాడు జరిగిన సంఘటనలు తేటతెల్లం చేస్తున్నాయి. దాదాపు 180 మందికి పైగా మృత్యువాత పడడం చాలా విషాదకరం . ఈ విషయం తెలుస్తూనే, ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్, అదే విధంగా ఎఐసిసి అధ్యక్షురాలు, యుపిఏ ఛైర్‌పర్సన్ శ్రీమతి సోనియాగాంధీగారు ముంబాయిని సందర్శించి క్షతగాత్రులను పరామర్శించి, మృతుల పట్ల సంతాపం ప్రకటించి, వారి కుటుంబాలకు సానుభూతిని తెలియజేసి నగరవాసులకు ధైర్యం చెప్పారు.

అధ్యక్షా, నిన్న ఆదివారం ప్రధానమంత్రిగారు ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అన్ని రాజకీయ పక్షాలు ప్రభుత్వానికి సహకరించాలని, ఇటువంటి సందర్భాలలో రాజకీయాలకు అతీతంగా అందరూ వ్యవహరించాలని, మళ్లీ మళ్లీ ఇటువంటి దుశ్చర్యలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా గట్టి చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ముంబాయిలో జరిగిన సంఘటన రెండున్నర రోజులుగా కొనసాగింది. గతంలో బెంగుళూరు, ఢిల్లీ, అహ్మదాబాద్, జైపూర్, హైదరాబాదు వంటి నగరాలలో విధ్వంసం సృష్టించిన ఉగ్రవాదుల రక్త దాహం రోజురోజుకు పెరుగుతోంది. ఇదంతా ఒక విదేశీ కుట్రలో భాగమే . ప్రపంచంలోనే ఒక గట్టి ప్రజాస్వామ్య దేశంగా మన ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసుకున్నాం . 60 సంవత్సరాల తర్వాత స్వతంత్ర భారత చరిత్రలో ఎన్ని రకాలైన ఒడిదుడుకులు వచ్చినా, ఇబ్బందులు వచ్చినా, మన ప్రజాస్వామ్యం అంతిమంగా విజయం సాధిస్తుందని చెప్పి నిరూపించగలిగాం . అధ్యక్షా, ఒకవైపు మనం ప్రజాస్వామ్యాన్ని బాగా బలోపేతం చేసే ప్రయత్నం చేస్తున్నాం, కానీ మరొక వైపు ఎక్కడో ఒకచోట , ఎప్పుడో ఒకసారి భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని మేము దెబ్బతీయగలుగుతామని ఉగ్రవాదులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎక్కడో, ఎప్పుడో దొంగదెబ్బ తీసే ప్రయత్నాలు వారు చేస్తూనే వున్నారు. మన ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన పార్లమెంటుపై టెర్రరిస్టులు 2001, డిసెంబర్ 13 వ తారీఖున దాడి చేశారు, అప్పుడు కూడా విదేశీ శక్తుల ప్రోద్బలంతో ఆవిధంగా దాడి చేయడం జరిగింది. అది కూడా వారికి సంబంధించిన దుశ్చర్యకు పరాకాష్ట. ఇటువంటి తీవ్రమైన సంఘటనలు జరిగినప్పుడెల్లా భారత జాతి యావత్తు ఒక తాటిపై నిలబడి, ఇటువంటి దుశ్చర్యలను నిర్వీర్యం చేసే విషయంలో ఏమాత్రం వెనకాడడం లేదు. మన దేశంలో ఎక్కడో ఒకచోట ఈ విధంగా దొంగదెబ్బ తీసే ఉగ్రవాదుల చర్యల విషయంలో గానీ, మన సరిహద్దులపై విదేశీయులు దాడి చేయడం జరిగినప్పుడు గానీ , భారత జాతి యావత్తు ఒక తాటిపై నిలబడి దేశం కోసం ప్రతి ఒక్కరూ పోరాడిన, పోరాడుతున్న సందర్భాలు చాలానే వున్నాయి. ఈరోజు కూడా ఆవిధమైన ఆలోచనతో, మనమందరమూ కూడా ఒకే మాటపై నిలబడి, మిగిలిన అన్ని విషయాలను ప్రక్కనబెట్టి దేశ సమగ్రతకు , దేశ సార్వభౌమత్వానికి ఏ కొంచెం భంగం వాటిల్లినా మన ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టని , అటువంటి పరిస్థితులను రానీయమని, అందరమూ కలిసి ఈరోజు దేశాన్ని రక్షించుకోవలసిన అవసరం వుందని తెలియజేస్తున్నాను. ఇటువంటి ఉగ్రవాద కారుచిచ్చును మనమందరమూ సమైక్యంగా ఎదుర్కొని ఆర్పివేయవలసిన గురుతర బాధ్యత మనపైన పూర్తిగా వుంది. ఒక వైపు దేశం సర్వతోముఖాభివృద్ధిని సాధిస్తోంది, జాతీయ సంపద బాగా పెరుగుతోంది, మరొక వైపు ఇటువంటి దుస్సంఘటనలు జరుగుతున్నాయి. ఇన్ని రకాలైన విభిన్న మతాలు, జాతులు, సంస్కృతులతో ఉన్న భారతదేశం – ‘ భిన్నత్వంలో ఏకత్వం ’ అనే

పద్ధతితో, ఆలోచనతో తన సెక్యులర్ వాదాన్ని పూర్తిగా నిలబెట్టుకుంటూ, దేశంలో మైనారిటీలకు కూడా పూర్తి స్థాయి స్వేచ్ఛను కల్పిస్తూ, అందరినీ కలుపుకుని పోగలగిన పరిస్థితి భారతదేశంలో వుంటే , భారత ప్రజాస్వామ్యం తన గట్టి తనాన్ని నెలబెట్టుకుంటుంటే – ఏదో ఒక విధంగా ఆటంకాలు కల్పిస్తూ ఈ దేశం ప్రగతి పథంలో ముందుకు పోకూడదు, ఈ దేశానికి విదేశీ పెట్టుబడులు రాకూడదు, ఈ దేశం పారిశ్రామికంగా ఎదగకూడదు, ఈ దేశం ప్రపంచ దేశాల ముందు తలెత్తుకుని నిలబడగలిగే పరిస్థితి రాకూడదనే దురుద్దేశ్యంతో , ప్రక్క దేశాలనుంచి మరీ ముఖ్యంగా పాకిస్తాన్ భూభాగాన్ని ఈ ఉగ్రవాద ముఠాలు మన దేశంలో చొరబడడానికి ఉపయోగించుకుంటున్నాయంటే అది చాలా తీవ్రమైన విషయం . మన ప్రక్కన వున్న దేశం వారి భూభాగాన్ని ఏరోజైనా ఈ తీవ్రవాద, ఉగ్రవాద ముఠాలు వాడుకోవడానికి అవకాశం ఇవ్వడమంటే అది చాలా బాధాకరమైన విషయం, అది చాలా తీవ్రంగా పరిగణించవలసిన విషయం .

ఉ 11.00

మన దేశ సార్వభౌమత్వానికి నష్టం కలిగించే ఏ ఒక్క చర్య అయినా తెలిసిగానీ, తెలియకుండా గానీ పక్కనున్న దేశాలకు ఏ ఒక్కటికీ కూడా కొంచెం కూడా అవకాశం ఇవ్వకుండా జాగ్రత్త వహించవలసిన అవసరం వుంది. వారి భూభాగం నుండే మన దేశం పైన విదేశీ ముఠాలు నేరుగా యుద్ధం చేసే పరిస్థితులలోకి వస్తున్నాయంటే ఇది కేంద్ర ప్రభుత్వం కూడా చాలా తీవ్రంగా పరిగణిస్తుంది. ఇటువంటి పరిస్థితిని రానివ్వకూడదు. ఇటువంటి పరిస్థితిని పూర్తిగా ఖండించవలసిన అవసరం పూర్తిగా ప్రతి ప్రజాస్వామ్యవాది పైన వుంది. ముంబైలో ఉగ్రవాదులను తుదముట్టించే కార్యక్రమంలో చాలామంది పోలీసులు మరణించడం చాలా బాధాకరమైన విషయం. ఈ సంఘటనలో చాలా వీరోచితంగా పోరాడి తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన ఐపియస్ మరియు ఆర్మీ అధికారులు అశోక్ కామ్టే, హేమంత్ కర్కరే, విజయ సలాస్కర్, సందీప్ ఉన్నికృష్ణన్, గజేంద్ర సింగ్ వంటి వారి త్యాగాలను మన జాతి ఎప్పటికీ మరవలేదు. ఈ వీరులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున మనందరమూ గౌరవ వందనం చేయవలసిన అవసరం వుంది. వారి త్యాగాలకు మనమందరమూ గర్వించవలసిన అవసరం వుంది. ముంబైలో నరహంతకులతో సాగిన భీకర సంగ్రామంలో దాదాపుగా విజయాన్ని వరించిన భారతజాతి ముద్దు బిడ్డలు మన వీరజవాన్‌లు అందరికీ మనం జేజేలు చెప్పాలి. ఈ వీర జవాన్‌లలో ముఖ్యంగా నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ సంక్షోభ సమయంలో మేమున్నామని అంటూ వారు చేసిన సాహసోపేతమైన చర్యలు మనందరికీ ఒక ఊరట, ఒక రకంగా గర్వ కారణం. ఈ యన్‌యస్‌జి కమాండోస్ మొన్ననే కాకుండా ఇంతకు ముందు కూడా తీవ్రమైన సంఘటనలలో ఎప్పుడూ కూడా వారి శక్తియుక్తులను బాగా ప్రదర్శించారు. 2002వ సంవత్సరంలో గుజరాత్‌లోని అక్షరథామ్ ఆలయాన్ని ఉగ్రవాదుల చెర నుండి విడిపించిన సంఘటనలో కూడా యన్‌యస్‌జి కమాండోస్ యొక్క శక్తియుక్తులు బాగా ఉపయోగపడ్డాయి. ఆ యన్‌యస్‌జి దళంలో ముంబై దుశ్చర్యలలో ''ఆపరేషన్ సైక్లోన్''లో ఇద్దరు తెలుగు తేజాలు వుండడం మనకు గర్వ కారణం. అందులో ఒకరు వరంగల్ జిల్లాకు చెందిన బందిగ ప్రమోద్ కాగా, మరొకరు కరీంనగర్‌కు చెందిన అంబేద్కర్, మరో తెలుగు తేజం ఆర్మీలో నాసిక్ రెజిమెంట్‌లో పనిచేస్తూ టెర్రరిస్ట్‌ల చెర నుండి తాజ్ హోటల్‌ను విముక్తి చేసేందుకు చేపట్టిన ''ఆపరేషన్ సైక్లోన్''లో వీరోచితంగా పోరాడాడు, ఉగ్రవాదులను మట్టుబెట్టాడు. అతడు కడప జిల్లా కలసిపాడు మండలం ఎగువ రామాపురానికి చెందిన బాలాయపల్లి దస్తగిరి సాహెబ్. ఇంకొక విషాదమైన విషయం ఏమంటే ఈ ముంబై సంఘటనలో మన రాష్ట్రానికి చెందిన ముగ్గురు మృతి చెందడం మనందరికీ చాలా బాధాకరమైన విషయం. వారిలో ఒకరు లక్ష్మీనారాయణ గోయల్. రైల్వే స్టేషన్‌కు ఆలస్యంగా వెళ్లి హుస్సేన్‌సాగర్ ఎక్స్‌ప్రెస్‌ను అందుకోలేకపోయి మృత్యువాత పడడం చాలా బాధాకరం, దురదృష్టకరం. ఆయనతోపాటే ముంబై తాజ్ హోటల్‌లో పని చేస్తున్న మన రాష్ట్రానికి చెందిన హైదరాబాద్ నివాసి విజయరావు

బాంజ్యా, మరొకరు నిజామాబాద్‌కు చెందిన 20 ఏళ్ల యువతి అమీనా బేగం. వీళ్ల ముగ్గురూ కూడా ఉగ్రవాదుల దుశ్చర్యలకు బలికావడం ఎంతైనా బాధాకరమైన విషయం, విచారకరం. ఈ ముగ్గురి మృతుల కుటుంబాలకు మహారాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తున్నప్పటికీ మన రాష్ట్ర ప్రభుత్వం కూడా మన బాధ్యతగా భావించి వాళ్లు మన వాళ్లు కనుక మృతుల కుటుంబాలకు చెరి మూడు లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందజేయాలని నిర్ణయించాము. ఉగ్రవాదుల యొక్క ఒకే ఒక్క ఆలోచన ఏమంటే ఏదో ఒక విధంగా మన దేశంలో మత కల్లోలాలు రెచ్చగొట్టాలి, ఈ దేశంలో అన్ని మతాల వాళ్లూ సమరస భావంతో వుండకూడదు. ఏదో ఒక విధంగా ఒక మతం మరొక మతం పైన విద్వేషాలను రెచ్చగొట్టుకొనే ప్రయత్నం చేయాలనే ఒకే ఒక్క ఆలోచనతో అధ్యక్షా. ఈ దేశానికి సంబంధించిన ప్రతి మైనారిటీ వర్గానికి కూడా, నాకు తెలిసినంతవరకూ నూటికి 99.9999 శాతం మైనారిటీ వర్గాల వారందరూ కూడా ఇటువంటి దుశ్చర్యలను ఖండించడంలో ఏ మాత్రం వెనుకాడడం లేదు. ఇటువంటి దుశ్చర్యలు జరిగినప్పుడు ఏదో మైనారిటీ వర్గాల వాళ్లు దీని వెనుక వున్నారు, ముందున్నారనే భావన ఏ ఒక్క మెజారిటీ వర్గంలో కూడా రానివ్వకుండా వారందరూ మన అన్నదమ్ములు అనే పద్ధతిలో మనం ఇంకా గట్టిగా వ్యవహరించగలిగితే దీనికి సంబంధించిన ఇటువంటి చర్యలు మళ్లీ,మళ్లీ జరగకుండా బాగా గట్టి చర్యలు ప్రభుత్వాలు తీసుకోగలిగితే, అన్నింటికంటే ప్రధానంగా భారతదేశానికి సంబంధించిన ప్రతి రాజకీయ పార్టీ కూడా అన్ని విషయాలను పక్కన బెట్టి ఒక్క తాటిపైన నిలచి ఇటువంటి దుండగుల దుశ్చర్యలను ఖండించగలిగితే తప్పనిసరిగా అంతిమ విజయం మనదే. ప్రజాస్వామ్యాన్ని కొట్టగలిగిన శక్తి మరొక్కటి లేదన్న విషయాన్ని ఇటువంటి దుండగులు గుర్తుంచుకోవలసిన అవసరం వుంది. ఇవాళ ముంబై ఘటనల పట్ల, ముంబైలో జరిగిన సంఘటనల పట్ల భారత జాతి యావత్తూ ఒక్క తాటిపైన నిలిచే సందర్భంలో మనం తెలుగువాళ్లంగా, ఆంధ్ర ప్రదేశ్‌కి సంబంధించిన వాళ్లముగా పూర్తి జాతి ఒక్కటిగా నిలబడి ఇటువంటి దుశ్చర్యలను ఖండించడంలో భాగం కావాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ యన్. చంద్రబాబు నాయుడు : అధ్యక్షా, ఉగ్రవాద రక్కసి కోరలలో భారతదేశం మరొక్కసారి తల్లడిల్లింది. అయితే ఇప్పటికే చాలాసార్లు ఉగ్రవాదులు దాడులు చేశారు. అయితే ఈసారి చూస్తే అత్యంత అధునాతనమైన ఆయుధాలు వాడడం, బాంబులు వేయడం, గ్రెనేడ్స్ వాడడం, అదే మాదిరిగా ముంబైలో మన ఫైనాన్షియల్ క్యాపిటల్ మీద తొమ్మిది చోట్ల కొద్ది వ్యవధిలో దాడులు చేసి ఆ విధంగా భయభ్రాంతులు సృ ష్టించారు. ఒక యుద్ధ వాతావరణం చూపెట్టడం జరిగింది. ఇది ఒక విధంగా చెప్పాలంటే చాలా భయంకరంగా 60 గంటలపాటు ఉగ్రవాదులకు, భద్రతా దళాలకు మధ్య జరిగిన యుద్ధం. ఈ మాదిరిగా ఇవన్నీ టి.విలలో కూడా వచ్చాయి. దేశం అంతా కూడా చూశారు. ఒక భయంకరమైన పోరు జరిగింది. పోరాటాలు జరిగాయి. ఈ పోరాటంలో చూస్తే, మొట్టమొదటిసారిగా చూస్తే 195 మంది చనిపోవడం, ఇందులో 173 మంది పౌరులు చనిపోవడం, వేరే వ్యక్తులు అయితే 22 మంది చనిపోవడం. ఎవరైతే ఈ పోరాటం చేశారో వీళ్లలో చూసినప్పుడు యన్‌యస్‌జి కమాండోస్‌లో ఇద్దరు, మహారాష్ట్ర పోలీసులు 15 మంది, ఆర్‌పియఫ్ కానిస్టేబుల్ ఒకరు, హోమ్ గార్డ్స్ ఇద్దరు, మొత్తం 20 మంది చనిపోవడం, దగ్గర దగ్గర గాయపడిన వారిని చూస్తే 295 మంది, అదే మాదిరిగా ఫారినర్స్ 23 మంది, యన్‌యస్‌జి సిబ్బంది 8 మంది, మొత్తం 326 మంది గాయపడడం జరిగింది. ఈ పోరాటంలో ఉగ్రవాదులు పదిమందిని చంపివేయడం జరిగింది. ఈ యొక్క పోరాటంలో మన సిబ్బందిని మనం మనస్ఫూర్తిగా అభినందించవలసిన అవసరం వుంది. 610 మందిని వారు రక్షించారు. తాజ్ హోటల్‌లో 300 మందిని, ఒబరాయ్ హోటల్‌లో 250 మందిని, నారిమన్ హౌస్ నుండి 60 మందిని వీళ్లు రక్షించడం జరిగింది. ఈ యొక్క పోరాటంలో యన్‌యస్‌జీ వాళ్లు చాలా వీరోచితంగా పోరాడారు. చాలా టాక్ట్‌ఫుల్‌గా పోరాడారు. కమెండోలు అయితే టెర్రరిస్ట్‌లకు గట్టిగా బుద్ధి చెప్పడం జరిగింది.

ఎయిర్‌ఫోర్స్ గానీ, నావీ గానీ, యన్‌యస్‌జీ గాని అదే మాదిరిగా ముంబై పోలీసుల సహాయంతో చాలా సాహసోపేతంగా పోరాడి, టెర్రరిస్ట్‌లను మట్టుబెట్టడం జరిగింది.
ఉ. 11.10

ఇది యుద్ధం మాదిరిగా జరిగింది. ఈ దాడిలో హేమంత్ ఆయన తోటి సిబ్బంది చనిపోవడం అదే విధంగా మేజర్ కూడా ఆయన ఫాలోయర్స్‌ని ప్రొటెక్ట్ చేయడం కోసం చనిపోయారు. గజేంద్రసింగ్ గారు కూడా చనిపోయారు. వీరి ముగ్గురితో కలుపుకుంటే మొత్తం 10 మంది చనిపోయారు. వీరు ప్రజల ప్రాణాలను కాపాడడానికి పోరాడారు. వీరు ప్రజల ప్రాణాలను కాపాడడానికి వాళ్ల ప్రాణాలను కూడా లెక్కచేయలేదు. అలాంటి అమరవీరులకు మనం నివాళులర్పించవలసిన అవసరం ఉంది. వారి ధైర్యసాహసాలకు సెల్యూట్ చేయవలసిన అవసరం ఉంది. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని కోరుకుంటున్నాను. ఆ ఘటనలో 175 మంది మంది చనిపోయారు. అందులో మన రాష్ట్రానికి సంబంధించిన వారు ముగ్గురు వ్యక్తులున్నారు. వీరి కుటుంబాలకు కూడా నా ప్రగాఢ సానుభూతి తెలియజేసుకుంటున్నాను. ఈ ఘటనలో దాదాపు నాలుగు వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. ఉగ్రవాదులు సముద్ర మార్గాన వచ్చి దాడిచేశారు. ఇప్పటికీ కథనాలు వస్తున్నాయి. వారు మెయిన్ షిప్ నుండి బోట్‌కి మారారు. బోట్‌లో ఉన్న వారిని కూడా హతమార్చారు. ఆ ఫోటోలు కూడా చూస్తున్నాము. మనందరం రాజకీయాలకు అతీతంగా ఈ విషయంలో ముందుకు వెళ్లాలి. ప్రజలంతా కూడా ఈ ఘటనలో చనిపోయిన వారి కుటుంబసభ్యులకు సానుభూతిని తెలియజేస్తున్నారు. ప్రజలంతా భయభ్రాంతులు చెందుతున్నారు. ఇటువంటి దాడులు ఇది మొదటిసారి కాదు. రెండు, మూడు సార్లు ఈ విధంగా జరిగాయి. ఇంకొక పక్క మనం ఆర్థికంగా ముందుకు వెళ్తున్నాము. ఆర్థికవ్యవస్థను దెబ్బతీయడానికి ఉగ్రవాదులు బాంబేను టార్గెట్ చేశారు. బాంబే మనకు ఫైనాన్షియల్ క్యాపిటల్ సిటీ. అలాంటి సిటీ మీద దాడి చేశారు.

అధ్యక్షా, టెర్రరిస్టులకు కులం, మతం లేవు. చనిపోయిన వారిలో ముస్లిమ్స్ కూడా ఉన్నారు. టెర్రిరిస్టులు పాకిస్థాన్ నుండి వచ్చారని చెబుతున్నారు. ప్రజలు, వారు వారిని కాపాడుకునే పరిస్థితులలో లేరు. ప్రజల దగ్గర వెపన్స్ లేవు. టెర్రరిస్టులు ఏ.కె.47లను ఉపయోగించారు. సామాన్య ప్రజానీకం వారిని ఎదుర్కోవడం కష్టతరంగా ఉంది. అపోజిషన్ పార్టీగా మా సానుభూతిని తెలియజేస్తున్నాము. ఈ సంఘటనను ఖండిస్తున్నాము. ప్రభుత్వం దీని పైన చర్యలు తీసుకోవాలి. డిల్లీలో కూడా దాడి జరిగింది, 11.7.2000న మహారాష్ట్రలో, 8.9.08న మాల్గావ్ లో దాడులు జరిగాయి. మన దగ్గర మక్కా మసీదులో, లుంబినీ పార్క్‌లో, గోకుల్ ఛాట్‌లో టెర్రిరిస్టులు దాడి చేశారు. టెర్రరిస్టులు జయ్‌పూర్‌లో దాడి చేసినప్పుడు 68 మంది చనిపోయారు. గుజరాత్‌లో దాడి చేసినప్పుడు 56 మంది చనిపోయారు. అస్సాంలో కూడా వారు దాడి చేశారు. ఫైనల్‌గా ఇప్పుడు ముంబైలో దాడి చేశారు. మనం టీవీలలో చూస్తూనే ఉన్నాము. ప్రజలు రాజకీయనాయకులను అసహ్యించుకునే పరిస్థితి వచ్చింది. మీ మీద నమ్మకం పోయింది, మీరు మమ్మల్ని కాపాడలేరు, అన్నీ రాజకీయం చేస్తున్నారు తప్ప లా అండ్ ఆర్డర్ పై దృష్టి సారించడం లేదని రాజకీయ నాయకులను నిందించే పరిస్థితులు వచ్చాయి. ఈ విషయమై ప్రతి ఒక్కరూ పునరాలోచించాలి. రాజకీయ నాయకులు ప్రజల ప్రాణాలను కాపాడతామని, ప్రజల ఆస్తులను రక్షిస్తామని, లా అండ్ ఆర్డర్‌ని మెయింటెయిన్ చేస్తామని చెప్పి అధికారంలోకి వస్తున్నారు, వచ్చినతరువాత ప్రజల ప్రాణాలను కాపాడడంలో కాని, వారి ఆస్థులను రక్షించడంలోగాని ఫెయిల్ అయ్యారని చెబుతున్నారు. నేను జరిగిన ల్యాప్సెస్ గురించి

మాట్లాడుతాను. కేవలం చనిపోయిన వారికి కన్‌డొలెన్స్ తెలిపి, చనిపోయిన వారి కుటుంబాలకు సానుభూతి తెలిపి, ఒకరి మీద ఒకరు బురదజల్లుకొని ముగించడం కరెక్ట్ కాదు. మళ్లీ మళ్లీ ఇటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. 2004వ సంవత్సరం నుండి 21 సంఘటనలు జరిగాయి. ఇప్పటివరకూ 729 మంది ప్రాణాలను కోల్పోయారు. 2232 మంది దాకా గాయపడ్డారు. వారు చాలా భయంకరమైన వెపన్స్‌తో వచ్చారు.

2007 సంవత్సరానికంటే ముందు Antony గారు పార్లమెంట్‌లో మాట్లాడుతూ రాబోయే రోజులలో సముద్ర మార్గాన ఎక్స్‌ట్రీమిస్టులు టెర్రరిస్టులు మన దేశానికి వచ్చే అవకాశాలున్నాయని చెప్పారు. కాబట్టి కోస్టల్ గార్డ్స్‌ని స్ట్రెంగ్తెన్ చేయవలసిన అవసరం ఉంది. ఇన్వెస్టిగేషన్ ప్యానెల్ కొన్ని విషయాలను తప్పుబట్టారని ఆయనే పార్లమెంట్‌లో చెప్పారు. ఇంత పెద్ద సంఘటన జరిగిన తరువాత ఇంటెలిజెన్స్ ఫెయిల్ అయ్యిందని చాలా స్పష్టంగా కనిపిస్తుంది. ఇంటెలిజెన్స్ వర్గాలు ఏమి చేస్తున్నాయి? ఎందుకు సమాచారాన్ని తెప్పించుకోలేకపోయారు? నేవీకి సంబంధించి కోస్టల్ గార్డ్స్ ఉన్నారు. వారు ఎంతవరకూ పనిచేశారు? టెర్రరిస్టులు రెండు సార్లు బోట్స్ ఎక్స్‌ఛేంజ్ చేసుకున్నప్పుడు, ఎవరెవరు చనిపోయారు, ఎందుకు చనిపోయారని వాచ్ చేసుకోలేకపోయారు. డిప్లాయ్‌మెంట్ అఫ్ ఫోర్సెస్ గురించి నిన్న ఢిల్లీలో డిస్కషన్ జరిగింది. ఆల్‌పార్టీ డెలిగేషన్‌తో చర్చలు జరిగాయి. దాడులు జరిగి పది, పన్నెండు గంటలవుతున్నప్పటికీ వీరు ఏమి చేస్తున్నారు? మినిట్ టు మినిట్ అక్కడ ఏమి జరుగుతుందో వివిధ ఛానెల్స్ ప్రసారం చేస్తున్నాయి. ఇలాంటి ఆపరేషన్స్ జరుగుతున్నప్పుడు, కనీసం గవర్నమెంట్‌లో ఉండే వ్యక్తులు ఈ విధంగా దీనిని కంట్రోల్ చెయ్యాలి అని అపీల్ చెయ్యాలి. అవి కూడా చేసి ఉంటే ఇంకొంచెం బెటర్‌గా పెర్ఫార్మ్ చెయ్యడానికి అవకాశం ఉండేది. ఇవన్నీ మనం ఆలోచిస్తున్నప్పుడు కొన్ని ల్యాప్సెస్ మనకు స్పష్టంగా కనబడుతున్నాయి. పాల్ జనరల్ ఒక ఎడిటోరియల్ రాసారు. భారతదేశం పైన దాడి చేయడం చాలా స్పష్టంగా కనపడుతుంది, భద్రతా వ్యవస్థను కట్టుదిట్టం చెయ్యలేకపోవడం ఇందుకు ప్రధాన కారణం అని అన్నారు. మనం కూడా లెసన్స్ నేర్చుకోవలసిన అవసరం ఉంది. అమెరికాలో 9.11.08 న ఒక ఘటన జరిగింది. తరువాత దేశంలోని భద్రతా వ్యవస్థను కట్టుదిట్టం చేశారు. మనం అమెరికా వెళ్లినప్పుడు చూసాము. అక్కడ చెప్పులు తీయించి థరోగా చెక్ చేశారు. అమెరికాలో టవర్స్‌పై ఎటాక్ చేసినప్పుడు, రకరకాలుగా వీరు ఎటాక్ చేయవచ్చని అనుకున్నారు. ఇప్పుడు సముద్ర మార్గాన వచ్చారు. మన రాష్ట్రంలో 1500 కి.మీల కోస్టల్ ఏరియా ఉంది. అనేకసార్లు కొన్ని రూమర్స్ వచ్చాయి. ఎక్కడైతే ఎకనామిక్ యాక్టివిటీ ఉంటుందో అక్కడ ఎక్కువ దాడులు జరుగుతాయని అనుకున్నారు. హైటెక్‌సిటీ, తిరుమలో దాడులు జరగవచ్చని రూమర్స్ వచ్చాయి. ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఏ విధంగా ఉగ్రవాదాన్ని కంట్రోల్ చెయ్యాలని ఆలోచించాలి. ఒక్కొక్క సంఘటనకు సంబంధించి స్పెషల్ కోర్టులు పెట్టాలి. 21 సంఘటనలు జరిగాయి. ఒక్క ఇన్సిడెంట్‌కి సంబంధించి కూడా మనం ఏమి చెయ్యలేకపోయాము.
ఉ.11.20

ఇటీవలనే నేను పేపర్లలో చూశాను. మన రాష్ట్ర రాజధానిలో గతంలో జరిగిన మక్కా మసీదు, లుంబినీ పార్కు, గోకుల్ ఛాట్‌లవద్ద జరిగిన బాంబు పేలుళ్ల కేసు విచారణను నిన్నా, మొన్న మరలా ఇంకొక ఏజెన్సీకి మార్చారని తెలిసింది. ఇటువంటి సంఘటనలు జరిగిన ప్రతిసారి ఒక్కొక్క సంఘటనకు ఒక్కో ప్రత్యేక కోర్టు స్థాపించి, అందులో రెగ్యులర్‌గా విచారణ జరిపించి, దోషులుగా తేలినవారిపై చర్య తీసుకోవలసిన అవసరముంది. ఉదాహరణకు 1993లో ముంబైలో పేలుళ్లు జరిగినపుడు వందలమంది చనిపోయారు. కానీ

ఆ కేసులో ఇంతవరకు విచారణ జరగలేదు. ఆ సంఘటన జరిగి ఇప్పటికి పదిహేను సంవత్సరాలైంది కానీ దోషులకు పట్టుకోలేకపోయారు. కాబట్టి ఇటువంటి సంఘటనలు జరిగినపుడు వాటిని సీరియస్‌గా తీసుకొని అటు కేంద్ర ప్రభుత్వం కానీ ఇటు రాష్ట్ర ప్రభుత్వాలుకానీ ఎక్కడికక్కడ ప్రత్యేక కోర్టులను స్థాపించి విచారణ వేగవంతంగా జరిపించినచో చాలా ఉపయోగం ఉంటుంది. ఇంకొకపక్క భారతీయులందరికీ గుర్తింపు కార్డులు జారీ చేయవలసిన అవసరముంది. ఈ కార్డుల జారీగురించి మనం ఎన్నో సార్లు అనుకొన్నాం కానీ, ప్రభుత్వం ఇంతవరకు జారీ చేయలేదు. కావున ఇప్పటికైనా భారతదేశంలోని పౌరులందరికీ గుర్తింపు కార్డులు జారీచేయవలసిన అవసరమవుతుంది.

భూమార్గంద్వారా కానీ, సముద్రమార్గంద్వారా గానీ తీవ్రవాదులు భారతదేశంలోకి ప్రవేశించకుండా నిరోధించవలసిన అవసరం ఉంది. ఇందుకోసం విజిలెన్స్‌ను పకడ్బందీగా నిర్వహించవలసిన అవసరముంది. ఇలాంటి సంఘటనలు జరిగినపుడు రెండు, మూడు రోజులు గట్టిగా మాట్లాడడం తరువాత మరచిపోవడం అత్యంత బాధాకరం. ప్రపంచ వ్యాప్తంగా ఇలాంటి సంఘటనలను ఎక్స్‌పీరియన్స్ చేసే పరిస్థితి వచ్చింది. కులాలకు, మతాలకు, దేశాలకు అతీతంగా ఉగ్రవాదం ఎక్కడ ఉందో అక్కడ మనమందరం గట్టిగా పోరాడవలసిన అవసరముంది. అందుకోసం కేంద్ర ప్రభుత్వం దౌత్యమార్గాల ద్వారా వత్తిడి తేవడం అత్యంత అవసరం . ప్రపంచంలోని అన్ని దేశాలు సమిష్టిగా కలిసి పనిచేసి ఎక్కడ తీవ్రవాదం ఉన్నా దానిని నిర్మూలించడంకోసం మనమందరం కలిసి పనిచేయాలి. అదే మాదిరిగా పోలీసు బలగాలను రాజకీయాలకు అతీతంగా ఉపయోగించుకోవాలి. ఆ విధంగా రాజకీయాలకు అతీతంగా ఉపయోగించకపోతే ఇటువంటి సంఘనలు పునరావృతం అవుతాయి. ఇలాంటివి జరిగినపుడు ప్రభుత్వాలు ప్రజల విశ్వసనీయతను కోల్పోయే పరిస్థితి వస్తుంది. ప్రభుత్వాలను ప్రజలు నమ్మరు. ఇటువంటి సంఘటనలు జరిగినపుడు తెలుగుదేశం పార్టీనుంచి రాజకీయం చేయాలనే ఉద్దేశం మాకు లేదు. కానీ, ఇటువంటి సంఘటనలు జరిగినపుడు, సంతాప తీర్మానాలు పెట్టి, దానితో పని అయిపోయింది అనుకోవడం కరెక్ట్ కాదు. కేంద్ర హోం శాఖమంత్రిగారు నిన్ననే రాజీనామా చేశారు. దానిపై కూడా చాలా విమర్శలు వచ్చాయి. ఆయన ఎప్పుడో రాజీనామా చేసి ఉంటే ప్రజలకు సరైన మెసేజ్ వెళ్లి ఉండేదని అంటున్నారు. ఈ విషయమై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో కూడా కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. యూపీఏలోని భాగస్వామ్య పక్షాలు కూడా మాట్లాడాయి. ఏది ఏమైనప్పటికీ టెర్రరిజాన్ని మనమందరం చాలా గట్టిగా, కలిసికట్టుగా ఎదుర్కోవాలి. ప్రజలు కూడా వారి సంఘీభావాన్ని తెలియజేశారు.

ఈ సభలో ప్రధానప్రతిపక్షంగా ఉన్న మేం కూడా పూర్తి సంఘీభావాన్ని ప్రకటిస్తూ, జరిగిన సంఘటనలపట్ల మేం మా సానుభూతిని తెలియజేస్తున్నాను. మా పార్టీనుంచి పూర్తి సహకారాన్ని ప్రభుత్వానికి అందిస్తామని తెలియజేస్తున్నాను. అయితే ఇలాంటి సంఘటనలు జరగకుండా కాపాడవలసిన బాధ్యత అటు కేంద్ర ప్రభుత్వంపైన, ఇటు రాష్ట్ర ప్రభుత్వంపైన ఉంది. దేశంలో ఇటువంటి సంఘటనలు ఇప్పటికి 21 జరిగాయి. ఇటువంటి సంఘటనలు మరలా జరగవని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు విశ్వాసం కలిగించే చర్యలు తీసుకోవాలి. అందుకోసం ప్రభుత్వం అన్ని విధాలా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని మరలా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

ముంబైలో తీవ్రవాదులతో ఎన్ఎస్‌జీ కమెండోలు, వాయుసేన సిబ్బంది, నావికాదళ కమెండోలు, మహారాష్ట్ర పోలీసులు ధైర్య సాహసాలతో చాలా బ్రహ్మాండంగా పోరాడారు. వారికున్న తక్కువ సమయంలో

దేశాన్ని కాపాడడంకోసం, టెర్రరిజంపై పోరాడడంకోసం, ప్రజల ప్రాణాలను కాపాడడంకోసం వీరోచితంగా పోరాడారు. ఆయా విభాగాలకు చెందిన సుమారు ఇరవై మంది సాయుధ బలగాల సిబ్బంది ప్రాణాలర్పించారు. ప్రాణాలర్పించిన సాయుధ బలగాల వీరులకు మనస్ఫూర్తిగా సానుభూతిని తెలియజేయడమే కాకుండా నివాళులర్పించవలసిన అవసరముంది. ప్రపంచ దేశాల ముందు మన దేశం చిన్నబోకుండా మనమందరం కలిసి ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడడంకోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ టి.హరీష్‌రావు (సిద్దిపేట): అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు ప్రతిపాదించిన తీర్మానాన్ని మా పార్టీ తరపున పూర్తిగా బలపరుస్తున్నాము. ముఖ్యంగా ముంబై నగరంలో జరిగిన దాడి మహారాష్ట్ర మీద, ముంబై నగరం మీద కాకుండా భారతదేశ సమగ్రత మీద, సార్వభౌమత్వం మీద జరిగినట్లుగా భావించాలి. భారతదేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసేందుకు వాణిజ్య రాజధాని అయిన ముంబై మీద దాడిచేయడం చాలా దురదృష్టకరం. ఈ దాడిని మా పార్టీ తరపున చాలా తీవ్రంగా ఖండిస్తున్నాం . ఈ దాడిలో మహరాష్ట్ర ప్రభుత్వంలోని ముగ్గురు సీనియర్ అధికారులు, ఎన్‌ఎస్‌జీ కమెండోలు, ముంబై పోలీసులతో సహా 20 మంది ప్రాణాలు కోల్పోయారు. విదేశీ పౌరులతో సహా సాధారణ పౌరులు 150 మంది చనిపోయారు. ఈ సంఘటనలో రాష్ట్రానికి చెందిన పౌరులు కూడా మరణించడం చాలా దురదృష్టకరం. చనిపోయినవారి కుటుంబసభ్యులకు మా పార్టీ తరపున ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేస్తున్నాం . ఇటువంటి దాడులు జరిగినపుడు రెండు, మూడు రోజులు ఆయా సంఘటనల గురించి మాట్లాడుతున్నాం కానీ, అటువంటి దాడులు భవిష్యత్తులో జరగకుండా తీసుకోవలసిన చర్యల గురించి ప్రభుత్వం ఎక్కడా చెప్పడంలేదు. ముఖ్యంగా ముంబై నగరంమీద దాడి జరగడంవలన భారతదేశంలో విదేశీయులు పెట్టుబడులు పెట్టేందుకు వెనుకాడే పరిస్థితి వస్తుంది. టూరిజం కూడా దెబ్బతినే పరిస్థితి వస్తుంది. ముఖ్యంగా భారతీయులు ఇతర దేశాలకు వెళ్లాలంటే విదేశీ దౌత్య కార్యాలయాలు వీసాలు ఇచ్చేందుకు కూడా ఆలోచించే పరిస్థితి, ప్రమాదం ఉంది. విదేశాలలో ఉంటున్న భారతీయులను అనుమానాస్పదంగా చూసే పరిస్థితి ఉంది. అత్యంత ప్రమాదకరమైన టెర్రరిజాన్ని ఉక్కుపాదంతో అణచివేయాలి. ముంబైలో దాడిచేసిన టెర్రరిస్టులపై పోరాడడానికి ఎన్‌ఎస్‌జీ కమెండోలతో సహా దేశ సాయుధ బలగాలకు మూడు రోజులు పట్టింది. సాయుధ బలగాల సిబ్బంది ప్రాణాలకు తెగించి తీవ్రవాదులతో పోరాడి వారిని తుదముట్టించారు. ముఖ్యంగా ఆ పోరాటంలో పాల్గొన్న పోలీసు అధికారులకు మనస్ఫూర్తిగా మా పార్టీ తరపున అభినందనలు తెలియజేస్తున్నాను. ఈ సందర్భంలో మనమందరం ముక్త కంఠంతో జరిగిన సంఘటనలను ఖండించవలసిన అవసరముంది. ఇందులో రాజకీయాలకు తావులేదు.

ఈ సందర్భంగా మేం మా పార్టీ తరపున కొన్ని సూచనలు చేయదలచుకున్నాం. ఈ సూచనలను రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉంటే ఇక్కడే వాటి మీద చర్యలు తీసుకొని, కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంటే ఈ సభద్వారా కేంద్ర ప్రభుత్వానికి ఒక తీర్మానం చేయాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ముఖ్యంగా ముంబైలో జరిగిన సంఘటన అనంతరం సుమారు పన్నెండు గంటలపాటు ఎన్‌ఎస్‌జీ కమెండోలు, పారా మిలటరీ బలగాలను సంఘటన స్థలికి పంపించడంలో ఆలస్యం జరిగింది. భారతదేశంలోని ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబై, హైదరాబాదు, జైపూర్, గుజరాత్, అస్సాంలలో నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్‌ను గానీ, యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్స్‌ను గానీ శాశ్వతంగా ఏర్పాటుచేయాలి. సంఘటన జరిగిన అనంతరం ఢిల్లీనుంచి ఆయా నగరాలకు కమెండో బృందాలను తరలించడంలో ఆలస్యం జరిగి ఎక్కువ నష్టం జరిగే అవకాశం ఉంది కావున, ముఖ్య నగరాల్లో ఆయా బలగాలను సిద్ధంగా ఉంచినట్లయితే నష్టాన్ని కొంతవరకు తగ్గించవచ్చునని ప్రభుత్వానికి

తెలియజేస్తున్నాను. ముంబైలో పోరాడేందుకు నావికాదళ కమెండోలు, వాయుసేన కమెండోలు, ఎన్ఎస్‌జీ కమెండోలు, మహారాష్ట్ర పోలీసులను మోహరించారు. ఆ విధంగా వచ్చిన వివిధ బలగాలను ఎవరు కంట్రోల్ చేయాలి? ఎవరు ఎవరిని ఆదేశించాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. మహారాష్ట్ర పోలీసుల ఆధ్వర్యంలో పనిచేయాలా, మిలటరీ అధికారుల ఆధ్యర్యంలో పనిచేయాలా, ఎన్ఎస్‌జీ ఆధ్వర్యంలో పనిచేయాలా అనే కన్ఫ్యూజన్ వచ్చింది. ఇలాంటి సంఘటనలు జరిగినపుడు కామన్ కమాండ్ కంట్రోల్ ఒకటి ఏర్పాటుచేసి వారి నాయకత్వంలో పనిచేసే విధంగా స్పష్టమైన నిర్ణయాలను తీసుకోవలసిన అవసరముంది. జరిగిన సంఘటనను గమనించినట్లయితే టెర్రరిస్టులు అత్యాధునిక ఆయుధాలతో దాడులు చేస్తున్నారు. కానీ రాష్ట్ర బలగాలకుగానీ, కేంద్ర పారామిలటరీ బలగాలకు గానీ ఇంతవరకు పూర్తిస్థాయిలో అధునాతన ఆయుధాలు అందించడంలేదు. అందుకు బలగాలను ఇంతవరకు పూర్తిస్థాయిలో తయారుచేయలేకపోయాం. టెర్రరిస్టులతో పోరాడుతూ మహారాష్ట్ర ఏటీఎస్ చీఫ్ కర్కరే చనిపోయారు. ఆయన బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ వేసుకున్నా కూడా లోపలికి వెళ్లిన కొద్ది క్షణాల్లో మరణించారు. అత్యాధునిక ఆయుధాలను ఉపయోగించడంలో పోలీసులకు, రక్షణ బలగాలకు పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వాల్సిన అవసరముంది.

ముఖ్యంగా పౌరులందరికీ నేషనల్ ఐడెంటిటీ కార్డులు ఇవ్వవలసిన అవసరముంది. అభివృద్ధి చెందిన దేశాలలో ప్రతి పౌరునికి గుర్తింపు కార్డులు జారీ చేశారు. సుమారు వంద కోట్ల ప్రజలున్న మన దేశంలో ఎన్నో సంవత్సరాలనుంచి గుర్తింపు కార్డులు ఇస్తామని చెబుతున్నారు కానీ, కార్డులు జారీ చేయడంలో చాలా ఆలస్యం జరిగింది.

ఉ.11.30

తప్పకుండా నేషనల్ ఐడెంటిటీ కార్డుల విషయమై వెంటనే కేంద్ర ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకొని ప్రతి ఒక్కరికి నేషనల్ ఐడెంటిటీ కార్డు ఉండే విధంగా వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. టెర్రరిజమ్ మీద సంఘటన జరిగినప్పుడే మాట్లాడుకోవడం కాదు. మన చట్టంలో కొన్ని లొసుగులున్నాయి. ఈ టెర్రరిజాన్ని ఉక్కుపాదంతో అణచి వేయాలంటే రెగ్యులర్ చట్టాల్లోలాగా, రెగ్యులర్ కోర్టుల్లోలాగా కాకుండా అవసరమైతే ఒక ప్రత్యేకమైన చట్టాన్ని కూడా తీసుకు రావలసిన అవసరం ఉంది. ముఖ్యంగా దేశ సార్వభౌమత్వం మీద దాడి చేసిన వ్యక్తుల మీద చర్య తీసుకోవాలంటే ఈనాడు మన చట్టాలు ఏ విధంగా ఉన్నాయో మనకు తెలుసు. సంవత్సరాల తరబడి కోర్టులో ఆలస్యమవుతున్న పరిస్థితులున్నాయి. అట్లా కాకుండా ఉగ్రవాదుల విషయంలో అవసరమైతే ప్రత్యేకమైన కోర్టులు పెట్టి ఏరోజుకారోజు హియరింగ్స్ పెట్టడం ద్వారా త్వరితగతిన నిర్ణయాలు తీసుకునే విధంగా ప్రభుత్వాలు ఆలోచించాలి. చట్టాలను సవరించవలసిన అవసరం ఉంది. జుడిషియరీ వారు గానీ, పోలీసు అధికారులు కూడా హియరింగ్ తీసుకునే సందర్భాల్లో ఇలాంటి టెర్రరిస్టుల పట్ల భయపడే ప్రమాదముంది. అవసరమైతే అవన్నీ రహస్యంగా తీసుకోవడానికి అవకాశం కల్పించే విధంగా చట్టాలను సవరించాలని మీ ద్వారా కోరుతున్నాను. ఈనాడు ఉగ్రవాదులు రెండు రకాలుగా ఉన్నారు. సీమాంతర ఉగ్రవాదులు కొందరైతే కొంత మంది మన దగ్గరనే ఉగ్రవాదులుగా తయారవుతున్నారు. టెర్రరిస్టులుగా ఎందుకు రిక్రూట్ అవుతున్నారు? టెర్రరిస్టులుగా ఎందుకు తయారవుతున్నారు అందుకు దారితీస్తున్న పరిస్థితులను ప్రభుత్వాలు ఆలోచించవలసిన అవసరం ఉంది. వేద పాఠశాలలు కావచ్చు, మదర్సాలు కావచ్చు, ఏది ఏమైనా టెర్రరిస్టులను కొంత మందిని మనం గమనిస్తే వారందరు కూడా చిన్న వయస్సుగల వారు కేవలం 21 సంవత్సరాలు, 19 సంవత్సరాలు వయస్సు గలవారున్నారు. వాళ్ల విషయంలో మనం ఆలోచించాల్సింది ఏమిటంటే కొంత మంది ఆయా పాఠశాలల్లో

చదువుకునే వారికి ఇతర సబ్జెక్టులు చెప్పడం లేదు. సోషల్‌గానీ, ఇంగ్లీషు గానీ, మేథమెటిక్స్ గానీ చెప్పడం లేదు. దేశం యొక్క సామాజిక బాధ్యతలు చెప్పకుండా వాళ్లకు ఇది మాత్రమే నూరిపోస్తూ ఒక రకంగా వారిని పెంచుతున్నారు. అలాంటి వాటి పట్ల మనం ఆలోచన చేయాలి. ప్రతి ఒక్కరికీ కఠినంగా నిర్బంధ విద్యను పదవ తరగతి వరకు అందించి, సామాజిక బాధ్యతను నేర్పించవలసిన అవసరం ఉంది. వాటి మీద మనం ఆలోచన చేయాలి. ఈ టెర్రరిస్టులు ఎందుకు రిక్రూట్ అవుతున్నారు? ఎక్కడ రిక్రూట్ అవుతున్నారు? వారు విచక్షణా జ్ఞానాన్ని ఎందుకు కోల్పోతున్నారు? ఆయొక్క సామాజిక మూలాలను వెదకి వాటిని కూడా సరి చేసుకోవలసిన అవసరం ఉందని మీ ద్వారా ప్రభుత్వానికి తెలియచేస్తున్నాను.

సంఘటన జరిగినప్పుడు స్పందించడం కాకుండా అసలు ఈ నిఘా వ్యవస్థను పటిష్టం చేసుకోవలసిన అవసరం ఉంది. అమెరికాలో ఉండే సిఐఎ స్థాయిలో మన నిఘా వ్యవస్థను కూడా పూర్తి స్థాయిలో పటిష్టం చేయాలి. మన నిఘా వ్యవస్థ చాలా బలహీనంగా ఉందనడానికి ఈ మధ్య కాలంలో వరుసగా జరుగుతున్న బాంబు పేలుళ్లే ఒక ఉదాహరణ. మనం ఈ నిఘా వ్యవస్థను చాలా పటిష్టంగా చేసుకొని దీనికి పూర్తి స్వయం ప్రతిపత్తిని ఇవ్వాలి. నిఘా వ్యవస్థను కూడా రాజకీయం చేసి రాజకీయంగా వాటిని ఉపయోగించుకోవడానికి అటు రాష్ట్ర ప్రభుత్వాలు గానీ, కేంద్ర ప్రభుత్వం గానీ మానుకొని వారికి అవసరమైతే స్వయం ప్రతిపత్తిని ఇచ్చి బడ్జెటును కూడా పెంచి మన నిఘా వ్యవస్థను పూర్తి స్థాయిలో పటిష్టవంతం చేయాలని మీ ద్వారా మనవి చేస్తున్నాను. ఈ సంఘటన జరిగిన తరువాత జాతీయ ఛానెళ్లలో ఎక్కడ ఇంటర్వ్యూలు చూసినాగానీ రాజకీయ నాయకుల మీద, రాజకీయ వ్యవస్థల మీదనే ప్రజలకు ఏవగింపు తయారవుతున్నది. వాళ్ల మాటలు చూస్తూ ఉంటే ఎంతో బాధ కలుగుతున్నది. ఒక రాజకీయ నాయకుడుగా, ఒక ఎంఎల్ఏగా ప్రజలు మాట్లాడుతున్న మాటలు వింటూ ఉంటే అవమానంగా భావించవలసిన పరిస్థితి ఉంది. దీనికి కారణమేమిటంటే వారందరూ చెబుతున్న అవినీతి. మన దేశంలో గానీ, మన ప్రాంతంలో గానీ అవినీతనేది విపరీతంగా పెరిగి పోయింది. ఈ అవినీతిని కంట్రోల్ చేయనంత కాలం ఇలాంటి సంఘటనలు ఇంకా పునరావృతమవుతాయి. ఆర్‌డిఎక్స్ మొదలైనవి మన దేశంలోకి ఏ విధంగా వచ్చాయి? హోటళ్లలోకి మెషిన్‌గన్స్, ఆర్‌డిఎక్స్ పోతున్నాయంటే ఎక్కడో, ఏదో స్థాయిలో అవినీతి ఉండబట్టే మనం దీన్ని అడ్డుకోలేక పోతున్నాం. అవినీతిని అడ్డుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజలకు ప్రజాస్వామ్యం మీద, రాజకీయ వ్యవస్థ మీద విశ్వాసం కల్పించాల్సిన అవసరం ఉంది. ఇదేరకమైన పరిస్థితి కొనసాగితే ప్రజలు తిరగబడే పరిస్థితి మనం చూస్తున్నాం. ప్రజలు మాట్లాడుతున్న భాష గానీ, వారిలో కనబడుతున్న ఉద్రేకం గానీ, ఆవేదనగానీ చూస్తూ ఉంటే ఎంతో బాధగా ఉంది. అందువలన ఈ ప్రభుత్వం దీని మీద కఠినమైన చర్యలు తీసుకోవాలి. ఏదో సంతాప తీర్మానం పెట్టి దీన్ని ఇంతటితో వదలి వేయకుండా రాజకీయాలకు అతీతంగా...... ఈనాడు వ్యవస్థ ఏ విధంగా తయారైందంటే, నేషనల్ ఐడెంటిటీ కార్డు ఇవ్వాలన్నా, కొన్ని కఠినమైన చర్యలు తీసుకోవాలన్నా ఓటు బ్యాంకు రాజకీయాలు దృష్టిలో పెట్టుకొని , ఓట్ల కోసం కొన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ విధంగా కాకుండా ముందు మన దేశ సమగ్రతను, సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాలి. ఆ తరువాతనే రాజకీయాలైనా, అధికారమైనా, ఇంకేమైనా. దీని కోసం అందరం కూడా నిష్పక్షపాతంగా, ముక్త కంఠంతో దీన్ని ఖండించాల్సిన అవసరం ఉంది. దీని మీద తగిన చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని మీ ద్వారా మనవి చేస్తూ నేను సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎం.ఎ.గఫూర్ (కర్నూలు) : అధ్యక్షా, ఇటీవల బొంబాయిలో జరిగిన ఉగ్రవాదుల దాడులపైన, ఆ దాడుల్లో బలైపోయిన సామాన్య ప్రజానీకానికి, అలాగే ఉగ్రవాదుల వ్యతిరేకంగా పోరాడుతూ ప్రాణాలర్పించినటువంటి అమరవీరులైన పోలీసు అధికారులకు, వీర జవాన్లకు సిపిఎమ్ పార్టీ తరపున తీవ్రమైన

సంతాపాన్ని, ప్రగాఢమైన సానుభూతిని వారి కుటుంబాలకు తెలియచేస్తున్నాను. ఇప్పుడు జరిగిన ఈ దాడి ఒక్కరోజులో జరిగినది కాదు. గతంలోకూడా జరిగాయి. భారతదేశంలో ఈ రోజు ఏ నగరంలో కూడా సామాన్య పౌరుడు భద్రతగా నేను జీవిస్తాననే విశ్వాసంతో బ్రతికే పరిస్థితి లేదు. ఢిల్లీ, అహ్మదాబాద్, సూరత్, బెంగుళూరు, హైదరాబాదు గానీ, బొంబాయిలో గతంలో జరిగింది, ఇప్పుడు కూడా జరిగింది. ఈ రకంగా ఉగ్రవాదం భారతదేశాన్ని టార్గెట్‌గా చేసుకొని తాము ఎంపిక చేసుకున్న లక్ష్యాలను, తాము ఎంపిక చేసుకున్న నగరాల్లో స్వైర విహారం చేస్తూఉంటే ఉగ్రవాదాన్ని ఎదుర్కోనడానికి అవసరమైన పటిష్టమైన చర్యలు గానీ, అవసరమైన కార్యాచరణ ప్రణాళిక గానీ ఇప్పటికీ లేదు. ఇక ముందైనా రూపొందించు కోకపోతే మాత్రం ప్రజలు మనల్ని క్షమించరు. దురదృష్టవశాత్తూ రెండు ముఖాలుగా ఈ ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ప్రయత్నాలు జరుగకపోగా చెరొకవైపు లాగుతూ దీంట్లో నుంచి తమ రాజకీయ స్వప్రయోజనాలు పొందాలనే ప్రయత్నాలు కొందరు చేస్తున్నారు. మా దృష్టిలో ఉగ్రవాదానికి మతం లేదు. ఉగ్రవాదమనేది మతం రంగు పులుముకున్నప్పటికీ మత ప్రయోజనాలు కాదు, దాని ఆర్థిక ప్రయోజనాలు వేరు, దాని యొక్క స్వార్థ ప్రయోజనాలు వేరు. దాని వెనుక ఉండే కొంత మంది స్వార్థపరులు తమ ప్రయోజనాల కోసమే ప్రపంచాన్ని అల్లకల్లోలం చేస్తున్న పరిస్థితిని మనం చూస్తున్నాం. బొంబాయికి వచ్చిన ఉగ్రవాద ముఠా భారతదేశం లోనిది కాదు. బయటి దేశాల నుంచి వచ్చారు. బయటి దేశాల నుంచి వచ్చి కొన్ని వందల కిలోమీటర్లు సముద్రంలో ప్రయాణం చేసి ఆర్‌డిఎక్స్‌లు, గ్రైనేడ్లు, ఎకె47లు మూటలు, మూటలుగా, సంచులు, సంచులుగా మోసుకొని వస్తుంటే ఏమి చేస్తున్నామో నాకైతే అర్థం కావడం లేదు. వీసా లేదు, చట్టబద్ధత లేదు, నేరుగా దేశంలోకి చొచ్చుకొని వచ్చి దేశంలో కనపడిన వాళ్లనందరినీ కాల్చి చంపేస్తామనే పద్ధతిలో ఉగ్రవాదం స్వైరవిహారం చేస్తూంటే దాన్ని అరికట్టడానికి కఠినాతి కఠినంగా ప్రభుత్వం వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైందని సిపిఎమ్ పార్టీ తరపున మేము భావిస్తున్నాం. కొంత మంది ఓటు బ్యాంకు రాజకీయం కోసం మెతకదనం వహిస్తున్నదని చెబుతున్నారు. హేమంత్ కర్కరే అనే ఆఫీసరు యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్‌కి లీడర్‌గా ఉండి మాలేగావ్ పేలుళ్లలో అందరూ భావించిన మార్గంలో కాకుండా మరొక కోణంలో పరిశోధించి సాక్ష్యాధారాలు సేకరించి, ఎవరైతే ఓటు బ్యాంకు రాజకీయాలని భజన చేస్తూ తప్పుడు ప్రచారంతో దేశాన్ని ఆక్రమించాలని చూస్తున్నారో వాళ్ల అసలు బండారం బయట పెట్టేటువంటి ధీరోదాత్తమైన ఆఫీసరు శ్రీ హేమంత్ కర్కరే. ఆయన చాలా నిజాయితీగా తనకు అప్పజెప్పిన డ్యూటీ చేస్తుంటే ఆయన మీద రకరకాల ఆరోపణలు చేసిన వారు ఆయన చనిపోయిన తరువాత కోటి రూపాయల బహుమానం ప్రకటిస్తున్నారు. స్వప్రయోజనాల కోసం రాజకీయాలను ఎట్లా వాడుకుంటున్నారో, రాజకీయ ప్రయోజనాల కోసం ఉగ్రవాదాన్ని కూడా ఎట్లా వాడుకుంటున్నారో చెప్పడానికి నేను ఈ విషయాన్ని చెబుతున్నాను.

ఉ.11.40

కాబట్టి నేను చెప్పేదేమంటే, దీనికి మతం రంగు పూయడం కాదు, మనమందరం కలిసి ఆత్మశోధన చేసుకోవాల్సినటువంటి అవసరమున్నది. ఉగ్రవాదులు ఈ దేశంలోకి ఎట్లా చొచ్చుకుని వస్తున్నారు? ఇంటెలిజన్స్ ఏమౌతుంది? ఐదారు రోజులు ప్రయాణం చేసి భారతదేశంలోకి వచ్చారు. తాజ్ మీద కూడా దాడి జరుగుతుందని మాకు ఇన్ఫర్మేషన్ వుందని నిన్న రతన్ టాటా గారు కూడా చెబుతున్నారు. ఇండియాలో టెర్రరిస్టులు దాడి చేయబోతున్నారని నవంబరు 18నే సెంట్రల్ గవర్నమెంట్ వారికి సమాచారముందనే విషయాన్ని వాళ్లే చెబుతున్నారు, అవి పత్రికల్లో వచ్చినటువంటి వార్తలు. అంటే నిఘా విభాగం నిద్రపోతున్నదా? మరి నిద్రపోతుంటే ప్రజలకు రక్షణ ఎలా కల్పిస్తాం? నిన్న బొంబాయిలో జరిగి వుండవచ్చు, రేపు హైదరాబాదులో జరగవచ్చు. నిఘా వ్యవస్థను ఎట్లా పటిష్టం చేసుకోవాలనే దానిమీద పూర్తిగా ప్రభుత్వాలు శ్రద్ధ

చూపాల్సినటువంటి అవసరముంది. నిఘా విభాగాన్ని పూర్తిగా రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నాము. రాజకీయంగా గెలుపు, ఓటములను నిర్ణయం చేస్తాయా లేదా, ఎవరికెంత మెజారిటీ వస్తుంది, అభ్యర్థులు ఎవరైతే బాగుంటుందో పరిశీలించమనే బాధ్యతలు అప్పజెపుతున్నామే తప్ప, ప్రజల యొక్క సేఫ్టీ, సెక్యూరిటీ మీద ఇంటెలిజన్స్ దృష్టి కేంద్రీకరించడం లేదు. ఆ రకంగా వుండటం వల్లనే ఇంటెలిజన్స్ వైఫల్యం జరుగుతున్నది. ఇంటెలిజన్స్ వైఫల్యం వల్లనే ఉగ్రవాద సంస్థలు ఈ రకమైన దాడులు చేస్తున్నాయనే విషయాన్ని ఈ సందర్భంగా మనం గమనించాలి. దీన్ని మనం ఎదుర్కోవాలి. కానీ దీన్ని ఎదుర్కోవడానికి చట్టాలు సరిపోవు, పోటా కావాలని కొంతమంది, తూటాలు కావాలని మరికొంతమంది అంటున్నారు. ఈ పోటాలు, తూటాలు తరువాత సంగతి సార్. నేను మనవి చేసేదేమంటే, ప్రజల మధ్య ఐక్యతను పెంచండి, ప్రజలను చెదరగొట్టవద్దు. మతం రంగు పులిమి దీన్ని రాజకీయం చేయొద్దు. ఈ రకంగా మత విభజన తీసుకొచ్చి, దేశంలో అనైక్యతకు తావు ఇవ్వొద్దు. ఈ దేశం సమైక్యంగా ఉగ్రవాదాన్ని ఎదుర్కోవాలి. ఈ దేశంలో ఉగ్రవాదుల యొక్క ప్రవేశాన్ని గాని, ఉగ్రవాద దాడులను గాని ఏ మత పౌరుడైనా, ఏ మతాన్ని నమ్మేవాడైనా భారతీయుడెవరూ కూడా ఉగ్రవాదాన్ని ఒప్పుకోడు, సహించడు. మొత్తం ఈ రోజు అన్ని మతాలకు సంబంధించిన వారు కూడా ఉగ్రవాదులకు వ్యతిరేకంగా, సమైక్యంగా కదలాల్సిన అవసరమొచ్చింది. ఆ విధంగా ప్రజలను ఐక్యం చేసే రాజకీయాలను పాటించమని నేను కోరుతున్నాను, దానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

ఉగ్రవాదుల పోరాటంలో మరొక అంశమేమంటే, ప్రస్తుతం మన ప్రభుత్వం ఆర్థిక సరళీకరణ పేరుతో అమెరికాకు అతి సన్నిహితంగా పోతోంది. నా ఉద్దేశంలో గాని, మా పార్టీ ఉద్దేశంలో గాని ఈ రోజు ఉగ్రవాదం ప్రపంచంలో పెచ్చరిల్లడానికి ప్రధాన బాధ్యత అమెరికాది. అనేక దేశాలపై దాడులు చేస్తూ, అక్కడున్నటువంటి ప్రజలను ఏ మాత్రం మానవత్వం లేకుండా నాశనం చేస్తూ, తమ వ్యాపార ప్రయోజనాల కోసం పెత్తనం చేస్తున్నటువంటి అమెరికావల్లనే ప్రపంచంలో ఉగ్రవాదం పెరుగుతోంది. అటువంటి దేశంతో స్నేహం చేసే విషయంలో భారత ప్రభుత్వం జాగ్రత్తగా వుండాల్సింది. భారత ప్రభుత్వం అటువంటి జాగ్రత్తలేవీ తీసుకోవడం లేదు. అమెరికా కౌగిలిలో మనం బిగిసిపోయేకొద్దీ ఉగ్రవాదులకు మనం టార్గెట్‌గా మారబోతున్నాం. ఆ విధంగా మనం టార్గెట్‌గా మారకుండా వుండాలంటే, మనం సామ్రాజ్యవాదం నుంచి దూరం కావాల్సిన అవసరముంది. దేశ ప్రజలందరినీ చైతన్యపరచాల్సిన అవసరముంది. ఆ రకమైనటువంటి చర్యలు ప్రభుత్వాలు తీసుకోవాలి. నిఘాను పెంచాలి. మొన్న బొంబాయిలో ఉగ్రవాదుల దాడులు జరిగితే, మన హైదరాబాదులో వెహికల్ చెకప్‌లు చేసారు. అదేవిధంగా కర్నూల్లోనూ చేసారు. ఆ ఒక్కరోజు మాత్రమే చేసారు, మళ్లా ఆ విషయాన్ని మరిచిపోయారు. కాబట్టి, నేను చెప్పేదేమంటే అక్కడెక్కడో దాడులు జరిగినప్పుడు మాత్రమే మేల్కోవడం కాదు, ఎల్లప్పుడూ జాగ్రత్తతో వుండాలి, నిరంతరమైనటువంటి నిఘా వుండాలి. ఆ రకమైనటువంటి పద్ధతుల్లో ప్రభుత్వాలు పనిచేయాలని నేను కోరుతున్నాను. ఈ దాడుల్లో నిజాయితీపరులైన, చాలా మంచి పేరున్న ముగ్గురు ఐపీఎస్ అధికారులు చనిపోయారు. అలాగే చనిపోయిన మిగతా 20 మంది పోలీసు అధికారుల్లో ఉన్నికృష్ణన్, గజేంద్ర సింగ్ మొదలైన సైన్యానికి చెందినవారు, 190 వరకు సామాన్య పౌరులు కూడా వున్నారని తెలుస్తోంది. ఇప్పటికే 800 మంది దాకా ఇట్లాంటి దాడుల్లో చనిపోయారు. వాళ్లకు ఏ పాపం తెలియదు, వాళ్లు అమాయకులు. ఆ విధంగా చాట్ భండార్లో వుండి చనిపోయినవారున్నారు, పార్కులో వుండి చనిపోయినవారున్నారు. ఇట్లాంటి అమాయక పౌరులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద వుంది. కాబట్టి, ప్రభుత్వాలు ఇప్పటికైనా సరే, నిద్ర నుంచి బయటకొచ్చి, నిఘాను పెంచి, సామాన్య ప్రజలను కాపాడేటువంటి చర్యలను తీసుకోవాలని ఒకవైపు కోరుతూ, మరోవైపు చనిపోయిన వారందరికీ కూడా మా సంతాపాన్ని, సానుభూతిని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ చాడా వెంకట రెడ్డి : అధ్యక్షా, ఈ రోజు సభానాయకులు ముంబాయిలో టెర్రరిస్టుల ఘాతుకానికి బలైనటువంటి అనేకమందికి నివాళులర్పించే తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఉగ్రవాదుల చర్యలు ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్నాయి. ప్రధానంగా ఒక పటిష్టమైన ప్రజాస్వామ్య విధానాలకు కట్టుబడి వుండి, ప్రపంచంలోనే అత్యంత పెద్ద ప్రజాస్వామ్య దేశమైన మన దేశంపైన కూడా ఈ ఉగ్రవాదులు 2001 నుంచి ఈ దాడులకు పూనుకుంటున్నారు. ఈ మధ్య మూడు, నాలుగు రోజులుగా దాడులు చూస్తూ వుంటే, మానవాళి మనుగడకే ఒక ప్రమాదంగా లేదా మానవ జాతికే ఒక విఘాతం కలిగించే పద్ధతుల్లో ఈ ఉగ్రవాదుల చర్యలు కొనసాగుతున్నాయి. ప్రధానంగా ముంబాయి మన దేశంలో ఒక పెద్ద నగరం, వ్యాపార కేంద్రం, ఫైనాన్షియల్ రిసోర్సెస్‌కు సంబంధించి మన దేశానికి కేంద్రబిందువైన నగరం. అలాంటి నగరాన్ని ఉగ్రవాదులు ఎంచుకుని దాడి చేసారంటే, ఒక పథకం ప్రకారమే వారు దాడి చేసినటువంటి పరిస్థితులు కనపడుతున్నాయి. ప్రధానంగా అక్కడ జరుగుతున్న దాడులు టీవీల్లో చూస్తూ వుంటే , ప్రతి ఒక్కరికీ రగిలిపోయే పద్ధతుల్లో ఒక రకమైనటువంటి బాధాకరమైనటువంటి, ఆవేదనభరితమైనటువంటి సన్నివేశాలు అక్కడ కనపడుతూ వున్నాయి. ప్రధానంగా తాజ్, ఒబెరాయ్ హోటళ్ల లాంటి ప్రజా సమూహాలు వుండేటువంటి ప్రదేశాలనే వాళ్లు ఎంచుకుని, దాదాపుగా రెండు సంవత్సరాల నుంచి పథకం వేసుకుని, ప్లాన్ చేస్తున్నట్లుగా తెలుస్తూవుంది.

మన భారతదేశంలో ప్రధానంగా మనం కూడా యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) ను ఏర్పాటు చేసుకుని, అలాగే ఇంకా ఎన్ఎస్‌జీకి సంబంధించి కూడా ఒక ప్రధానమైనటువంటి పద్ధతుల్లో మనం పరిశోధన చేసుకోవడానికి చర్యలు తీసుకున్నా, ప్రధానంగా ఈ ముంబాయి దాడుల్లో చూస్తుంటే, వాళ్లు ఏ రకంగా బాంబులు, ఏకే – 47, ఆర్‌డీఎక్స్ వంటి అధునాతనమైన ఆయుధాలను తీసుకునిరాగలిగారు ఏ రకమైనటువంటి పద్ధతుల్లో ఇక్కడకి రాగలిగారు అనేటువంటి దానిపైన ఇంకా లోతైన అధ్యయనం చేయాల్సిన అవసరమున్నది. ఏదైనా మొత్తం మీద 60 గంటలపాటు ముంబాయి నగరమంతా యుద్ధ వాతావరణం నెలకొని వుంది. అసలు ఎక్కడ, ఏం జరుగుతుందో చెప్పలేని పరిస్థితి. ఎవరు చనిపోతారు, ఎక్కడ, ఎలా చనిపోతారు, ఎలాంటి సంఘటనలు జరుగుతాయనేది చెప్పలేనటువంటి పరిస్థితి వుండినది. అందరూ కూడా టీవీల దగ్గరే కూర్చుండి ఆవేదనతో చూస్తున్న పరిస్థితిని మనమందరం చూసాం. నిజంగా చెప్పాలంటే మర ణించిన వీర జవాన్లు, వీర కమాండోలు దాదాపు 20 మంది అందులో నిజంగా ప్రాణాలకు తెగించి, ఏదైనా మా బాధ్యతను, మా కర్తవ్యాన్ని నిర్వర్తిస్తాం, ఈ దేశ సమగ్రతను, సార్వభౌమత్వాన్ని నిలబెడతాం, ఈ దేశంలో ముంబాయి నగరంలోకి వచ్చిన టెర్రరిస్టు చర్యలను అంతం చేస్తాము, అని ప్రాణాలను సైతం లెక్కచేయకుండా త్యాగాలు చేసి, దాదాపు 60 గంటల్లోనే టెర్రరిస్టు చర్యలను అంతం చేసారు. వాళ్లను నిజంగా మనందరరం కూడా కొనియాడటం కాదు గదా, దేశం మెత్తం కూడా వాళ్లు చేసినటువంటి త్యాగాలకు వెలకట్టలేమని నేను భావిస్తున్నాను. ఆ విధంగా 20 మంది ప్రాణాలర్పించారు. ఉగ్రవాదులతో పోరాటంలో ప్రధానంగా ప్రాణాలు కోల్పోయినటువంటి ఏటీఎస్ అధినేత హేమంత్ కర్కరే, ఎన్ఎస్‌జీ మేజర్ సందీప్ ఉన్ని కృ ష్ణన్, హవాల్దార్ గజేంద్రన్ ఇట్లాంటి వాళ్లతోపాటు, మరో పదిహేనుమంది వీర జవాన్లు చనిపోవడం పట్ల మా సిపిఐ పార్టీ తరపున వారికి నివాళులర్పిస్తూ, మా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాము. అలాగే, 141 మంది పౌరులు, 22 మంది విదేశీయులు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటనలో ప్రాణాలు కోల్పోయిన కమాండోలు, వీర జవాన్ల త్యాగ ఫలితంగా 610 మంది అతిథులు విముక్తి పొందగలిగారు. ఈ రకమైనటువంటి సంఘటనలు ఎందుకు జరుగుతున్నాయి, దీనికి గల కారణాలేమిటి? ఇలాంటి ఉగ్రవాద చర్యలు జరిగినప్పుడే మనం మేల్కొనడం, తరువాత సంఘటనల్ని మనం మర్చిపోవడం, మనం ఎప్పుడు సంఘటన జరిగితే,

అప్పుడు ఖండించేటువంటి పరిస్థితి కాకుండా, దీన్ని సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరముంది. మరి నిజంగా పాకిస్థాన్ ద్వారా ఉగ్రవాదులు, టెర్రరిస్టులు ఎలా మన దేశంలోకి ప్రవేశించారు? సముద్రయానాన్ని ఎంచుకుని, ఆ మార్గం ద్వారా ప్రధానంగా ట్రూప్ పడవల సాయంతో వారు ప్రయాణం చేసి, అనేక పద్దతుల్లో యుద్ధానికి సిద్ధమైనట్లుగా మరి ఆర్డీఎక్స్, గ్రెనేడ్లు లేక ఏకె-47లు, బాంబులు తీసుకుని రాగలిగినారంటే, మన నిఘా విభాగాలు ఏం చేసినట్లు, ఏమైనట్లు ? ఇప్పుడు చర్చలో చెబుతున్నారు. ఇంటెలిజెన్స్ విభాగాలు సెప్టెంబరులోనే ఈ విషయాన్ని చెప్పాయని చెబుతున్నారు. ముంబాయి నగరంలో వున్నటువంటి ప్రముఖ వ్యాపారవేత్తలకు లేదా అందరికీ ఈ చర్యలు ఎప్పుడో జరుగుతాయనే అనుమానాలు రేకెత్తించబడుతున్నాయని, అనుమానాలు కలిగే పరిస్థితులు ఏర్పడుతున్నాయని చెబుతున్నారు.

ఉ. 11.50

లేదా ముంబాయిలో వున్నటువంటి ప్రముఖ వ్యాపారవేత్తల మీద టెర్రరిస్టుల దాడులు జరుగుతాయనే అనుమానాలు వున్నాయని చెబుతున్నారు. ఇలాంటి దశలో మన ఇంటలిజెన్స్ విభాగాలు లేక నిఘా విభాగాలు ఏమి చేస్తున్నాయని సామాన్య ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ వేళ రాజకీయ నాయకులు వ్యవహరిస్తున్న తీరుతెన్నుల పట్ల కూడా ఏమిటి ఈ రాజకీయ నాయకులు అని ప్రజలు ఏవగించుకొనే పరిస్థితి కనపడుతోంది. ముంబాయిలో జరిగిన సంఘటనలు చూస్తూంటే, టెర్రరిస్టుల దాడిలో హతమై ప్రాణాలు కోల్పోయిన ఏటిఎస్ అధినేత శ్రీ హేమంత్ కర్కరే గారి కుటుంబ సభ్యులైతే అసలు ఎవ్వరు వెళ్ళినా మాట్లాడే పరిస్థితి లేదు. రాజకీయ నాయకులతో అసలు మేము మాట్లాడం అనే పరిస్థితి వుందంటే రాజకీయ నాయకుల మీద ప్రజలు విశ్వాసం కోల్పోతున్నారనేది అర్ధమౌతుంది. మరొకసారి గతాన్ని నెమరువేసుకుంటే 2001 సంవత్సరం డిసెంబర్ 13న పార్లమెంట్‌పై దాడి జరిగింది. ఈ మధ్య కాలంలో హైదరాబాద్, అహమ్మదాబాద్, జైపూర్, మీరట్, బెంగుళూరు, ఢిల్లీ, గౌహతిలలో టెర్రరిస్టుల దాడులు జరిగినాయి. ముంబాయిలో జరిగిన సంఘటనలను చూచినట్లయితే అది ఒక యుద్ద వాతావరణాన్ని మరిపించే విధంగా వున్న అక్కడి సన్నివేశాలను మనం స్వయంగా టీ.వీల ద్వారా చూశాం. అయితే టెర్రరిజానికి మతం వుందని మేమేమి భావించడం లేదు. కొంతమంది అనుకున్నట్లుగా టెర్రరిస్టులకు ముస్లింలు అని, హిందువులు అని, ఇలాంటివేమి లేవు. టెర్రరిస్టులకు ఒక లక్ష్యం అంటూ ఏమి లేదు. నిజం చెప్పాలంటే, దాడులు చేయడం, మనుష్యులను చంపడం అనేదే వారు ఎంచుకున్న మార్గం. అందువల్ల టెర్రరిజాన్ని కూకటివేళ్ళతో పెకలించాల్సిన అవసరముంది. టెర్రరిజం అంతమే మన పంతంగా నిర్ణయించుకోవాల్సిన అవసరముంది. టెర్రరిస్టుల చర్యలను మనం సీరియస్‌గా ఖండించాల్సిన అవసరముంది. ఇంతకు ముందు మిత్రులు మాట్లాడినట్లు ఈ మధ్య మాలేగావ్‌లో జరిగిన ప్రేళుళ్ళ సంఘటనలకు కొంతమందిని ఐడెంటిఫై చేసిన ఏటీఎస్ అధినేత శ్రీ కర్కరే గారి మీద హిందూ వ్యతిరేకి అనే ముద్ర వేశారు. మరల వారే అయన కుటుబానికి ఒక కోటి రూపాయలు exgratia గా ఇస్తామని వెళ్ళితే వారి కుటుంబ సభ్యులు నిరాకరించిన దానిని బట్టి పరిస్థితిని అర్ధంచేసుకోవాలి. అందువల్ల, దీనికి సంబంధించిన అధికారుల పట్ల విపక్షత, నిర్లక్ష్యం చూపే పరిస్థితి కాకుండా రాజకీయాలను కులానికి, మతానికి పులమడం కాకుండా దేశ సమగ్రతను , సమైఖ్యతను నిలబెట్టడానికి దేశ ప్రయోజనాల కొరకు, దేశంలో నివసిస్తున్న మానవాళి ప్రయోజనాల కొరకు మనుష్యుల యొక్క భవిష్యత్‌కు సంబంధించి రూపకల్పన చేసేందుకు ముందుకు పోవాలి. దేశంలో శాంతి భద్రతలు నెలకొల్పడానికి లేదా ప్రశాంతతను నెలకొల్పడానికి సీరియస్‌గా మనమంతా ప్రయత్నం చేయవలసిన అవసరముంది. కేంద్ర ప్రభుత్వంలో కొంచెం సంచలనమైన పరిస్థితుల్లో కేంద్ర హోం మంత్రి రాజీనామా చేసే పరిస్థితి వచ్చింది. కేంద్ర హోం మంత్రి రాజీనామా చేసినంత మాత్రానా సమస్య పరిష్కారమువుతుందని కాదు కాని టెర్రరిజం అంతం చేసే దాని మీద కేంద్రప్రభుత్వ

స్థాయిలోనే సీరియస్ గా చర్చలు జరగాల్సిన అవసరముంది. కేంద్ర ప్రభుత్వ స్థాయిలో నిన్న జరిగిన అఖిల పక్ష పార్టీ సమావేశంలో అనేకమంది అనేక సూచనలు చేశారు. రానున్న కాలంలో దేశ భవిష్యత్‌ను , ప్రజాస్వామ్య విలువలను కాపాడడానికి ప్రజాస్వామ్యాన్ని మరింత పటిష్టంగా ముందుకు తీసుకెళ్ళడానికి రాజకీయాలకు అతీతంగా మనమంతా ఏకమై, ఐకమత్యంతో ముందుకు సాగాల్సిన అవసరముంది. భారతదేశంలో రానున్న కాలంలో టెర్రరిజానికి అవకాశం లేదు. ఉగ్రవాదులకు తావు ఇచ్చే పరిస్థితి లేదు. మతం, కులం అనేది కాదు ఇక్కడ, మన దేశం భిన్నత్వానికి ఏకత్వం అనేది మనందరకు తెలుసు. మతాలకు, కులాలకు అతీతంగా మన లౌకిక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాం. ఇలాంటి దశలో భవిష్యత్తులో కూడా మన రాజ్యాంగానికి బద్ధులమై వున్న నేపథ్యంలో దేశ భవిష్యత్తును నిలబెట్టడంలో ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి, ఉగ్రవాదానికి ఎలాంటి అవకాశాలు ఇవ్వనటువంటి, ఎలాంటి తావు లేనటువంటి పరిస్థితులలో మనం ప్రతిజ్ఞ తీసుకొని ముందుకు సాగాల్సిన అవసరముందని ఈ సందర్భంగా అభిప్రాయపడుతూ, ముంబాయి బాంబు దాడుల్లో అమరులైన వీర జవానులకు, కమెండోలకు ఇంకా ప్రాణాలు కోల్పోయిన వారందరికి సీపీఐ శాసనసభా పక్షం తరపున ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియచేస్తూ, అకుంటిత దీక్షతో , పట్టుదలతో టెర్రరిజం అంతానికి మనందరం ప్రతిజ్ఞ తీసుకోవాలని తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

MR.SPEAKER: Some of the Members please be seated. Now, we are on the condolence motion. I request all the Members either be seated or to leave the House, if you are not participating in it. Kindly, be restrained.

SRI AKBARUDDIN OWAISI: Hon'ble Speaker Sir, the condolence motion moved by the Hon'ble Leader of the House and the Chief Minister of the State. Sir, before speaking about the incidence that happened in Mumbai, first I would like to say one important thing that we all are giving a heart felt condolences to all the innocent lives which has been lost. But, at the same time, we all got come together and take this up as a wake up call for all of us and not just passing some words of condolences for the innocent lives. As we all know on 26th November, 2008 it was a black day that the Mumbai was hit by very horrible terror attack and not only that the Mumbai was attacked but it was the terror attack on our country it was a terror attack. This terror attack was started from Colaba at 9.00 p.m. and again went to Coffee shop at 9.30 p.m, at Chatrapathi Shivaji Terminal at 10.00 p.m, and at Taj Hotel and Oberoi Hotel at 10.15 p.m. at Vile Parle at 10.30 p.m. and at Metro Cinema on the Mid night. This attack has not only damaged the lives and properties. However damage was a psychological damage and the strategy is very clear the first was to deepen the Indian economy and the second is to create fear amongst tourists and foreign investments. The third and most important was to divide the Nation and create a communal divide and hatred in this country. Sir, with this attack there is a growing feeling of insecurity and vulnerability in our country. Really, it has shaken the countrymen and also shaken the countries intelligence and the security agencies as never before. In this attack very committed and dedicated Officers has also lost their lives and amongst them the first was the anti terrorism squad chief Mr.Hmant Karkare and two Indian IPS Officers the Additional Police Commissioner, Mr.Ashok Kamte and Mr.Vijuay Salaskar also killed. So, these three Officers were killed but at the same time, one question which arises is that these were three officers and out of that one Officer Mr.Hamant Karkare was the Officer who brought to the notice of this country about the people who were behind the Malegaon blasts.

మ.12.00

It is very surprising that the 15-20 minutes before we see him wearing a bullet proof jacket and a helmet and again, how come three main officers were travelling in only one vehicle and all the 3 officers were killed within no time of 25 minutes. So, this is very sad story, which needs to be looked into. At the same time, when we talk about the terrorists' attack on Mumbai, we cannot forget that Mumbai has always been the target and not only Mumbai, but the entire country has become target of this terrorist activities. Assam recently had a serial bomb blasts. Bangalore had, Delhi had and in Hyderabad also at Lumbini Park, Macca Maszid and Gokul Chat. The question which arises is, how are these people infiltrating in to our areas. Not only that, they come into our areas, but they bring in weapons, they come with granites and RDX. So where are we failing and if we have to see Sir , I do not have a clear picture of the entire country. I have few details about our State of Andhra Pradesh, which I would like to bring to the notice of the Hon'ble Chief Minister so that immediate action is taken in this regard.

Sir, as per the standard norms, for every 500 people, there should be one policeman. Sir, like in Advance countries viz. U.S. and the other countries, they have one policeman for every 460 people to guard them and to look at them. Whereas in India, at an average of 750 people, there is one policeman available. But as per the United Nations Norms, where 1 Lakh population is there, 222 police personnel should be available. But, those norms are not followed by our country. In Andhra Pradesh, overall police in category of Civil and Armed Forces services, there are 96000 personnel. Out of this, 60000 police personnel are of lower cadre viz. Sub-Inspector, Head Constable and even Constables. These 60000 strength are working in Hyderabad, Cyberabad, Vijayawada and Visakhapatnam Commissionerate, 22 Districts and 3 Railway Districts also. If we see the vacancy position, in Sate Civil Category, there are 9% of vacancies. I Armed category, there are 17% vacancies.

If we have to compare our State with the other States, the total population of Delhi is 1.5 Crores and the total police strength there is 58638. That means for every 255 persons, there is one police personnel to protect. The total population of Mumbai is 1.8 Crores and the total police strength there is 40000. That means for every 450 persons, there is one police personnel to protect. The total population of Chennai is 60 lakhs and the total police strength there is 14970. That means for every 400 persons, there is one police personnel to protect. The total population of Bangaluru is 56 Lakhs and the total police strength there is 10600. That means for every 528 persons, there is one police personnel to protect. When we see Hyderabad, the total population according to the latest census is 80 Lakhs and the total police strength is 8655. That means for every 924 persons, there is one policeman to protect them. I Delhi, for every 255 people, there is one policeman while in Hyderabad, for every 924 people, there is one policeman. With this cadre of police strength, how could we protect our City? How could we take care of our people. I really welcome the move that the Government has addressed the issues and the problems of the farming sector. They have taken several irrigation projects and invested huge amounts in different welfare schemes.

Sir, at the same time, we need to invest large amounts for the security of this City and the security of this State and the Country too. Because, if we have to see, what does the Constable get Sir? What is the salary that the Sub-Inspector or the Circle Inspector or the Asst. Commissioner of Police or the Deputy Commissioner of Police gets? If I have to go into details, it is a very big subject. I will request the Government that Sri Veerappa Moily has given a beautiful recommendation regarding the bonus reforms of this Country. The State Government should look into that report of Police Reform and implement it. Our Sate Government has recently constituted Octopus Force. Octopus Force officials get 50% more salary than the other Police Officers and in spite of that, the people are not coming forward to become the member of Octopus Force, because the salaries are very less. I would say Sir, because the margin of corruption is very less in octopus. These are the main issues which need to be addressed and I hope

that our Sate would address the same. At the same time, I would like to come on record and say that, when people talk about that America had an attack on 9/11 and after that, there wasn't any attack. Sir, there is a very big difference in the America and India. The United States has a very stable neighbouring countries viz. Mexico and Canada. In Mexico and Canada, there is no terrorism. Whereas our Country i.e. India has unstable neighbours viz. Pakistan and Bangladesh, who always want to bring an infiltration in our country and create a very volatile situation in our country. So we cannot take an example of that. I also welcome the move and announcement made by the Hon'ble Prime Minister stating that a Federal Investigating Agency is needed and they are going to form and implement that. It is a very big need, because the State and the Central Government as well, needs to act upon together to tackle the terrorism. Because, if we have to see the Assam serial blasts, there was conversion amongst the terrorists and of Huzi and Ulfas. Huzi and Ulfas came together in Assam and thus, there was a conversion. So, now, we also need to come together and it is very positive sign and decision taken by the Hon'ble Prime Minister and at the same time, I was reading in the Newspaper that the Hon'ble Chief Minister has announced that on the same lines of National Security Guards, we would also have the same State Security Guards in Andhra Pradesh and also in Hyderabad and other cities of the State. This is a welcome. But, at the same time, I would like to come on record and say that every terrorism cannot be linked with Islam or Muslim. The Islam is a religion which says that you should finish terrorism. The terrorists or the terrorism do not have any religion. So, please do not mix Islam and Muslim with Terrorism. This is the time, we need to come together and fight this terrorism. When I see in newspaper, I was shocked, so see that yesterday's newspaper wrote that the 'Terrorists have ordered for 5 K.Gs of Biryani'. Why this? The Media should also abstain from such comments. Sir, I was watching in the Television the other day that the Ex-Home Minister Sri Shivraj Patil never said that the NSG is coming when there was an attack on Taj, Mumbai. But, the Ex-Home Minister and the Deputy Prime Minister of this Country came on record in the Television and said that within TWO hours, the NSG would land in Mumbai and take charge of this action. What is this message? This message was not needed at all. This message has gone to the Terrorists and they took in a way that they have two hours and can do maximum destruction as to whatever they can and they will do it. So, media should also re-state and see what they are doing.

I also see that some voices are coming up stating that "The Country needs POTA". No Sir, we do not need POTA, because we already had existing laws, with which we can tackle these elements. We have the National Security Agency, the Unlawful Activity Act, 1971 and the other major acts are there, with which we can tackle these issues. I once again would like to come and say that we all need to come together. If the Country needs to fight the terrorism, it is not an Islamic or Muslim terrorism. Please do not say that since the Terrorists and the terrorism do not have any religion. These are the people who are against the Country.

I would also like to come on record that out of 185 people died, 49 were innocent Muslims. Amena of Nizamabad a bride of just 4 days old bride also lost her life. So, when the terrorists fire or sweep the bullets, they do not see if a person whom they are shooting is a Muslim, Christian, Hindu or a Sikh. They just shoot around. So Muslims have also lost their lives. We love this Country. We are from this Country and we are going to stand by this Country, for the secularism and integrity of this Country. We want the terrorism to be finished. As a Muslim I would say that. Lastly, I would say that let us not make it a political issue because, it is not the politics that we are facing here. Let us see that what best we all could do by coming together. The people, the Leaders, the Police, the Security Agency, the Intelligence will have to re-orient themselves to cope with the new phase of terrorism and I hope the points which I have brought to the notice of the Hon'ble Chief Minister will be looked into and make this Hyderabad City and a Country a safe place, a safe street and terror free street. We also need to come with

new laws to protect the people especially in the shopping malls, multiplex, Theatres and all the other big malls and if necessary amend the laws and have some security system or new laws to be made so that the people will feel safe and secure when they are out on the street in our Country and I pay my all condolences to all the people who died.

جناب اکبر الدین اویسی: اسپیکر صاحب! میں سارے مسلمانوں کی جانب سے اور مجلس اتحاد المسلمین کی جانب سے پولیس آفسرس اور نیشنل سیکیورٹی گارڈس کے جن آفسرس اور جتنے معصوم لوگوں نے اپنی جانوں کو کھویا، ان کے افرادِ خاندان کے ساتھ ہمدردی کا اظہار کرتا ہوں اور بالخصوص تاج اور دوسری ہوٹل کے اسٹاف کے لئے بھی ہم اپنی طرف سے ان کے لئے بھی ہمدردی کا اظہار کرتے ہیں کہ انہوں نے بھی کافی اچھا کام کیا اور کئی جانوں کو بچایا۔ ہم کو اس وقت politics کرنے کی ضرورت نہیں ہے، بلکہ اس ملک کو بچانا ہے، اور ہمارساری ہمدردی ہماری جماعت کی طرف سے ہے۔ ہم ان سارے پولیس آفسرس کا، اور NSG کا بھی شکریہ ادا کرتے ہیں کہ انہوں نے اتنے معصوم جانوں کو بچایا، اور مرنے والوں کے ساتھ اظہارِ ہمدردی کرتے ہیں۔ شکریہ۔

మ.12.10

శ్రీ జి.కిషన్‌రెడ్డి(హిమాయత్‌నగర్): అధ్యక్షా, ఈ రోజు ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టినటువంటి సంతాప తీర్మానాన్ని నేను పూర్తిగా బలపరుస్తున్నాను. గత అనేక సంవత్సరాలుగా ఈ యొక్క ఉగ్రవాదుల సమస్యతో మనం అనేక రకాలుగా ఇబ్బందులకు గురౌతున్నాము. నిజంగా గతంలో చేసినటువంటి కొన్ని పొరపాట్లు కారణంగా ఈ యొక్క ఉగ్రవాదుల సమస్య మన దేశాన్ని పట్టిపీడిస్తున్నది. మనకు ఈ ఉగ్రవాదుల సమస్య లేనట్లైతే ఈ రోజు అభివృద్ధి చెందుతున్న దేశంగా 60,62 సంవత్సరాలలో మనందరం కూడా అభివృద్ధి చెందిన దేశంగా ఈ దేశాన్ని తీసుకుపోవడానికి అవకాశం వున్నది. స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి ఈరోజు వరకు లక్షల, కోట్ల రూపాయలు ఈ యొక్క ఉగ్రవాద సమస్య కారణంగా మనం ఖర్చు పెడుతున్నాము. అనేక మంది, ఇటురాజకీయ పార్టీలు కాని, అధికారులు కాని, సమాజం కాని, ఎప్పుడు కూడా ఈ ఉగ్రవాద సమస్య మీద చర్చించుకుంటూ దాని పైన మనయొక్క మేధోసంపత్తిని అంతా ఖర్చు పెడుతున్నాము. దాని కారణంగా మనం అనేక రకాలుగా వెనుకబడిపోతున్న విషయాన్ని కూడా ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాము. ముంబాయిలో జరిగినటువంటి సంఘటన మన దేశంలో ఉగ్రవాద సమస్య, మన దేశాన్ని ఏ స్థాయికి తీసుకొని వెళ్లిందనే దానికి పరాకాష్ట. .గతంలో దాడులు చేసి వెళ్లారు కాని ఈ రోజు ఉగ్రవాదులు ప్రత్యక్షంగా యుద్దానికి దిగినట్లు, బోట్లలో వచ్చి హ్యాండ్ గ్రెనేడ్స్‌తోటి, ఎ.కె.47తోటి, ఆర్‌డిఎక్స్‌తోటి మన దేశంపైన యుద్దాన్ని ప్రకటించినట్లుగా వున్నది. ప్రధానంగా భారత ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడమే లక్ష్యంగా తీవ్రవాదులు ఎంచుకున్నారు. విదేశీ పెట్టుబడులకు సురక్షిత స్థావరంగా వుంటుందని అనేక దేశాలు ఈ రోజు భారతదేశంలో పెట్టుబడులు పెట్టాలి, పెట్టుబడి పెట్టినట్లయితే మాకు లాభం చేకూరుతుంది, రక్షణ వుంటుంది అని అనేక దేశాలు పెద్దఎత్తున గత 10 సంవత్సరాలుగా మనదేశంలో అనేకమైన ఆర్థిక సంస్థలు, అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులు పెట్టడం కోసం ప్రయత్నం చేస్తున్నారు. ఇది మన ప్రక్కన వున్న పాకిస్థాన్‌కు ఇతర కొన్ని దేశాలకు కంటగింపుగా వుంది. ఏ రంగమైనా సరే ఆర్థికంగా పటిష్టమైనట్లయితే ప్రపంచలో అగ్రగామి దేశంగా భారతదేశం నిలబడుతుంది . కాబట్టి భారత దేశాన్ని ఆర్థికంగా పటిష్టం కాకుండా చూడాలనే దృక్పదంతోటి, దురుద్దేశంతోటి, ఆ దేశాలు, మన దేశ ం మీద అకారణంగా ఈ రోజు బాంబు దాడులు చేస్తావున్నాయి, విధ్వంసాన్ని సృష్టిస్తున్నాయి, యుద్దాన్ని ప్రకటిస్తున్నాయి. దీని సందర్భంగా అడుగుతున్నాను ఈ యొక్క తీవ్రవాదులను ప్రోత్సహిస్తున్న దేశాలను ఎందుకు మీరు భారత దేశం మీద మీరు బాంబు దాడులు చేస్తున్నారు చెప్పగల్గుతారా? ఏదైనా సరే ఒక ఉద్యమం చేపడుతున్నారు అంటే ఒక వ్యక్తి చంపబడుతున్నాడంటే,

ఒక వ్యక్తిపైన బాంబులు వేస్తున్నామంటే, భారత దేశానికి వెళ్లి ఈ రకంగా యుద్ధం చేస్తామన్నారంటే దానికి కారణం ఉండాలి. ఈ రోజు పాకిస్థాన్ నుంచి వచ్చిన ఐఎస్ఐ తీవ్రవాదులు కాని, ఈ ఉగ్రవాదులను, ఎందుకు మా దేశం మీద మీరు ఈ రకంగా చేస్తావున్నారు చెప్పండని అడుగుతున్నాను. ఆ కారణం చెప్పలేరు. అకారణంగా ఈ రోజు భారతదేశంయొక్క సమగ్రతను, సమైక్యతను దెబ్బతీయాలని, ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయాలని అభివృద్ధి చెందుతున్నటువంటి భారతదేశం అభివృద్ధి చెందకుండా ఉండాలని ఒక దుర్మార్గపు ఆలోచనతోటి ఈరోజు పాకిస్థాన్ మన దేశం మీద ఈ రకమైన యుద్ధాన్ని ప్రకటించిందని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. మన వాణిజ్య రాజధాని ముంబాయి మీద దాడి చేయడం అంటే ఇతర దేశాలు భారత దేశానికి వెళ్లవద్దు, భారత దేశం వెళ్లినట్లయితే అలజడి అవుతుంది, భారతదేశంలో బాంబుల దాడులు జరుగుతాయి, విధ్వంసాలను సృష్టిస్తుంది. ఉగ్రవాదులు భారతదేశం వచ్చిన తరువాత, పాస్‌పోర్టు ద్వారా వచ్చిన అమెరికన్లు, బ్రిటీష్ వాళ్లను, ఇజ్రాయిల్ వాళ్లను ఎంచుకొని, వాళ్లను చంపడం జరిగింది. అంటే ఇతర దేశాలలో భారతదేశం యొక్క శాంతిభద్రతలు దెబ్బ తిన్నాయి అనేటటువంటి సందేశాన్ని ఇవ్వాలని ఆలోచనతో తీవ్రవాదులు మన దేశం మీద దాడి చేస్తావున్నారు. అంతే కాదు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు చనిపోయారు. అందులో ఒకరు హైద్రాబాదుకు చెందిన అతను ఉన్నాడు. గత 4 1/2 సంవత్సరాల కాలంలో యుపిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రపంచంలో ఉగ్రవాదుల దాడులలో చనిపోయిన వాళ్ల సంఖ్యను తీసుకొన్నట్లయితే ఇరాక్ తరువాత మనం రెండవ స్థానంలో వున్నాము. సుమారు 7 వేల మంది మన దేశంలో ఉగ్రవాదుల దాడుల కారణంగా అమాయకులు బలైపోయారని చెప్పి మీ ద్వారా నేను విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ రోజు చాలామంది అనుకుంటారు జైపూర్‌లో అయింది కదా, మన దేశం మీద కాలేదు కదా? హైద్రాబాదులో అయినది కదా, మన ఇంటిలో కాలేదు కదా? ఢిల్లీలో అయినది, ముంబాయిలో అయినది కదా, అనుకుంటున్నారు. ఇది ఒక వ్యక్తి మీదనో, ఒక నగరం మీదనో కాదు, భారతదేశం మీద దాడిగా ఈ రోజు మనం గుర్తించాల్సిన అవసరం వున్నది. భారత ప్రజలకు నేను విజ్ఞప్తి చేసేది ఒకటే. ఇది ఒక అహ్మదాబాదు మీద దాడో, ముంబాయి మీద దాడో, హైద్రాబాదులోని మక్కామసీదు మీద దాడో, లుంబినీ పార్క్ మీద దాడో, గోకుల్‌చాట్ బండార్ మీద దాడో కాదు, ఇది భారత జాతి మీద జరుగుతున్నటువంటి దాడి. ఈ దాడిని మనం అందరం కూడా రాజకీయాలకు అతీతంగా ఖండించవలసిన అవసరం వున్నది. ఆ రకమైన పరిస్థితి ఈ రోజు దేశంలో వుందని ఈ విషయాన్ని మీ ద్వారా మనవిచేస్తున్నాను. ఈ రోజు మార్పులు తీసుకురావలసిన అవసరం వున్నదని నేను ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. ప్రధానమంత్రి నిన్న జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఒక ప్రత్యేకమైన చట్టాన్ని తీసుకొని వస్తామని, ప్రత్యేకమైన పోలీసు విభాగాన్ని ఏర్పాటు చేస్తామని ఫెడరల్ వ్యవస్థకు సంబంధించి ఒక పోలీసు విభాగాన్ని దర్యాప్తు కోసం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇది చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకోవడం అవుతుంది. ఉన్నటువంటి పోటా చట్టాన్ని అధికారంలోకి రాగానే మొట్టమొదటగా సంతకం చేసింది ఏమంటే పోటా చట్టం . ఏమి మెసేజి వస్తుంది, మా ప్రభుత్వం ఉగ్రవాదుల పట్ల మెతక వైఖరి అవలంబిస్తుందని పరోక్షంగానో, ప్రత్యక్షంగానో ఉగ్రవాదులకు మీరు సంకేతికం ఇచ్చి, 4 1/2 సంవత్సరాలు తరువాత అనేక దాడులు జరిగిన తరువాత, 7 వేల మంది చనిపోయిన తరువాత ఈ రోజు మేము ఉగ్రవాదులను అరికట్టడం కోసం ప్రత్యేక చట్టాన్ని తెస్తాము, ఒక ఫెడరల్ వ్యవస్థకు సంబంధించి ఒక పోలీసు వ్యవస్థను ఏర్పాటు చేస్తామని చెప్పడం చాలా దురదృష్టకరం . అందరం ఈ రోజున ఆందోళన వ్యక్తం చేయడం జరిగింది . పోలీసు అధికారులు చనిపోయారు. ప్రత్యేక చట్టాన్ని తీసుకొని రావాలని నేను ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని, కేంద్ర ప్రభుత్వాన్నీ, మీ ద్వారా ప్రశ్నిస్తున్నాను. ఆ రోజు మన హైద్రాబాదు నగరంలో ఐపిఎస్ అధికారి కృష్ణప్రసాదును చంపినటువంటి ముజీబ్ అనే తీవ్రవాదికి హైకోర్టు జీవిత ఖైదు విధించి జైల్లో వుంటే ఈ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది.

మ. 12.20

మన హైదరాబాదు నగరంలో IPS Officerఅయిన శ్రీ కృష్ణ ప్రసాదును చంపిన ముజీబ్ అనే తీవ్రవాదికి రాష్ట్ర హైకోర్టు జీవిత ఖైదు విధించి, జైలులో ఉంచితే ఈ ప్రభుత్వం అతనిని విడుదల చేసింది. అటువంటిది ఈ రోజు ప్రత్యేక చట్టాలు అవసరమా అధ్యక్షా? ఇది ఎంతవరకు న్యాయమో ఆలోచించండి. శ్రీ కృష్ణ ప్రసాదును చంపిన వ్యక్తికి 2004 అగష్టు 15 వ తారీఖున కాంగ్రెస్ ప్రభుత్వం మన రాష్ట్రంలో ఆయనకు క్షమాభిక్ష పెట్టి జైలునుండి విడుదల చేశారు. జైలునుండి విడుదల కాబడిన ముజీబ్ ఏమి చేస్తున్నాడనే విషయంలో ఏమైనా నిఘా పెట్టారా? లేదు . తరువాత ఆవ్యక్తే నేను ఆరోజు కరెక్టే చేశానని టి.వీలో చెప్పాడు. తరువాత ఆర్‌డిఎక్స్, ఏ.కే.47లతో వస్తున్న ఒక లారీని రాజస్థాన్ పోలీసులు పట్టుకుని వీటిని ఎక్కడికి తీసుకువెడుతున్నారని అడిగితే, ఇవి పాకిస్థాన్ నుండి వస్తున్నాయి, హైదరాబాదులోని ముజీబ్ అనే వ్యక్తి వద్దకు తీసుకువెడుతున్నానని చెప్పేవరకు మన పోలీసులకు తెలియదు. ముజీబ్ అనే వ్యక్తికి పాకిస్థాన్ ద్వారా రాజస్థాన్ బోర్డర్ నుండి ఆయుధాలు వస్తుంటే మన ప్రభుత్వం పట్టించుకోలేదు. కాబట్టి నేను చెప్పేదేమంటే, ఈ రోజు మనకు కావలసింది ప్రత్యేక చట్టాలు, సంతాపాలు కాదు. మనలో చిత్తశుద్ధి ఉండాలి. ఉగ్రవాదాన్ని అణచివేయాలన్న ఆలోచన, తపన ఈ ప్రభుత్వంలోని రాజకీయనాయకులలో ఉండాలి. అది లేని కారణంగానే ఈ రోజు పోలీసు కుటుంబాలు, పోలీసులు ఎందుకు మేము బలికావాలి? అని ఆలోచిస్తున్నారు. మన దేశంలో పార్లమెంటును మించిన దేవాలయం గానీ, చర్చిగానీ, మసీదుగానీ మరేదీ లేదు కదా. భారతదేశం వంటి ప్రజాస్వామ్య దేశానికి పార్లమెంటు అతి పెద్ద దేవాలయం. అటువంటి పార్లమెంటు మీద దాడికి కుట్ర చేసిన అఫ్జల్ గురు కు ఢిల్లీ సెషన్ కోర్టు, ట్రైయల్ కోర్టు ఉరిశిక్ష విధించింది. ఢిల్లీ హైకోర్టు, సుప్రీం కోర్టు కూడా దానిని కన్‌ఫర్మ్ చేశాయి. మూడు సంవత్సరాలు గడుస్తున్నా ప్రభుత్వం ఇంతవరకు దానిని అమలు చెయ్యలేదు. అఫ్జల్ గురు ముస్లిమైనా, క్రిస్టియనైనా, హిందువైనా నేను భారతీయ జనతాపార్టీ తరఫున విజ్ఞప్తి చేస్తున్నాను, అఫ్జల్‌గురుకు సుప్రీంకోర్టు విధించిన మరణ శిక్షను అమలు చెయ్యాలి. అతను హిందువనో, ముస్లిమనో, క్రిస్టియన్ అనో చూడవలసిన అవసరం లేదు, ఇది రాజకీయ పార్టీలు ఆలోచించవలసిన విషయం . ఆరోజు పార్లమెంటుపై దాడి జరిగినప్పుడు కూడా 9 మంది భద్రతా సిబ్బంది తమ ప్రాణాలను బలిదానం చేసి మన భారతదేశ గౌరవ ప్రతిష్టలను కాపాడారు. ఈ రోజు ఆ కుటుంబాలవారు ఏమనుకుంటారని ఒక్కసారి ఆలోచించండి. తమ కుటుంబాలను పోషించవలసిన వ్యక్తులు దేశం కోసం బలిదానం చేస్తే, దాడికి మూలకారణమైన వ్యక్తులకు విధించిన మరణశిక్షను ఈ ప్రభుత్వం అమలు చెయ్యలేకపోయిందని అనుకోరా? ఇక్కడ హైదరాబాదులో IPS Officer ను చంపిన ముజీబ్ అనే వ్యక్తిని జైలు నుండి విడుదల చేశారు. ఇది న్యాయమా? కాబట్టి మనమందరం కూడా ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఈ రోజు మనం సంతాపం ప్రకటిస్తున్నాము. సంతాపం ప్రకటించినంత మాత్రాన, ఆయా కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాలు ఇచ్చినంత మాత్రాన ఆ కుటుంబాలకు జరిగిన లోటును మనం భర్తీ చేయలేమని ఈ సందర్భంగా మనం గుర్తుపెట్టుకోవాలి. సంతాపాలతో, ఎక్స్‌గ్రేషియాలతో సమస్య పరిష్కారం కాదు. మనలో దృఢ నిశ్చయం ఉండాలి. ఈ ఉగ్రవాదం పట్ల పోరాటపటిమ చూపే పోలీసుల వెన్నంటి మనం ఉండాలి. మన హైదరాబాదులోని మక్కా మసీదు బాంబ్‌బ్లాస్ట్ తరువాత దాదాపు వెయ్యి మంది ఉద్రేకంతో పెట్రోలు పంపు తగులబెడుతుంటే పోలీసులు అడ్డుకున్నారు. అయితే, అప్పుడున్న కమీషనర్ శ్రీ బల్వీందర్ సింగ్‌ను ఇప్పుడు దర్యాప్తు కమిటీ పేరుతో మూడు, నాలుగు గంటలపాటు చేతులు కట్టుకొని బోనులో నిలబడేలా చేస్తున్నారు. డిసీపీని, ఏసీపీని, సీఐలను ట్రాన్స్‌ఫర్ చేశారు. వారు ఎవరికోసం పనిచేయాలి? వారికి కావలసింది జీతం. ఉగ్రవాదులతో పోరాడవలసినటువంటి అవసరం వారికి లేదని వారు అనుకునే ప్రమాదముంది. రాజకీయ

నాయకులు, ప్రభుత్వం పోలీసులకు మేమున్నాము, మీరు పోరాటం చెయ్యండి అనే ఆలోచన ఇవ్వకపోతే వారెలా పనిచెయ్యగలరు? ఇది వాళ్లకు ఇచ్చిన అవార్డా లేక రివార్డా? ఉగ్రవాదం పై పోరుసల్పుతున్న పోలీసు అధికారులకు మనం చేస్తున్నదేమిటని ఆలోచన చెయ్యవలసిన అవసరముంది. మన రాష్ట్రంలో కూడా మక్కా మసీదు, లుంబినీ పార్కు, గోకుల్‌ఛాట్‌లో ఉగ్రవాదుల పేలుళ్ల తరువాత మన ముఖ్యమంత్రిగారు మేము మహారాష్ట్రలో ఉన్నటువంటిఆక్టోపస్ చట్టాన్ని తెస్తున్నాము అన్నారు. కానీ, అది ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది. ఆక్టోపస్ చట్టం ఇంకా ప్రసవవేదనలో ఉంది. ఇంతవరకు ఆక్టోపస్ చట్టానికి జవసత్వాలు రాలేదు. మన హైదరాబాదు నగరంలో పాకిస్థాన్ సహాయంతో ఐఎస్ఐ తీవ్రవాదులకు శిక్షణ ఇస్తున్నారన్న విషయాన్ని పోలీసులు బయట పెట్టారు. ఇది చాలా దురదృష్టకరమైన విషయం. కేరళ నుండి తీసుకువచ్చి హైదరాబాదులో శిక్షణనిస్తున్నారు. మహారాష్ట్రలో రిక్రూట్ చేసుకొని హైదరాబాదులో శిక్షణ నిస్తున్నారు. హైదరాబాదు నగరాన్ని తీవ్రవాదులుసేఫ్ జోన్‌గా పరిగణించారని, మన నగరం ఐఎస్ఐ ఏజెంట్లకు, తీవ్రవాదులకు అడ్డాగా మరిందనే వార్తలు విని ప్రజలు భయపడుతున్నారు. మత తీవ్రవాదాన్ని, అరికట్టడం కోసం ప్రభుత్వం ఉక్కుపాదంతో చట్టాన్ని తీసుకురావాలి. అవసరమైతే పోలీసులకు ఆ రకమైన శిక్షణనిచ్చి, దీనిని ఎదుర్కోవలసిన అవసరముందని మీ ద్వారా నేను ప్రభుత్వాన్ని కోరుతున్నాను. అదే విధంగా మనం ఈనాడు రాజకీయాలకు అతీతంగా ఉగ్రవాదం గురించి ఆలోచించాలి. ఉగ్రవాదానికి మతం లేదు. అనవసరంగా అఫ్జల్‌గురు పేరుమీద ముస్లిములందరూ బదనామ్ చేస్తున్నారు. ముస్లిములెవరూ కూడా ఉగ్రవాదాన్ని సమర్థించరు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మతాలవారెవరూ హింసను, రక్తపాతాన్ని సమర్థించరు. కానీ, మన రాజకీయ నాయకులు కుహనా రాజకీయాలతో, ఓటుబ్యాంకు రాజకీయాలతో ఓట్లు పొందడం కోసమే మతాలను బదనామ్ చేస్తున్నారు తప్పితే ఏమతమూ కూడా తీవ్రవాదాన్ని ప్రోత్సహించదన్న విషయాన్ని రాజకీయ పార్టీలు గుర్తుపెట్టుకోవాలని ఈ సందర్భంగా మనవి చేస్తూ, ఇప్పటికైనా రాజకీయ పార్టీలు కళ్లు తెరచి, ఇటువంటి కుహనా లౌకిక వాదాన్ని విడిచిపెట్టి వాస్తవ దృక్పథంతో తీవ్రవాదాన్ని అరికట్టాలని కోరుతున్నాను. రాజకీయ పార్టీలు ఉగ్రవాదం గురించి మాట్లాడుతుంటే ఈ రోజు బయట తిడుతున్నారు. ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. ఈ విషయాన్ని మనం గుర్తుపెట్టుకోవాలి. ముంబాయిలో జరిగిన సంఘటనలు ఇటువంటి కుహనా రాజకీయాలకు కనువిప్పు కావాలని కోరుకుంటున్నాను. అదే విధంగా ముంబాయి పేలుళ్లలో మరణించినటువంటి పోలీసు అధికారులు, అమాయక ప్రజలు, విదేశీయులు, హోటల్ సిబ్బంది, అక్కడ పనిచేస్తున్న భద్రతా సిబ్బంది మున్నగు వారి కుటుంబ సభ్యులకు భారతీయ జనతాపార్టీ తరపున ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో ఈ ఉగ్రవాద నిర్మూలనకై మనమందరం కలిసికట్టుగా పనిచేయాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

SRI AKBARUDDIN OWAISI: Speaker sir, the Hon'ble Member is saying that Hyderabad is having training camp for the terrorists, which is not correct. It is a false allegation.

MR. SPEAKER: That is his observation.

SRI AKBARUDDIN OWAISI: Based on this false allegation the innocent Muslim youth will be harassed by the police. I want to make it very clear that this is Hyderabad but not Pakistan or Bangladesh. If the statement made by the Hon'ble Member is correct, let the Government clarify this to the House.

(INTERRUPTIONS)

I have a strong objection about the statement made by the Hon'ble Member. We are all facing terror threat. Let us not make political speeches here. The Hon'ble Member is

making political allegation. The Muslim youth were earlier arrested and after that what did the court say?

MR. SPEAKER: This is condolence motion. If the subject comes up for discussion on some other occasion then you can express your views on that. Now, let us confine to the condolence motion.
మ.12.30

డి.శ్రీనివాస్ ః అధ్యక్షా, ప్రధానంగా ముఖ్యమంత్రి గారు ముంబాయి పేలుళ్లపై ప్రవేశ పెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను. ముంబాయిలో ఇలా జరగడం చాలా బాధాకరమైన విషయమని, ఈ దినం యావత్ భారతదేశం తల వంచుకొనే దినమని, ఈ విషయాన్ని మనం రాజకీయాలకు అతీతంగా ఆలోచన చేయవలసిన అవసరం ఉందని మనవి చేస్తున్నాను. ఈ దేశం ఎక్కడికి పయనిస్తోంది? ఇక్కడ ఏమి జరుగుతోంది? ఈ అరాచకాలను అడ్డుకునే బాధ్యత మనది కాదా? రాజకీయ పార్టీల యొక్క వ్యవహార శైలి దీనికి కారణం కాదా అని విశ్లేషించుకొనే దురదృష్టకరమైన పరిస్థితి ఈ రోజు వచ్చింది. ఈ రోజు మనం గమనిస్తున్నాం. అమరజవాన్లు వారితోబాటు హేమంత్ కర్కరే అనే ఆఫీసర్ ఎవరయితే ప్రాణ త్యాగం చేశారో వారి కుటుంబ సభ్యుల్ని పలకరించడానికి ఒక ముఖ్యమంత్రి,, ఒక ప్రభుత్వ అధినేత వెళ్లి పెద్ద మానిటరీ బెనిఫిట్ అనౌన్స్ చేస్తే దానిని రిజెక్ట్ చేయడం, పలకరించడానికి వెళితే మొహం కూడా చూడకుండా పంపించినట్లుగా మనం పత్రికల్లో చూస్తున్నాం. కేరళ ముఖ్యమంత్రి అచ్యుతానంద్‌గారు, సందీప్ ఉన్నీ కృష్ణన్ గారు తల్లిదండ్రులను పలకరించడానికి వెళితే తండ్రి చీదరించుకొని మొహం చూడడానికి కూడా నిరాకరించాడంటే, నేను ఏ రాజకీయ పార్టీలను దృష్టిలో పెట్టుకొని అనడం లేదు, రాజకీయ వ్యవస్థ, రాజకీయ పార్టీల పైన, రాజకీయ నాయకుల పైన ప్రజల్లో ఏ రకమైన అభిప్రాయాలు వస్తున్నాయనే విషయాన్ని గమనించవలసిన అవసరం ఉందని నేను మనవి చేస్తున్నాను. ఇది చాలా దురదృష్టకరమైన విషయం. ప్రపంచంలోనే సెక్యులర్ దేశమైన భారతదేశంలో ఈ రకంగా వచ్చిన ఉగ్రవాదులు ప్రధానంగా ఇక్కడకు బయట దేశాల నుండి వచ్చి అరాచకాలను సృష్టించే ప్రయత్నం చేస్తున్నారంటే, దానికి ప్రధాన కారణం, భారతదేశ సమైక్యతను, అఖండతను, మత సామరస్యతను కాపాడుతూ, అన్ని కులాలు, మతాల వారు ఈ దేశంలో ఒకటిగా జీవిస్తూ, యూనిటీ ఇన్ డైవర్సిటీ అనే దానిని ప్రపంచానికి చాటిచెప్పిన దాన్ని ఓర్వలేని వారు దానికి భంగం కలిగించే విధంగా Instability ని తీసుకుని వచ్చి, ఈ వ్యవస్థను, ఈ దేశాన్ని చిన్నాభిన్నం చేయాలనే ఉద్దేశ్యంతో ఈ సంఘటనలకు పాల్పడినట్లుగా తెలుస్తోంది. వారు చేసిన అరాచకాల వలన వారికి ఏమి లాభం అని నేను అడుగుతున్నాను. వారు టెర్రరిస్టులు అయినప్పటికీ వారి ప్రాణాలను కూడా పణంగా పెట్టడానికి సిద్ధమయి, ఈరకంగా వ్యవహారం చేస్తున్నారంటే, జనంలో వారిపట్ల ఎటువంటి ఆలోచనలు ఉన్నాయని ఆటంకవాదుల్లో ఇవ్వాళ ఇటువంటి ఆలోచనలు ఉన్నాయి కనుక , దీని పైన రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ కూడా, మేధావులు తెలివైనవారు, రాజకీయ వేత్తలు సమిష్టిగా ఆలోచన చేయవలసిన అవసరం ఉంది. ఈ రోజు దేశం మొత్తం ఏకతాటిపైకి వచ్చి దేశ సమగ్రతను దెబ్బ తీయాలనుకునే వ్యవహారాన్ని మేము సహించబోము అనే విషయాన్ని ముక్త కంఠంతో ఏనాటి వరకు అయితే భారతదేశంలో ఈ నినాదం బయటకు రాదో దీనిని కాపాడడం కష్టమవుతుందని నేను మనవి చేస్తున్నాను.

దీంట్లో భాగంగా మనం చూసినట్లయితే ఒక్క ముంబాయిలోనే ఈ విధంగా జరగలేదు. 2001వ సంవత్సరంలో స్ట్రేయిట్‌గా పార్లమెంట్ మీదే దాడి చేయడం జరిగింది. ఆనాడు తొమ్మిది మంది పోలీసు

సిబ్బంది చనిపోయారు. ఆ తర్వాత అక్షరధామం మీద దాడి జరిగింది. 2006 లో ముంబాయిలో సీరియల్ బ్లాస్ట్స్ జరిగాయి. ఈ విధంగా ఒక దాని తర్వాత ఒకటి జరుగుతూ వస్తున్నాయి. ఇటువంటి ఉగ్రవాదాన్ని అంతమొందించడానికి లేదా కంట్రోలు చేసే దానికి వివిధ ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ కూడా మనం పూర్తిగా సఫలీకృతం కాలేకపోతున్నాము అనే ఆవేదన ప్రతి ఒక్కరిలో ఈనాడు ఉంది. ఆవేదన ఉన్నంత మాత్రాన సరిపోదు. అన్నిటి కంటే ఐక్యత అవసరం. ఈనాడు 150 నుండి 170 మంది వరకు చనిపోయారు. అందులో ముఖ్యంగా అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. దేనితోనూ సంబంధం లేని వారు చనిపోయారు. ప్రపంచంలోనే ఆర్థికంగా ఒక గొప్ప దేశంగా భారతదేశం ఆవిర్భవిస్తున్న సమయంలో ఇటువంటి సంఘటన జరగడం దురదృష్టకరం. తాజ్ హోటల్‌లో బ్రిటన్, అమెరికా దేశ పౌరుల కోసం వచ్చామని చెప్పి ఐడెంటిఫై చేసుకునే ప్రయత్నం చూస్తుంటే మన ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడానికే ఈ సంఘటన జరిగినట్లుగా తెలుస్తోంది. ఈనాడు పాశ్చాత్య దేశాలతో మన దేశానికి ఉన్న సత్సంబంధాలను దెబ్బతీయడానికే ఈ కుట్ర అనే విషయాన్ని మనమందరం గ్రహించాలి. జవాన్లతోపాటు, ఎంతో మంది మంచి అధికారులు హేమంత్ కర్కరేగారు,అశోక్ కామ్టేగారు, విజయ్ సలాస్కర్‌గారు, సందీప్ ఉన్ని కృష్ణన్‌గారు వంటి వారు తమ ప్రాణాలను ఈ సంఘటనలో కోల్పోవడం జరిగింది. ఈ అధికారులు స్వయంగా ఆపరేషన్‌లో పాల్గొని తమ ప్రాణాల్ని కోల్పోయారు. దేశానికి ఇంకా ఎన్నో సేవలు అందించవలసిన వారు తమ ప్రాణాలను కోల్పోయారు. వారు బ్రతికి ఉంటే ఈ దేశానికి ఇంకా ఎంతో సేవ చేసి ఉండేవాళ్లు. అయితే ఎంతో ధైర్యంతో ముందుకు పోయి ప్రాణాలు అర్పించి, దేశానికి గర్వకారణంగా నిలిచి ఎంతో ప్రతిష్ట తెచ్చారు. కాని That is not the solution. దీన్ని మనం రాజకీయం చేయకుండా, దీనిపైన ఎవర్నీ క్రిటిసైజ్ చేయకుండా, ఖచ్చితంగా ఒక consensus తో ముందుకు రావలసిన అవసరం ఉందని నేను మనవి చేస్తున్నాను.

ఈ సంఘటనలో దురదృష్టవశాత్తు నా నియోజకవర్గానికి చెందిన అమీనాబేగం అనే ఆమె మరణించింది. అయిదారు నెలల కిందటే పెళ్లి చేసుకున్న ఆమె తన కుటుంబ సభ్యులతో ముంబాయిలోని దర్గాను సందర్శించుకుని వస్తున్న సమయంలో ఈ సంఘటనలో చనిపోయింది. ఆమె తండ్రి ఒక ఆటో రిక్షా డ్రైవర్. అతని రెండు కాళ్లల్లోకి బుల్లెట్లు దూసుకునిపోయాయి, జె.జె. హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. నేను వెళ్లి వారిని పరామర్శించడం జరిగింది. I am thankful to the Hon'ble Chief Minister, ఈ రాష్ట్రానికి సంబంధించి చనిపోయిన ముగ్గురికి ఒక్కొక్కరికి మూడు లక్షల రూపాయల చొప్పున ఎక్స్‌గ్రేషియా అనౌన్స్ చేసినట్లుగా నేను చూస్తున్నాను. కాబట్టి ఈ యొక్క పరిస్థితుల్లో నేను కోరేదల్లా దయచేసి let the Andhra Pradesh Legislative Assembly set an example to the whole country by taking a stand above political lines. ఉన్న విషయాల్ని ప్రక్కన పెట్టి మనం ఈ విషయంలో సంఘటితంగా వ్యవహరించుదాము. నేను ముఖ్యమంత్రిగారిని కోరుతున్నాను వారు initiative తీసుకోవాలి, ఈ రాష్ట్రంలో ఒక యునైటెడ్ యాక్షన్‌గా ఒక solidarity చూపుతూ ఇటువంటి సంఘటనల్లో సత్వర చర్యలు తీసుకునే విషయంలో ఆంధ్రప్రదేశ్ ముందు ఉంటుంది, ఈ దేశంలో శాంతి భద్రతలు కాపాడటానికి, ఇటువంటి టెర్రరిజంను తుదముట్టించడానికి, రాజకీయాలు ప్రక్కన పెట్టి సమష్టిగా ముందుకు సాగడానికి మేము సిద్ధంగా ఉన్నామనే విషయాన్ని మనం ఎస్టాబ్లిష్ చేయడానికి ఏదైనా ఒక కార్యక్రమం ఏర్పాటు చేసినట్లయితే బాగుంటుందని మనవి చేస్తూ, ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలియచేస్తూ , మృతుల కుటుంబాలకు సంతాపం వ్యక్తం చేస్తూ, అదే విధంగా ప్రాణాలు పోగొట్టుకున్న వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

మ.12.40

శ్రీ పి. శశిధర్ రెడ్డి (మెదక్): అధ్యక్షా, ఈరోజు ముంబాయిలో జరిగిన తీవ్రవాద చర్యల్లో ప్రాణాలు కోల్పోయిన వారి పట్ల గౌ.ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని హృదయపూర్వకంగా బలపరుస్తున్నాను. ఈ సంఘటనలో చాలా మంది అమాయకులు చనిపోయారు. ఇప్పుడే ఓవైసీగారు చెప్పినట్లుగా 149 మంది ముస్లిం సోదర సోదరీమణులు కూడా చనిపోయిన వారిలో ఉన్నారు. విదేశాలకు చెందిన వారు ఉన్నారు. ఇజ్రాయిల్ దేశానికి చెందిన వారు ఉన్నారు. వారందరి మరణం పట్ల ప్రగాఢమైన సంతాపాన్ని తెలియచేస్తున్నాను. చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తపరుస్తున్నాను.

అదే విధంగా ఇంతకు ముందే మన పెద్దలు చెప్పినట్లుగా ఈ సంఘటన కేవలం ఒక్క ముంబాయికి సంబంధించినదే కాదు మొత్తం భారతదేశానికి సంబంధించినది. దేశం మొత్తం ఈ సంఘటనను ఛాలెంజ్‌గా తీసుకోవాలి. ప్రపంచంలోనే ఒక గొప్ప ఆర్థిక శక్తిగా భారతదేశం ఎదుగుతున్న ఈ సందర్భంలో దేశ ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశ్యంతోనే ఉగ్రవాదులు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నట్లుగా తెలుస్తోంది. ఈ సంఘటనలో ప్రాణాలు కోల్పోయిన ఎన్.ఎస్.జి. సిబ్బందికి, మహారాష్ట్ర పోలీసు సిబ్బందికి జోహార్లు అర్పిస్తున్నాను. వారు చేసిన త్యాగాన్ని ఈ దేశం ఎప్పటికీ మరచిపోదు అనే మాటను ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, గత సంవత్సరం హైదరాబాద్ నగరంలో మక్కా మసీదులో పేలుడు జరిగింది. ఆ తర్వాత రెండు, మూడు మాసాల తర్వాత లుంబిని పార్కులోనూ, గోకుల్ ఛాట్ భండార్‌లోనూ జరిగిన పేల్లుళ్లల్లో పెద్ద సంఖ్యలో అమాయక ప్రజలు చనిపోవడమే కాకుండా, అనేక మంది క్షతగాత్రులయ్యారు. గాయపడిన వారికి మనం సరైన సహాయం అందించలేకపోయామనే విషయం వినపడుతోంది. దీన్ని విమర్శగా తీసుకోకుండా, వాస్తవ పరిస్థితుల్ని గుర్తించాలని కోరుతున్నాను.

ముంబాయిలో పేల్లుళ్ల జరిగిన రోజు ఉదయమే Disaster Management Authority, రాష్ట్ర ప్రభుత్వం, హైదరాబాద్ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో సికింద్రాబాద్ స్టేషన్‌లో ఒక బాంబు మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగింది. అందులో స్టేషన్‌లో బాంబులు పేలినట్లుగా సంఘటనను సృష్టించి హాస్పిటల్ ప్రిపేర్డ్‌నెస్ ఏ విధంగా ఉండాలి అనే విషయాన్ని అంచనా వేయడానికి అటువంటి సంఘటనలు జరిగినపుడు ఏ విధంగా చర్యలు తీసుకోవాలి అనే విషయాలపై అటు ప్రజలకు, ఇటు అధికారులకు అవగాహన కల్పించడానికి మాక్ డ్రిల్ జరిపాం. అయితే అనుకోకుండా అదే రాత్రి ముంబాయిలో పేల్లుళ్లు జరిగాయి. ఈ సంఘటనతో దేశంలో మూడు రోజుల పాటు ప్రజలందరూ దిగ్భ్రాంతిలో మునిగిపోయారు. ప్రజలు ఎంతో ఆందోళనకు గురయ్యారు. ఇటువంటి సంఘటనలు కేవలం మన దేశంలోనే జరగడం లేదు. ప్రపంచంలోని అనేక దేశాల్లో ఉగ్రవాద చర్యలు పెరిగిపోతున్నాయి. పక్కనే ఉన్న మన పాకిస్థాన్‌లో కూడా ఉగ్రవాద చర్యలు పెరిగిపోతున్నాయి. దానికి అనేక కారణాలు ఉన్నాయి. ఆ కారణాల గురించి తప్పకుండా మనం ఆలోచన చేయవలసిన అవసరం ఉందని చెప్పి ఈ సందర్భంగా నేను మనవి చేస్తున్నాను. ఏదేమైనప్పటికీ ఈనాడు ఉగ్రవాదులు ఎప్పటికప్పుడు కొత్త పద్ధతుల్లో, వినూత్న పద్ధతుల్లో హింసాత్మక చర్యలకు పాల్పడుతున్నారు. మొన్న ముంబాయిలో జరిగిన సంఘటన చూస్తే, ఎక్కడయితే జన సమూహం ఎక్కువగా ఉంటుందో అక్కడ ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నట్లుగా తెలుస్తోంది. తాజ్ హోటల్‌లో ఉన్న వారందర్నీ బందీలుగా చేసుకుని, ఈ దేశ ప్రతిష్టను,

ఈ దేశ ఆర్థిక పరిస్థితిని దెబ్బ తీయాలనే ఉద్దేశ్యంతోనే చేసిన ప్రయత్నంగా కనపడుతోంది. ఇది చాలా ఆందోళన కల్గించే విషయం. కాబట్టి ఇటువంటి ఉగ్రవాద చర్యలను సమర్థవంతంగా తిప్పికొట్టాలంటే మన నిఘా విభాగం, మనకు ఉండేటటువంటి పోలీసు యంత్రాంగం కాని, ఎన్.ఎస్.జి. కాని దేశ సంరక్షణ విషయంలో ఎప్పటికప్పుడు నూతన పద్ధతులను అవలంభించే విధంగా ప్రభుత్వం తయారుకావాలి. అయితే తీవ్రవాదాన్ని పూర్తిగా మనం అంతం చేయడం చాలా కష్టం. అయినప్పటికీ, ఇలాంటి సంఘటనలను ఎదుర్కోవడానికి మేము సంసిద్ధంగా ఉన్నామనే విషయాన్ని ప్రపంచానికి చాటి చెప్పవలసిన అవసరం ఉంది. దాని కంటే ముందుగా మన దేశంలో ఉన్న ప్రజానీకం ముఖ్యంగా అమాయక ప్రజలు, ఏ పాపం ఎరగని, దారి వెంట వెళ్లే ప్రజలు ఎవరయితే ఉన్నారో, వారందరికీ ధైర్యం ఇవ్వవలసిన బాధ్యత ఈ రోజు అన్ని రాజకీయ పార్టీల మీద, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మీద ఉందని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. నిన్న ఢిల్లీలో ఆల్ పార్టీస్ మీటింగ్ జరిగినపుడు, గౌ. ప్రధాన మంత్రిగారు ఎన్.ఎస్.జి.కి సంబంధించి నాలుగు మెట్రో సిటీస్ హబ్స్ ఏర్పాటు చేస్తామనే మాట చెప్పారు. దాన్ని మనమందరం స్వాగతించవలసిన అవసరం ఉంది.

నేను ఈ సందర్భంగా గౌ.ముఖ్యమంత్రిగారిని, రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాను. ఎందుకంటే మన రాష్ట్రంలో కూడా స్టేట్ సెక్యూరిటీ గార్డ్స్ అనే వ్యవస్థను ఏర్పాటు చేస్తామనే మాట చెప్పడం జరిగింది. ఇందాక కిషన్‌రెడ్డిగారు మాట్లాడుతూ ఆక్టోపస్ గురించి చెప్పారు. అది ఇంకా ప్రసవ వేదనలోనే ఉందనే మాట చెప్పారు. ఆ విధంగా కాకుండా, ఒక definite టైమ్ బౌండ్ పెట్టి ఆక్టోపస్ వ్యవస్థను బలోపేతం చేసి, అమాయక ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పిస్తామనే భరోసా ప్రజలకు ఇవ్వవలసిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. ఆ విధంగా వెంటనే చర్యలు తీసుకోవాలి. ఆక్టోపస్ వ్యవస్థకు కావలసిన సిబ్బంది నియామకాలు కాని, ట్రైనింగ్ కాని ఇచ్చే విషయంలో ప్రభుత్వం సత్వరమే స్పందించాలి అని నేను గౌ.ముఖ్యమంత్రిగారికి ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. ఈనాడు మన రాష్ట్రం ముఖ్యంగా హైదరాబాద్ నగరం అనేక రంగాల్లో ముందుకు పోతున్నది. ఐ.టి. రంగంలో గాని, మిగతా విషయాల్లో గాని హైదరాబాద్ ముందంజ వేస్తోంది. అయితే మన రాష్ట్రంలో ఉగ్రవాదులు చొరబడటానికి అనేక మార్గాలు కూడా ఉన్నాయనే విషయాన్ని ఈ సందర్భంగా మరచిపోకూడదు. మన రాష్ట్రానికి సుమారు 1000 కి.మీ. కోస్తా తీరం ఉంది. కాబట్టి ప్రస్తుత పరిస్థితుల్లో కోస్తా తీరం వెంబడి రక్షణ ఏర్పాట్లు ఏ విధంగా ఉన్నాయో మనం గమనించవలసిన అవసరం ఉంది. కోస్టల్ సెక్యూరిటీ గార్డ్ బలగాల్ని ఇంకా పెంచవలసిన అవసరం ఉందని ఈనాడు మనందరికి అనిపిస్తోంది. కాబట్టి ఈ విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన చొరవ తీసుకోవలసిన అవసరం ఉందని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

ఇందాకే ఓవైసీగారు చెప్పారు. మన సిటీ పోలీసు సంఖ్య చాలా తక్కువగా ఉందని. కాబట్టి దాన్ని పెంచవలసిన అవసరం ఉంది. మనం లక్ష కోట్ల రూపాయల బడ్జెట్ ప్రవేశపెట్టామని గర్వంగా చెప్పకుంటున్న తరుణంలో పోలీసు వ్యవస్థను బలోపేతం చేయడానికి కావలసిన వనరుల్ని సమకూర్చడంలో మనం విఫలమవుతున్నాం. సామాన్య, అమాయక ప్రజలకు ఈ రాష్ట్రంలో రక్షణ కల్పించాలంటే, ఇప్పుడు ఇక్కడ మాట్లాడిన పెద్దలు, మిత్రుల మాటల్ని పరిగణనలోకి తీసుకుని ఒక సమగ్రమైన కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపొందించవలసిన అవసరం ఉందని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

అదే విధంగా ముంబాయి వంటి సంఘటనలు జరిగిన సమయంలో ఎలక్ట్రానిక్ మీడియా కొంత restraint పాటించవలసిన అవసరం ఉంది. కమర్షియల్‌గా ఒకరితో ఒకరు పోటీ పడకుండా, ఇటువంటి సంఘటనలు జరిగినపుడు ప్రజల ప్రాణాల్ని కాపాడటంలో చొరవ చూపించాలని కోరుతున్నాను. కొన్ని టి.వి.

ఛానళ్లు అయితే ఇది exclusive story అని కూడా ప్రసారం చేశాయి. కాబట్టి, Media has to observe restraint and not to go in a competitive way. ఇటువంటి సంఘటనలకు సంబంధించి టి.వి. ఛానళ్లు వార్తల్ని ప్రసారం చేసే విషయంలో ప్రత్యేంగా ప్రభుత్వం ఆలోచన చేయవలసిన అవసరం ఉందనే మాట ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

చాలా సంవత్సరాలుగా పోలీసు వ్యవస్థ సంస్కరణల గురించి మనం అనుకుంటూ వస్తున్నాము. దీనిపైన కూడా సత్వరమే చొరవ తీసుకోవలసిన అవసరం ఉందనే మాట ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, 2001వ సంవత్సరంలో గుజరాత్ రాష్ట్రంలోని భుజ్‌లో పెద్ద భూకంప వచ్చింది. దాని తర్వాత కేంద్రంలో అనేకమైన కమిటీలు ఏర్పాటు చేయడం జరిగింది.

మ . 12 . 50

అయినా 2004 డిసెంబరులో సునామీ వచ్చిన తరువాతనే ఈ దేశానికి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ గురించి మనం ప్రత్యేకమైన చర్యలు తీసుకున్న విషయం ఈ సంసర్భంగా గుర్తు చేస్తున్నాను . అనేక సంవత్సరాలుగా మన దేశం తీవ్రవాదానికి గురై ప్రాణనష్టం కూడా ఓర్చి , ప్రాణనష్టం కూడా మనం చూసిన సందర్భంలో మొన్న ముంబయిలో జరిగిన ఈ సంఘటన I am sure that this will become an eye-opener for everybody in this country so that we can try and ensure that there is a better security for the people of this country. దేశం ముందుకు పోవడానికి, , మనం అనుకున్న ఆర్థిక ప్రగతి దేశంలోని ఏ ప్రజలకు మనం సౌకర్యాలు కలిగించాలని అనుకుంటున్నామో, ఏ శక్తిని కూడా అడ్డుకోకుండా మనం తయారు కావడానికి మొన్న జరిగిన ఈ సంఘటన చాలా దురదృష్టకరం . ఎంతోమంది అమాయకులు ప్రాణాలు కోల్పోయినా, ఎంతో మంది అమరవీరులు ప్రాణత్యాగం చేసినా కూడా దీనిని మనం ఒక ఎడ్వాంటేజ్‌గా మలచుకోవలసిన అవసరం ఉంది . Let this be converted into an advantage so that we can build a better security environment in this country . అనేమాట ఈ విధంగా these are the lessons to be learned. మరొకసారి చనిపోయిన అమాయక ప్రజలందరికీ, వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ, చనిపోయివారి ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, ప్రాణాలర్పించిన అమరవీరులకు, మహారాష్ట్ర పోలీసులకు , ఎన్ఎస్‌జి వారికి ఇతర అధికారులకు వారందరికీ మరొకసారి జోహారులర్పిస్తూ, వారి ప్రాణాత్యాగాన్ని, దేశం ఎప్పుడూ మర్చిపోలేదనే విషయం మరొకసారి మనవిచేస్తూ, నాకు ఇచ్చిన అవకాశానికి ధన్యవాదాలు తెలుపుతూ, సెలవు తీసుకుంటున్నాను .

SRI KOMIREDDY RAMULU: Hon'ble Speaker Sir, I support the Hon'ble Chief Minister's Resolution on the Condolence Motion. Terrorism has no religion or faith. Whenever there is a terrorism activity, we should not just name a Muslaman or any other person. The day before yesterday in Mumbai some terrorist act - dastardly act has taken place where several people have lost their lives. I take this opportunity to tell the Hon'ble Home Minister Sri K. Jana Reddy. Jana Reddy garu - you have about one police person for every 924 persons. 924 మందికి ఒక పోలీస్ పర్సనల్ ఉంది . ఈ విధంగా దేశంలో ఎక్కడా లేదు . You have to strengthen the police force here to safeguard the innocent lives of the people.

As regards Mumbai incident, this has to be condemned by everybody and the Nation as one has to condemn the incident. Whenever we think of terrorism, we have hostile neighbours say Pakistan, Bangaladesh and Srilanka. You have seen that late Sri Rajiv Gandhi has been killed by Srilankan terrorists. All our borders are not friendly borders. Therefore, our intelligence system has to be strengthened. We will have to avert this sort of incidents in future. Very recently, in Mecca Masjid blasts, a boy from Metpally has been accused in the blasts. He was just there at the time of blasts. To avert such incidents, our Intelligence system should be strengthened. We will have to congratulate the Hon'ble Prime Minister. He has taken a bold decision to constitute Security Guard like NSG in all the cities. In Hyderabad also, the Hon'ble Chief Minister has promised.

I offer my condolences to all the bereaved families.

SRI N. UTTAM KUMAR REDDY: Hon'ble Speaker Sir, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టి సంతాప తీర్మానాన్ని పూర్తిగా బలపరుస్తున్నాను . I rarely speak in this House. But today, I thought that I would take this opportunity because the subject that is being discussed now is something I had taken part in the past. As a former soldier I have taken part in operations in Kashmir and Pujjab and also in Srilanka. ఒక విషయం అందరూ గుర్తించాలి . Today in the last three or four days, politicians as a class పొలిటికల్ సిస్టమ్‌ను ప్రజలు అసహ్యించుకుంటున్నారు . ఏ ఇస్యూ జరిగినా పొలిటికల్ ఎడ్వాంటేజ్ తీసుకుందామనే విషయం రాజకీయనాయకులకు ఉంటుంది . వాస్తవంగా whatever is going wrong దానికి సెట్‌రైట్ చేయకుండా everybody is taking political advantage. ఏ సంఘటన జరిగినా , ఎంతమంది చనిపోయినా I will just go into that. Just everybody knows that better security force, better communications, better mode of transport, better weapons and better technology also are all one aspect. Besides, we must also keep in mind. Where are these people coming from - highly motivated suicidal squads? I can tell you with my practical experience. It is not so easy. It is not so simple to stop the highly motivated young men who are prepared to die. Very little we can do. We can minimize the damage. The security measures we take are to minimize the damage, but we have to stop the levels of motivation. Where are these breeding grounds? హిందూ సంస్థలుగానీ, ముస్లిం సంస్థలు గాని, క్రిస్టియన్ సంస్థలు గానీ should not be allowed to breed fanatics. What I would like to tell Sri Kishan Reddy garu is that there has been a sense of insecurity in a major Minority community. I hope that their Party is responsible because the major Minority community in this country is feeling insecure. That's why today the fanatics - young boys and girls who are otherwise well educated take this extreme step to take their own lives. దయచేసి అందరూ లోచించాల్సిన అవసరం ఉంది . Those who supply money and weapons to these so called suicidal squads should also be dealt with. The Hon'ble Prime Minister has rightly announced that not only perpetrators, but their supporters and whoever sympathizing with them should be very seriously handled. This is not the first of its kind and this may not be the last also. We have to provide better security, better communication, better transport, better weapons and better technology. There has been a continuous recruitment process of those people who are getting highly motivated. People at the highest level of Government must consider measures to stop recruitment for these suicidal squads. As I said earlier, this is not the first time and this may not be the last.

This is not an attack on Indian Government. It is an attack on Indian State. In a country like ours situated surrounding hostile neighbours, ensuring security is not so easy. All of us are responsible towards it. We are facing a serious threat because across the borders continuously highly educated and highly motivated ferocious young

men are being trained in the manner that their community is being victimized in India. Who is responsible for that stand? Who is responsible for the whole Minority community being alienated. We should all ponder over this. I personally found that a person who held the position of a Deputy Prime Minister criticized a Police Chief for investigating into Malgao blasts. Is it proper to a person who is aspiring to be the Prime Minister to criticize a Police Officer investigating into a case just because you support a particular religion. Is this not vote-banking politics? What is this? I am sure, all of us think well about this. We have to strengthen our security force as also intelligence.

మ.1.00

SRI N.UTTAM KUMAR REDDY (Contd.): At the same time, we have to find ways of stopping recruitment to these suicide squads and we should also ensure that this level of alienation this level of feeling of insecurity why it is going to this extent where young boys and girls are willing to kill people and take their lives. Somewhere something is going wrong and we must all think about it. I convey my deepest sympathies and also salute the heroes who cleaned up Mumbai. Thank you.

డా. కె. నగేష్ (ఆలేరు): అధ్యక్షా, ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ మొత్తం ఆమోదిస్తున్నది, మేము కూడా ఆమోదిస్తున్నాము. అయితే ఈ సందర్భంలో మేము రెండు విషయాలు చెప్పాలనుకుంటున్నాము. తీవ్రవాదం, ఉగ్రవాదం, మారణ హోమం, మారణకాండ – వీటిని గురించి మనం అన్ని రకాలుగా మాట్లాడినా కూడా ఒక సరియైన సొల్యూషన్‌ను శాసన సభ ద్వారా, ఈ రాష్ట్రంలో వున్న జనాభా ఏడు కోట్ల మంది కాని, లేక ఎనిమిది కోట్ల మంది కాని, దేశంలో వున్న వంద కోట్ల మంది కాని, ప్రపంచంలో వున్న 600 కోట్ల మంది కాని, లేక ఏడు వందల కోట్ల మంది కాని ఆలోచించవలసిన అవసరం వుంది.

ఇంతకు ముందు మాట్లాడిన పెద్దలు – ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు కాని, లేక ఒవైసీ గారు కాని, ఇంకా చాలా మంది పెద్దలు మాట్లాడారు. వారందరూ కూడా గమనించవలసింది, మన చుట్టూ ఉగ్రవాదం పెనవేసుకున్నది, మన పరిసరాలు అన్నీ ఉగ్రవాదంతో ముందుకు వస్తున్నాయి. ఏ రకంగానూ మనం అభివద్ధి చెందకుండా మనలను అడ్డుకుంటున్నాయి. వీటిని ఆపడం పోలీసుల ద్వారా సాధ్యమవుతుందా ? ఎంత మంది పోలీసులను పెట్టినా, ఎంత మంచి నిఘా వ్యవస్థ వున్నా మనపై దాడులు జరుగుతూనే వున్నాయి. దాని గురించి మనం ఆలోచించవలసిన అవసరం ఎంతైనా వున్నది. భారత జాతి నిర్మాణంలో తేడా ఏమైనా వున్నదా, జాతి నిర్మాణంలో లోపాలేమైనా వున్నాయా లేక మనం పెంపొందించే జాతీయతలో లోపాలు ఏమైనా వున్నాయా ? ఈ దిశలో కనుక మనం ఆలోచించినట్లయితే రాబోయే రోజులలో మనం ఇటువంటి దాడులని ఆపగలుగుతాము.

2004 నుంచి ఇప్పటి వరకూ దాదాపు 12 సార్లు భారత దేశం మొత్తం మీద ఇన్ని రకాలుగా దాడులు జరుగుతూ వుంటే, అంటే ఇంచుమించు ప్రతి 3 నెలలకు ఒకసారి ఈ మారణహోమాన్ని చేస్తూ వుంటే, ఎందుకు మనం ఆపలేకపోతున్నాము ? మనం విదేశీ విధానాలను అనుసరించినట్లయితే మనం ఆపగలుగుతామా ? బ్రిటిష్ విధానాలను అనుసరించినట్లయితే మనం దాడులను ఆపగలుగుతామా ? లేక అమెరికన్ విధానాలను అనుసరించినట్లయితే మనం ఆపగలుగుతామా ? అమెరికా మీద ఒకసారి అటాక్ జరిగితే మళ్లీ ఇంకొకసారి ఇంకొక పౌరుడు చావకుండా వారు ఆపగలిగారు. కాని మన భారతదేశంలోనే 12 సార్లు గడచిన 4 సంవత్సరాలలో అటాక్స్ పెరిగితే, వందలాది మందిని మనం పణంగా పెడుతున్నాము.

ఇక్కడ మనకు ప్రాంతాలు, మతాలు కాదు. భారత జాతీయత నిర్మాణంలో మనం సంఘటితం కావలసిన అవసరం వుంది. భారత జాతీయతను పెంపొందించవలసిన అవసరం ఎంతైనా వుంది. వారిలో అటువంటి భావాలను పెంపొందించినపుడు మనం ఎంతమందినైనా కాపాడగలం కాని, ఎకె 47 తో కాని, ఎకె 57 తో కాని కాదు. తాజ్ హోటల్‌లో ఆర్‌డిఎక్స్‌ను ఒక అటెండర్ డబ్బులు తీసుకుని పంపించిన పరిస్థితి మన దగ్గర వుంటే, నాటు పడవల దగ్గర కూడా డబ్బులు తీసుకుని పంపించిన పరిస్థితి వుంటే మన భారత జాతి నిర్మాణంలో మనం ఎక్కడైనా తప్పు చేస్తున్నామా, తప్పటడుగులు వేస్తున్నామా ? దీనికి జవాబుదారీగా మారిన రోజున ఉగ్రవాదాన్ని మనం అంతం చేయగలుగుతాము.

మనం ఎన్ని మాటలు చెప్పినా, ఎన్ని బీరాలు పలికినా, భారత జాతి నిర్మాణాన్ని పెంచే విధంగాను, జాతీయతను పెంపొందించే విధంగాను తయరు చేయాలి. ఎందుకంటే ఏ దేశాన్ని తీసుకున్నా కూడా అక్షరాస్యత పెరగాలి. మన దేశంలో చూసుకున్నట్లయితే అక్షరాస్యతను పెంపొందించడం కోసం మనం ఒక కార్యక్రమాన్ని పెడతాం . ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా దానికి చైర్‌మెన్‌గా వుంటారు. రాష్ట్రంలో గవర్నరు గారు చైర్మన్‌గా వుంటారు. నియోజక వర్గాలలో ఎంఎల్ఏ చైర్మన్‌గా వుంటారు. దానికి ఒక్క పైసా నిధులు వుండవు. అక్షరాస్యతను మనం తీసుకొచ్చినపుడే ప్రపంచంలో జరిగే వాటిని మనం చెప్పగలుగుతాము. ప్రక్కన వున్నవాడి భావజాలం ఇది అని తెలుస్తుంది. ఎవరు ఇక్కడకు వచ్చినా, గాలిలో వచ్చినా, నీటి మీద వచ్చినా, భూమి మీద నుంచి వచ్చినా, మనకు జరిగే అన్యాయాలను గురించి తెలుసుకునే అవకాశం వస్తుంది. విద్య, వైద్యం వంటి వాటికి సంబంధించి ఎన్‌జిఒల మీద ఆధారపడకుండా స్వశక్తి మీద ఇక్కడ నిర్మాణం చేసుకునే పరిస్థితి వస్తుందని అందరి దృష్టికి తీసుకువస్తున్నాను.

ఇది వేదిక అయినా, కాకపోయినా ఎవరైనా బాధపడినా పరవాలేదు కాని, 294 మంది శాసన సభ్యుల ద్వారా మంచి మెసేజ్ ఇవ్వవలసిన అవసరం వుంది, భారత జాతీయతను పెంపొందించవలసిన అవసరం వుందని తెలియజేసుకుంటూ నేను సెలవు తీసుకుంటున్నాను.

SMT.CHRISTINE LAZARES: Sir, our Chief Minister has spoken and our various Members have deeply condemned the gruesome killings of innocent people in the 59 hour war in Mumbai. I condemn the destruction of the beautiful heritage building of the Taj. I also condemn gunning down of our men who died in the line of duty and also staff of the Taj Hotel and various other people and the massacre of two Israeli people in the Nariman House. Sir, I want to condone with the two year old child of the Israeli people, the widows and all those men who died and especially the motherless daughters and children of Sabina of the Times of India and the General Manager of the Taj Hotel who lost his entire family and all the families who lost their loved ones. Sir, we also commend the officers of the ATS, NSG, Police, Army and Navy and especially the anounncer on the Railways Mr.Gendu who with his dare announcements alerted all the passengers to safety. We really look at these people who stood with all faith under fire. Sir, we have such a beautiful coast line in the entire country. That needs to be safeguarded. It has to be secure. We need that equally our Governments both Central and State will take into account those measures. There is a grave need for us to have the Youth Commission. It is very important for us to have it so that we will not have any mis-directed youth. Sir, I also deem it my duty to please bring to your notice that we have Article 51(a) in our Constitution and we all need to read it so that we can come together to really bring harmony not only to our people but also to the children of today in all schools. Thank you Sir.

శ్రీ సిహెచ్. రాజేశ్వర రావు : అధ్యక్షా, ముంబయ్ పేలుళ్లు, దాని వల్ల జరిగిన కష్టనష్టాలపైన, ముఖ్యంగా అమాయకులు ప్రాణాలు కోల్పోవడం, కష్టనష్టాలను తగ్గించడానికి సైనికులు, సిబ్బంది సాహసోపేతమైన చర్యలు చేయడం, అందులో వారు ప్రాణాలు కోల్పోవడం – ఈ మొత్తం సంఘటనను ఖండిస్తూ, చనిపోయిన వారికందరికీ నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ, గౌరవ సభా నాయకులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని నేను బలపరుస్తున్నాను.

సభలో చాలా మంది గౌరవ సభ్యులు మాట్లాడారు. నేను సమయం ఎక్కువగా తీసుకోవలసిన అవసరమే లేదు. ఒకే ఒక్క అంశాన్ని మాత్రమే మనవి చేయవలసిన అవసరం వుందని మీ అనుమతితో చెబుతున్నాను.

అధ్యక్షా, ఈ ఘటనలు జరిగాయి. అందరూ చెప్పారు, ముంబయ్‌లో నాలుగుసార్లు జరిగాయని. ఇతర పట్టణాలలో కూడా జరిగాయని చెప్పారు. అయితే ఏవైనా జంతువులు వచ్చి దాడి చేస్తున్నాయా ? అడవి నుంచి వచ్చి పారిపోయి వచ్చి చేస్తున్నాయా ? లేకపోతే పిచ్చాసుపత్రి నుంచి వచ్చి ఈ మాదిరిగా హింసకు పాల్పడుతున్నారా ? దీని వెనుక ఒక సిద్ధాంతం కల వారు, ఒక విశ్వాసం కలిగిన వారు, మూర్ఖత్వంతో, మూఢ నమ్మకంతో తలపెట్టిన, ఉద్దేశపూర్వకమైన, చైతన్యవంతమైన, దుర్మార్గమైన చర్య అని ఖచ్చితంగా చెప్పాలని నేను నిలబడ్డాను. మీకు తెలియంది కాదు, మత మౌఢ్యం కాని, భాషా మౌఢ్యం కాని, ప్రాంతీయ మౌఢ్యం కాని, ఇటువంటి మౌఢ్యాల తీవ్రవాదాన్ని మనం ప్రపంచంలో అనేక సందర్భాలలో చూసాము.
మ.1.10

మన భారతదేశంలో చాలా మంది పెద్దలకు తెలిసిన విషయమే. మద్రాసులాంటి నగరంలో హిందీ భాషను ప్రవేశపెట్టాలంటే దానికి వ్యతిరేకంగా అక్కడ వారు ఆత్మాహుతి చేసుకున్నారు. హింస సృష్టించారు. కీ.శే. వి.పి.సింగ్‌గారు మండల్ కమీషన్ పెడితే ఆ కమీషన్ ఉద్దేశాన్ని వ్యతిరేకించిన అగ్రవర్ణాల విద్యార్థులు ఆత్మాహుతి చేసుకుని ప్రదర్శనలు చేశారు. చాలా తీవ్రమయిన చర్యలు మొదట్లో చేశారు. సమిసి పోయింది. పంజాబ్‌లో జరిగిన ఘటన మర్చిపోయింది కాదు. మతతత్త్వంతో మత మౌఢ్యంతో చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. చాలా మంది ప్రాణాలను బలిగొన్నారు. సిక్కుల ప్రాణాలను బలిగొన్నారు. ఆ పవిత్ర దేవాలయం మీద దాడులు చేశారు. ఇందిరాగాంధిగారు దాడులు చేయించారని అన్నారు. ఈ రోజు జరుగుతున్న విషయం విదితమే. బొంబాయిలోకి వచ్చి వారంతా జిహాద్ అంటున్నారు. ఇస్లామిక్ ఫండమెంటలిజం. మాట్లాడకుండా ఉంటే లాభం లేదు. బాబ్రీమజీదు మీద దాడి చేసింది ఎవరు? హిందూ ఫండమెంటలిజం. ఇస్లామిక్ ఫండమెంటలిజం. లింగ్విస్టిక్ ఫండమెంటలిజం. కమ్యూనల్ ఫండమెంటలిజం. క్యాస్టిజం. శ్రీలంకలో జాతీయ ఫండమెంటలిజం. ఎల్‌టిటిఇలు ప్రత్యేక రాష్ట్రం తమిళులకు కావాలని చేస్తున్నారు. ఏదయినా అదే. ఎందరికి తెలుసు ఈ లెఫ్ట్ ఫండమెంటలిజం. ఈ రోజు నేపాల్‌లో చూస్తున్నాము. ఏమిటది? మన దేశంలో, ఇక్కడా జరుగుతున్నది ఏమిటి? సమ సమాజం పేరిట మానవులందరూ ఒకటే అనడం, కమ్యూనిస్టులు, మార్క్సిస్టులు అనే పేరుతో వెళ్లడం లేదా? కాబట్టి ఏదయినా సమతుల్యంగా ఉండాలి. మానవ సమాజంలో సృష్టించిన విభేదాలు, సదరు మేధావులు, రాజకీయ సిద్ధాంతులు చెప్పింది వదిలేసి వారి స్వంత కవిత్వం పెట్టి విపరీతంగా తీసుకువెళుతున్నారు. దానికి అవసరమయిన రాజకీయ శక్తులు, స్వార్థపర శక్తులు కావచ్చు. ఫండమెంటలిజం కావచ్చు, భూస్వామి కావచ్చు, ఎవరయినా ఎటువంటి శక్తులయినా రెచ్చగొట్టి వారి పబ్బం గడుపుకోవడానికి , తాత్కాలికమయిన ప్రయోజనం కాపాడుకోవడానికి చేస్తున్నారు. తమ

రాజకీయ అవసరాలు తీర్చుకోవడానికి రెచ్చగొట్టి మానవ చైతన్యపూరితమైన దుర్మార్గమైన శక్తులను వినియోగిస్తున్నారు. వాటిని అలా అర్థం చేసుకోవాలి. ఇంటెలిజెన్స్ ఫెయిల్యూర్ కావచ్చు. నిజమే. కాబట్టి ఇంటెలిజెన్స్‌ని బలపరచుకోవాలి. సైనిక చర్యలు చేపట్టాలి. తగిన చర్యలన్నీ తీసుకోవాలి. అన్నింటికన్నా ముఖ్యమయిన చర్య ఈ రాజకీయ, మత మౌఢ్యాలను నాశనం చేయడానికి ప్రయత్నం చేయాలి. జిహాద్ అంటే పవిత్ర యుద్ధం. పవిత్ర యుద్ధం ఎవరి మీద? వీరంతా ఎక్కడి నుండి వస్తున్నారు? పాకిస్తాన్, బంగ్లాదేశ్ నుండి వస్తున్నారని ఇందాక మిత్రులు చెప్పారు. అక్కడి నుండి వస్తున్నారు. అస్థిరత్వాన్ని సాధించడానికి , జాతిఐక్యతగా లేకుండా చేయడానికి వస్తున్నారు. మిత్రులు చెప్పినట్లుగా జాతీయ సమైక్యతా భావం రావాలి. భారతదేశంలో ఇంకా సమైక్యతా, సమగ్రతలు రాలేదు. వస్తూ, వస్తూ ఉంటే మధ్యలో ఆటంకాలు వస్తున్నాయి. కాబట్టి మన దేశంలో నిజమైన జాతీయ సమైక్యత వస్తే, ఉద్యమాలు చివరి వరకూ భారతీయులమనే భావన వస్తే అప్పుడు ఇటువంటి వాటిని అణచి పారవేయగలము. భారత పౌరులం, భారత జాతి మనదిఅనే చైతన్యానికి ప్రయత్నం చేసి ముందుకుసాగాలి. అలా వస్తేనే ఈమౌఢ్యాలకు వ్యతిరేకంగా పోరాడుతాము. విజయం సాధిస్తాము. చరిత్ర మనకు అనుకూలంగా ఉంది. వారికి అనుకూలంగా లేదు. ఇటువంటి మతతత్త్వ శక్తులకు, మూర్ఖత్వాలకు వ్యతిరేకంగా మనందరం సమైక్యంగా అన్ని వేదికల మీద ప్రజా చైతన్యాన్ని ముందుకు తీసుకురావాలి. యువరక్తాన్ని ముందుకు తీసుకురావాలి. యువకుల పాత్ర చాలా ఉంది. వారంతా ముందుకు వస్తేనే ఈ మత మౌఢ్యాన్ని అరికట్టగలుగుతాము. ఇది మానవ సృష్టి. ఉద్దేశ్యంగా, రాజకీయంగా దురుద్దేశ్యంతో మన అందరిని అస్థిరం చేయడానికి చేస్తున్న దుర్మార్గమైన చర్య. కాబట్టి చైతన్యవంతులైన మనమంతా ఈనాడు శపథం పూని ఈ దేశంలో నిజమైన జాతీయ చైతన్యం, మానవతా చైతన్యం, సమతా చైతన్యం వచ్చే విధంగా కృషి చేయాలని మరొకసారి అమరవీరులందరికీ,టెర్రరిస్టుల కాల్పుల్లో మరణించిన అమాయకులైన ప్రజలకు, వారి కుటుంబాలకు నాప్రగాఢ సానుభూతి తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

MR.SPEAKER: This House places on record its deep sense of sorrow to the persons killed in terrorists attack in Mumbai and conveys its deep sense of sympathy to the members of the bereaved families.

The civil society not only in India but the entire world is shocked and horrified at the inhuman and outrageous attack of terrorists in Mumbai killing innocent people.

India, the land of Mahatma Gandhi and Jawaharlal Nehru is known for its peace and non-violence. Mumbai, one of the beautiful, peace loving cities in our country known for its cosmopolitan culture, was chosen as target by the terrorists. The terrorists fired at hundreds of innocent people including women using the latest weapons to fuel distrust and hatred among different communities and destabilize the nation. We have successfully addressed ourselves to this challenge and demonstrated our resolve for peaceful unity and integrity standing as one nation. Cutting across political, social and religious lines, every one in the country has condemned this brutal and heinous act.

Three persons including a woman from Andhra Pradesh have also died in the terrorists attack at Mumbai. It is also our bounden duty to place on record the sacrifice that has been made by the police personnel including the commandos of the National Security Guards who performed yeoman service risking their lives.

Let us observe two minutes silence as a mark of respect for all those killed in this dastardly attack.

(Then the House observed two minutes silence.)

The House is adjourned to meet again at 8.30 a.m. tomorrow, the 2nd December, 2008.

(Then the House adjourned at 1.18 p.m., to meet again at 8.30 a.m. on Tuesday, the 2nd December, 2008.)

## భారత దేశ మాజీ ప్రధానమంత్రి శ్రీ విశ్వనాధ ప్రతాప సింగ్ మృతిపట్ల

డా.వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి : అధ్యక్షా, ఈవేళ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో బాధాతప్త హృదయంతో శ్రీ వి.పి.సింగ్‌గారికి నివాళులు అర్పించుకుంటున్నాము. మన మాజీ ప్రధాని శ్రీ వి.పి.సింగ్‌గారు భారత రాజకీయాల్లో సమున్నతమైన విలువల స్థాపనకు, ప్రజాహిత లక్ష్యాలకు బాగా పెద్ద పీట వేసి, సామాజిక న్యాయం అనే పదానికి కొత్త బాటలు వేశారు. నవంబరు,27వ తేదీన ఆయన చనిపోవడం చాలా బాధాకరమైన విషయము. నిజంగానే ఆయన మరణం దేశానికి తీరని లోటు. వి.పి.సింగ్‌గారు 1957 సంవత్సరంలో భూదాన ఆందోళనతో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి, కాంగ్రెస్ పార్టీలో అంచలంచెలుగా ఎదిగి ఎంతో ఉన్నత స్థానాన్ని అధిరోహించారు. మంచి పార్లమెంటేరియన్‌గా కూడా ఆయనకు పేరు ఉండేది. ఇందిరాగాంధీగారు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఆయన దేశంలోనే అత్యంత పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా రెండేళ్లపాటు పనిచేసి ఆ రాష్ట్రానికి ఎనలేని సేవ చేశారు. బడుగు వర్గాల మన్ననలు పొందారు. ఆయన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆ ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణ గురించి ప్రత్యేకంగా కృషి చేశారు. అయితే కొంత కాలం తర్వాత ఆ శాంతిభద్రతలను తాను అనుకున్న మేరకు కాపాడులేకపోయాననే బాధతో, ఉన్నత విలువలకు ప్రాధాన్యత ఇచ్చి ఆయన రాజీనామా చేయడం జరిగింది. రాజీవ్‌గాంధీ మంత్రివర్గంలో ఆయన ఆర్థిక శాఖ మంత్రిగా, రక్షణ శాఖ మంత్రిగా కీలకమైన పదవులు నిర్వహించారు. మంచి పరిపాలనా దక్షుడిగా, నిజాయితీ గల రాజకీయ వాదిగా ఆయన ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు జాతీయ స్థాయిలో. ఏ పదవి చేపట్టినా తనదంటూ విలక్షణమైన ముద్ర వేశారు. ఆయన ఎప్పుడూ కూడా తన అంతరాత్మ ప్రబోధంతోనే నడుచుకోవాలని, అప్పటికప్పుడు కలిగే రాజకీయ ప్రయోజనాలు కోసం పనిచేయకూడదనే భావంతో రాజకీయాలు నడిపాడు. నిజాయితీనే ప్రజా జీవితంలో పెట్టుబడిగా నమ్మి, అలాగే జీవించిన ఆయన రాజకీయ జీవితం నిజంగానే మనందరికీ స్ఫూర్తిదాయకం. ఆయనకు మంచి అలవాట్లు కూడా ఉండేవి. ఫోటోగ్రఫీ, కవిత్వం వ్రాయడం ఆయన అభిరుచులు. గడిచిన కొన్ని మాసాలుగా ఆయనకు వచ్చిన జబ్బు వల్ల ఆయన భౌతికంగా చాలా ఇబ్బందులు పడ్డా, నైతికంగా ఆయన స్ఫూర్తి మన అందరికీ చిరస్మరణీయం. *ప్రధానిగా ఆయన ఎక్కువ కాలం పనిచేయకపోయినా, రాజకీయాల్లో తనదంటూ ప్రత్యేకమైన ముద్ర వేశారు. లోక్‌పాల్ వ్యవస్థను నెలకొల్పేందుకు పూనుకోవడం, ఎన్నికల సంస్కరణల కోసం కృషి చేయడం ఆ రోజుల్లో అందరి మన్ననలు పొందింది. ఆయన దేశ ప్రధానిగా ఉన్నప్పుడు బలహీన వర్గాల సముద్ధరణకు మండల్ కమీషన్ ఏర్పాటు చేసి చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకుని,సామాజిక న్యాయాన్ని రాజకీయ అనివార్యతగా మార్చిన పరిపాలనా దక్షుడిగా ఈవేళ వర్తమాన రాజకీయాలకు ఆయన దిశా నిర్దేశం చేశారు. జాతీయ స్థాయిలో బలహీన వర్గాలకు తొలిసారిగా ప్రాధాన్యత* ఇచ్చిన నేతగా ఆయన మంచి పేరు తెచ్చుకున్నారు. పలు రాష్ట్రాల రాజకీయాల్లో బి.సి.ల నాయకత్వం బాగా పెరగడానికి ఆయన కారకుడు అయ్యాడు. నిజంగా ఆయన ఈనాడు మన మధ్య లేకపోవడం చాలా బాధాకరమైన విషయం. అంత స్ఫూర్తిదాయకుడు, అంత నిగర్వి, నిక్కచ్చిగా తాను అనుకున్న విషయాన్ని అమలు చేయగల్గినటువంటి మంచి నాయకుడు, మంచి నేత మరణించడం చాలా బాధాకరమైన విషయం.

ఆయన మరణం పట్ల ఆయన కుటుంబానికి నా తరఫున, ఈ సభ తరఫున ప్రగాఢమైన సంతాపం తెలియచేస్తూ, భారతదేశ రాజకీయ చరిత్రలో ఆయన అధ్యాయం నిరంతరం స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. ఉన్నత ప్రజా జీవితానికి ఒక మంచి ప్రేరణగా ఉన్న వి.పి. సింగ్‌గారిని మనమందరం శాశ్వతంగా గుర్తుంచుకోవాలి. ఆయన మరణం పట్ల ఈ సభ తన తీవ్రమైన సంతాపాన్ని వ్యక్తపరుస్తోంది.

## ముంబాయిలో ఉగ్రవాదుల దాడులలో మృతి చెందిన వ్యక్తుల పట్ల

డాక్టర్ వై.యస్. రాజశేఖర్‌రెడ్డి : అధ్యక్షా, మొన్న పోయిన వారం అంటే గురు, శుక్రవారాల నాడు ముంబాయిలో జరిగిన ఉగ్రవాదుల దాడిని ఏదో ఒక ముంబాయిలో జరిగిన దాడిగా భావించలేం . ఈ ఉగ్రవాదుల దాడిని మొత్తం భారత జాతిపై జరిగిన దాడిగానే భావించాలి. ఈ సభ మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఈ సంఘటనను ముక్తకంఠంతో ఖండించవలసిన అవసరం వుంది. పన్నెండు చోట్ల ఈ ముష్కరులు విరుచుకుపడి, ఆర్.డి.యక్స్ వంటి అత్యంత శక్తివంతమైన పేలుడు సామగ్రిని ఉపయోగిస్తూ, గ్రెనేడ్లు విసురుతూ, ఎ.కె.47 లాంటి తుపాకులతో మన జాతీయులతోబాటు విదేశీ పౌరులను కూడా పిట్టల్ని కాల్చినట్లు కాల్చివేస్తూ, నగరవాసులను భయభ్రాంతులను చేసి, వారిని మళ్లీ ఒక మృత్యు వలయంలో బంధించడమన్నది చాలా అసాధారణమైనది. నిజంగా ఇది ఒక మారణహోమంలా జరిగింది. ఈ ఉగ్రవాద చర్యను ప్రపంచం యావత్తు ఖండించింది. ప్రధానంగా ఈ ముంబాయి నగరం ఈ ఉగ్రవాదులకు చాలా ప్రధానమైన బిందువుగా తయారైంది. 1993 వ సంవత్సరంలో సీరియల్ బాంబు పేలుళ్లతో మొదలుపెట్టి, ఉగ్రవాదులు చాలాసార్లు ముంబాయిని తమ ప్రధాన లక్ష్యంగా చేసుకున్నట్లు మొన్న గురు, శుక్రవారాల నాడు జరిగిన సంఘటనలు తేటతెల్లం చేస్తున్నాయి. దాదాపు 180 మందికి పైగా మృత్యువాత పడడం చాలా విషాదకరం . ఈ విషయం తెలుస్తూనే, ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్, అదే విధంగా ఎఐసిసి అధ్యక్షురాలు, యుపిఏ ఛైర్‌పర్సన్ శ్రీమతి సోనియాగాంధీగారు ముంబాయిని సందర్శించి క్షతగాత్రులను పరామర్శించి, మృతుల పట్ల సంతాపం ప్రకటించి, వారి కుటుంబాలకు సానుభూతిని తెలియజేసి నగరవాసులకు ధైర్యం చెప్పారు.

అధ్యక్షా, నిన్న ఆదివారం ప్రధానమంత్రిగారు ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అన్ని రాజకీయ పక్షాలు ప్రభుత్వానికి సహకరించాలని, ఇటువంటి సందర్భాలలో రాజకీయాలకు అతీతంగా అందరూ వ్యవహరించాలని, మళ్లీ మళ్లీ ఇటువంటి దుశ్చర్యలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా గట్టి చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ముంబాయిలో జరిగిన సంఘటన రెండున్నర రోజులుగా కొనసాగింది. గతంలో బెంగుళూరు, ఢిల్లీ, అహ్మదాబాద్, జైపూర్, హైదరాబాదు వంటి నగరాలలో విధ్వంసం సృష్టించిన ఉగ్రవాదుల రక్త దాహం రోజురోజుకు పెరుగుతోంది. ఇదంతా ఒక విదేశీ కుట్రలో భాగమే . ప్రపంచంలోనే ఒక గట్టి ప్రజాస్వామ్య దేశంగా మన ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసుకున్నాం . 60 సంవత్సరాల తర్వాత స్వతంత్ర భారత చరిత్రలో ఎన్ని రకాలైన ఒడిదుడుకులు వచ్చినా, ఇబ్బందులు వచ్చినా, మన ప్రజాస్వామ్యం అంతిమంగా విజయం సాధిస్తుందని చెప్పి నిరూపించగలిగాం . అధ్యక్షా, ఒకవైపు మనం ప్రజాస్వామ్యాన్ని బాగా బలోపేతం చేసే ప్రయత్నం చేస్తున్నాం, కానీ మరొక వైపు ఎక్కడో ఒకచోట , ఎప్పుడో ఒకసారి భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని మేము దెబ్బతీయగలుగుతామని ఉగ్రవాదులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎక్కడో, ఎప్పుడో దొంగదెబ్బ తీసే ప్రయత్నాలు వారు చేస్తూనే వున్నారు. మన ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన పార్లమెంటుపై టెర్రరిస్టులు 2001, డిసెంబర్ 13 వ తారీఖున దాడి చేశారు, అప్పుడు కూడా విదేశీ శక్తుల ప్రోద్బలంతో ఆవిధంగా దాడి చేయడం జరిగింది. అది కూడా వారికి సంబంధించిన

దుశ్చర్యకు పరాకాష్ట.  ఇటువంటి తీవ్రమైన సంఘటనలు జరిగినప్పుడెల్లా భారత జాతి యావత్తు ఒక తాటిపై నిలబడి, ఇటువంటి దుశ్చర్యలను నిర్వీర్యం చేసే విషయంలో ఏమాత్రం వెనకాడడం లేదు.  మన దేశంలో ఎక్కడో ఒకచోట ఈ విధంగా దొంగదెబ్బ తీసే ఉగ్రవాదుల చర్యల విషయంలో గానీ, మన సరిహద్దులపై విదేశీయులు దాడి చేయడం జరిగినప్పుడు గానీ , భారత జాతి యావత్తు ఒక తాటిపై నిలపబడి దేశం కోసం ప్రతి ఒక్కరూ పోరాడిన, పోరాడుతున్న సందర్భాలు చాలానే వున్నాయి.  ఈరోజు కూడా ఆవిధమైన ఆలోచనతో, మనమందరమూ కూడా ఒకే మాటపై నిలబడి, మిగిలిన అన్ని విషయాలను ప్రక్కనబెట్టి దేశ సమగ్రతకు , దేశ సార్వభౌమత్వానికి ఏ కొంచెం భంగం వాటిల్లినా మన ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టని , అటువంటి పరిస్థితులను రానీయమని, అందరమూ కలిసి ఈరోజు దేశాన్ని రక్షించుకోవలసిన అవసరం వుందని తెలియజేస్తున్నాను.  ఇటువంటి ఉగ్రవాద కారుచిచ్చును మనమందరమూ సమైక్యంగా ఎదుర్కొని ఆర్పివేయవలసిన గురుతర బాధ్యత మనపైన పూర్తిగా వుంది.  ఒక వైపు దేశం సర్వతోముఖాభివృద్ధిని సాధిస్తోంది, జాతీయ సంపద బాగా పెరుగుతోంది, మరొక వైపు ఇటువంటి దుస్సంఘటనలు జరుగుతున్నాయి. ఇన్ని రకాలైన విభిన్న మతాలు, జాతులు, సంస్కృతులతో ఉన్న భారతదేశం – ' భిన్నత్వంలో ఏకత్వం ' అనే పద్ధతితో, ఆలోచనతో తన సెక్యులర్ వాదాన్ని పూర్తిగా నిలబెట్టుకుంటూ, దేశంలో మైనారిటీలకు కూడా పూర్తి స్థాయి స్వేచ్ఛను కల్పిస్తూ, అందరినీ కలుపుకుని పోగలగిన పరిస్థితి భారతదేశంలో వుంటే , భారత ప్రజాస్వామ్యం తన గట్టి తనాన్ని నెలబెట్టుకుంటుంటే – ఏదో ఒక విధంగా ఆటంకాలు కల్పిస్తూ ఈ దేశం ప్రగతి పథంలో ముందుకు పోకూడదు, ఈ దేశానికి విదేశీ పెట్టుబడులు రాకూడదు, ఈ దేశం పారిశ్రామికంగా ఎదగకూడదు, ఈ దేశం ప్రపంచ దేశాల ముందు తలెత్తుకుని నిలబడగలిగే పరిస్థితి రాకూడదనే దురుద్దేశ్యంతో , ప్రక్క దేశాలనుంచి మరీ ముఖ్యంగా పాకిస్తాన్ భూభాగాన్ని ఈ ఉగ్రవాద ముఠాలు మన దేశంలో చొరబడడానికి ఉపయోగించుకుంటున్నాయంటే అది చాలా తీవ్రమైన విషయం .  మన ప్రక్కన వున్న దేశం వారి భూభాగాన్ని ఏరోజైనా ఈ తీవ్రవాద, ఉగ్రవాద ముఠాలు వాడుకోవడానికి అవకాశం ఇవ్వడమంటే అది చాలా బాధాకరమైన విషయం, అది చాలా తీవ్రంగా పరిగణించవలసిన విషయం .

ఉ 11.00

మన దేశ సార్వభౌమత్వానికి నష్టం కలిగించే ఏ ఒక్క చర్య అయినా తెలిసిగానీ, తెలియకుండా గానీ పక్కనున్న దేశాలకు ఏ ఒక్కటికీ కూడా కొంచెం కూడా అవకాశం ఇవ్వకుండా జాగ్రత్త వహించవలసిన అవసరం వుంది.  వారి భూభాగం నుండే మన దేశం పైన విదేశీ ముఠాలు నేరుగా యుద్ధం చేసే పరిస్థితులలోకి వస్తున్నాయంటే ఇది కేంద్ర ప్రభుత్వం కూడా చాలా తీవ్రంగా పరిగణిస్తుంది. ఇటువంటి పరిస్థితిని రానివ్వకూడదు.  ఇటువంటి పరిస్థితిని పూర్తిగా ఖండించవలసిన అవసరం పూర్తిగా ప్రతి ప్రజాస్వామ్యవాది పైన వుంది.  ముంబైలో ఉగ్రవాదులను తుదముట్టించే కార్యక్రమంలో చాలామంది పోలీసులు మరణించడం చాలా బాధాకరమైన విషయం.  ఈ సంఘటనలో చాలా వీరోచితంగా పోరాడి తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన ఐపియస్ మరియు ఆర్మీ అధికారులు అశోక్ కామ్టే, హేమంత్ కర్కరే, విజయ సలాస్కర్, సందీప్ ఉన్నికృష్ణన్, గజేంద్ర సింగ్ వంటి వారి త్యాగాలను మన జాతి ఎప్పటికీ మరవలేదు.  ఈ వీరులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున మనందరమూ గౌరవ వందనం చేయవలసిన అవసరం వుంది.  వారి త్యాగాలకు మనమందరమూ గర్వించవలసిన అవసరం వుంది.  ముంబైలో నరహంతకులతో సాగిన భీకర సంగ్రామంలో దాదాపుగా విజయాన్ని వరించిన భారతజాతి ముద్దు బిడ్డలు మన వీరజవాన్‌లు అందరికీ మనం జేజేలు చెప్పాలి.  ఈ వీర జవాన్‌లలో ముఖ్యంగా నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ సంక్షోభ సమయంలో మేమున్నామని అంటూ వారు చేసిన సాహసోపేతమైన చర్యలు మనందరికీ ఒక ఊరట, ఒక రకంగా గర్వ కారణం.  ఈ యన్‌యస్‌జి కమాండోస్

మొన్ననే కాకుండా ఇంతకు ముందు కూడా తీవ్రమైన సంఘటనలలో ఎప్పుడూ కూడా వారి శక్తియుక్తులను బాగా ప్రదర్శించారు. 2002వ సంవత్సరంలో గుజరాత్‌లోని అక్షరథామ్ ఆలయాన్ని ఉగ్రవాదుల చెర నుండి విడిపించిన సంఘటనలో కూడా యన్‌యస్‌జి కమాండోస్ యొక్క శక్తియుక్తులు బాగా ఉపయోగపడ్డాయి. ఆ యన్‌యస్‌జి దళంలో ముంబై దుశ్చర్యలలో ''ఆపరేషన్ సైక్లోన్''లో ఇద్దరు తెలుగు తేజాలు వుండడం మనకు గర్వ కారణం. అందులో ఒకరు వరంగల్ జిల్లాకు చెందిన బందిగ ప్రమోద్ కాగా, మరొకరు కరీంనగర్‌కు చెందిన అంబేద్కర్, మరో తెలుగు తేజం ఆర్మీలో నాసిక్ రెజిమెంట్‌లో పనిచేస్తూ టెర్రరిస్ట్‌ల చెర నుండి తాజ్ హోటల్‌ను విముక్తి చేసేందుకు చేపట్టిన ''ఆపరేషన్ సైక్లోన్''లో వీరోచితంగా పోరాడాడు, ఉగ్రవాదులను మట్టుబెట్టాడు. అతడు కడప జిల్లా కలసిపాడు మండలం ఎగువ రామాపురానికి చెందిన బాలాయపల్లి దస్తగిరి సాహెబ్. ఇంకొక విషాదమైన విషయం ఏమంటే ఈ ముంబై సంఘటనలో మన రాష్ట్రానికి చెందిన ముగ్గురు మృతి చెందడం మనందరికీ చాలా బాధాకరమైన విషయం. వారిలో ఒకరు లక్ష్మీనారాయణ గోయల్. రైల్వే స్టేషన్‌కు ఆలస్యంగా వెళ్లి హుస్సేన్‌సాగర్ ఎక్స్‌ప్రెస్‌ను అందుకోలేకపోయి మృత్యువాత పడడం చాలా బాధాకరం, దురదృష్టకరం. ఆయనతోపాటే ముంబై తాజ్ హోటల్‌లో పని చేస్తున్న మన రాష్ట్రానికి చెందిన హైదరాబాద్ నివాసి విజయరావు బాంజ్యా, మరొకరు నిజామాబాద్‌కు చెందిన 20 ఏళ్ల యువతి అమీనా బేగం. వీళ్ల ముగ్గురూ కూడా ఉగ్రవాదుల దుశ్చర్యలకు బలికావడం ఎంతైనా బాధాకరమైన విషయం, విచారకరం. ఈ ముగ్గురి మృతుల కుటుంబాలకు మహారాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తున్నప్పటికీ మన రాష్ట్ర ప్రభుత్వం కూడా మన బాధ్యతగా భావించి వాళ్లు మన వాళ్లు కనుక మృతుల కుటుంబాలకు చెరి మూడు లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందజేయాలని నిర్ణయించాము. ఉగ్రవాదుల యొక్క ఒకే ఒక్క ఆలోచన ఏమంటే ఏదో ఒక విధంగా మన దేశంలో మత కల్లోలాలు రెచ్చగొట్టాలి, ఈ దేశంలో అన్ని మతాల వాళ్లూ సమరస భావంతో వుండకూడదు. ఏదో ఒక విధంగా ఒక మతం మరొక మతం పైన విద్వేషాలను రెచ్చగొట్టుకొనే ప్రయత్నం చేయాలనే ఒకే ఒక్క ఆలోచనతో అధ్యక్షా. ఈ దేశానికి సంబంధించిన ప్రతి మైనారిటీ వర్గానికి కూడా, నాకు తెలిసినంతవరకూ నూటికి 99.9999 శాతం మైనారిటీ వర్గాల వారందరూ కూడా ఇటువంటి దుశ్చర్యలను ఖండించడంలో ఏ మాత్రం వెనుకాడడం లేదు. ఇటువంటి దుశ్చర్యలు జరిగినప్పుడు ఏదో మైనారిటీ వర్గాల వాళ్లు దీని వెనుక వున్నారు, ముందున్నారనే భావన ఏ ఒక్క మెజారిటీ వర్గంలో కూడా రానివ్వకుండా వారందరూ మన అన్నదమ్ములు అనే పద్ధతిలో మనం ఇంకా గట్టిగా వ్యవహరించగలిగితే దీనికి సంబంధించిన ఇటువంటి చర్యలు మళ్లీ,మళ్లీ జరగకుండా బాగా గట్టి చర్యలు ప్రభుత్వాలు తీసుకోగలిగితే, అన్నింటికంటే ప్రధానంగా భారతదేశానికి సంబంధించిన ప్రతి రాజకీయ పార్టీ కూడా అన్ని విషయాలను పక్కన బెట్టి ఒక్క తాటిపైన నిలచి ఇటువంటి దుండగుల దుశ్చర్యలను ఖండించగలిగితే తప్పనిసరిగా అంతిమ విజయం మనదే. ప్రజాస్వామ్యాన్ని కొట్టగలిగిన శక్తి మరొక్కటి లేదన్న విషయాన్ని ఇటువంటి దుండగులు గుర్తుంచుకోవలసిన అవసరం వుంది. ఇవాళ ముంబై ఘటనల పట్ల, ముంబైలో జరిగిన సంఘటనల పట్ల భారత జాతి యావత్తూ ఒక్క తాటిపైన నిలిచే సందర్భంలో మనం తెలుగువాళ్లంగా, ఆంధ్ర ప్రదేశ్‌కి సంబంధించిన వాళ్లముగా పూర్తి జాతి ఒక్కటిగా నిలబడి ఇటువంటి దుశ్చర్యలను ఖండించడంలో భాగం కావాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.